@vaartanews @mvnewstv
మన మీ.. వార్త
ప్రతి అక్షరం... ప్రజల కోసం
తెలుగు దిన పత్రిక
www.mivaartanews.com
TGBIL/25/A0512
బుధవారం
11 నవంబర్ 2026
సూర్యపేట, హైదరాబాద్
MANA MI VARTA NEWS
సంపుటి : 02
సంచిక :128
పేజీలు : 12 వెల : 5/-

వార్త
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న మీ వార్తాన్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు,
నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు,
మండలాల వారీగా విలేకరులు కావలెను.
సీనియర్లకు ప్రాధాన్యం
కొత్తవారికీ అవకాశం ఉంటుంది
ఈ క్రింది నెంబర్లకు వాట్సప్ ద్వారా తమ వివరాలు పంపగలరు
91-8522888459 9515342857

PUBLISHED AT SURYAPETA | HYDERABAD | KHAMMAM | KARIMNAGAR | MAHABOOBNAGAR | NALGONDA | NIZAMABAD | WARANGAL | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KURNOOL | MANGALAGIRI | NELLORE



వాయు కాలుష్యంలోనూ 'విశ్వగురువు' కావాలా?

- దిల్లీలో విషవాయువులతో ఉక్కిరిబిక్కిరవుతున్న ప్రజలు
- 59 కాలుష్య పర్యవేక్షణ కేంద్రాల్లో 36 చోట్ల పీఎం2.5 వివరాలు కనిపించడం లేదని ఖర్గే ఆరోపణ
- కాలుష్య నివారణ నిధుల వినియోగంపై ప్రశ్నలు
- 'హవా కా హిసాబ్' చెప్పాలని ప్రధానికి సవాల్

అన్ని అంశాల పరిశీలన తర్వాతే ముందడుగు

రుణాలపై మారటోరియం



కరువు మండలాల్లో రైతు రుణాల వసూళ్లపై ఏడాదిపాటు నిషేధం

ఎస్ఎల్బీసీ భేటీలో నిర్ణయం

తీవ్ర కరువు మండలాల్లో రుణాలు ఐదేళ్ల పాటు చెల్లించేలా వెసులుబాటు

ఓ మోస్తరు కరువు మండలాల్లో మూడేళ్లలో చెల్లించేందుకు చాన్స్

రుణ గ్రహీతలు ముందుకు రాకపోయినా సుమోటోగా చర్యలు

కొత్త రుణాలు కూడా మంజూరు చేయనున్న బ్యాంకులు



ప్రపంచ సంక్షోభాల్లో భారత్ వైపే చూపు

- మోదీ నాయకత్వంపై బీజేపీ వ్యాఖ్యలు
- మోదీకి ప్రపంచ నేతల్లో విస్తృత ఆదరణ ఉందన్న బీజేపీ
- గత 12 ఏళ్లలో భారత్ ప్రతిష్ఠ పెరిగిందని వెల్లడి
- విదేశాంగ అంశాలపై జాగ్రత్తగా మాట్లాడాలన్న కాంగ్రెస్
- భారత్-ఉక్రెయిన్ సంబంధాల బలోపేతంపై జెలెన్స్కీ-మోదీ చర్చ
- శాంతియుత పరిష్కారానికి సహకరిస్తామని మోదీ హామీ



- కాళేశ్వరం అదనపు టీఎంసీ పనులపై తొందరపాటు వద్దు..
- అధికారులకు సీఎం రేవంత్ కీలక ఆదేశాలు!
- గత ప్రభుత్వ తప్పులు పునరావృతం కావొద్దు
- సుప్రీంకోర్టు కేసుల పురోగతి పరిశీలించాకే భూసేకరణ
- సీడబ్ల్యూసీ అనుమతులు, సమగ్ర డీపీఆర్ తప్పనిసరి
- డిండి, అచ్చంపేట పనులు వేగవంతం చేయాలని ఆదేశం

హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టు అదనపు టీఎంసీ పనుల విషయంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులు పునరావృతం కాకుండా అన్ని అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి ముందుకు వెళ్లాలని సూచించారు. ఇప్పటికే రెండు టీఎంసీల నీటిని పూర్తిస్థాయిలో తరలించలేని పరిస్థితి ఉన్నప్పుడు అదనపు టీఎంసీ పనుల విషయంలో మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతిని పరిశీలించిన తర్వాతే భూసేకరణ చేపట్టాలని సూచించారు. కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) అనుమతులు పొందడంతో పాటు సమగ్ర వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) సిద్ధం చేసుకోవాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

సాగునీటి ప్రాజెక్టులపై సీఎం సమీక్ష

హైదరాబాద్‌లోని ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీలో ఉన్న బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సాగునీటి శాఖపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, అడ్వొకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి, సుప్రీంకోర్టు - మిగతా 9లో

ఏ హోదాలో ఉన్నా గతాన్ని మర్చిపోవద్దు



- నూతన డీఎస్పీలకు సీఎం రేవంత్ దిశానిర్దేశం!
- 112 మంది శిక్షణ పూర్తి చేసిన డీఎస్పీలతో సీఎం ముఖాముఖి
- అధికారుల నిర్ణయాలే ప్రభుత్వ పనితీరుకు గీటురాయి
- బాధితుల సమస్యలను ఓపికగా వినాలి
- సైబర్ నేరాలు, డ్రగ్స్, ఆహార కల్తీపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్

ఏ హోదాలోకి వెళ్లినా మన గతాన్ని, వచ్చిన నేపథ్యాన్ని మర్చిపోవద్దని నూతన డీఎస్పీలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచించారు. మనం వచ్చిన పరిస్థితులను మరిచిపోతే చేపట్టిన హోదాకు న్యాయం చేయలేమని అన్నారు. రాష్ట్ర భవిష్యత్తును రాబోయే 30 ఏళ్లలో ఎలా తీర్చిదిద్దాలన్నది యువ అధికారుల చేతుల్లోనే ఉందని పేర్కొన్నారు. అధికారులు తీసుకునే నిర్ణయాలే ప్రభుత్వ పనితీరుకు గీటురాయిగా మారుతాయని స్పష్టం చేశారు. తెలంగాణ పోలీస్ అకాడమీలో శిక్షణ పూర్తి చేసుకున్న 112 మంది డీఎస్పీలతో నిర్వహించిన ముఖాముఖి - మిగతా 9లో



త్వరలో ఇందిరమ్మ ఎంఐజీ టవర్స్!

ఇప్పటికే పలు నియోజకవర్గాల్లో స్థలాలు రిజర్వ్

మరికొన్నింటిలో స్థలాల గుర్తింపు కోసం అన్వేషణ

ఎల్ఐజీ తొలివిడత ప్రక్రియ పూర్తికాగానే ఎంఐజీ నోటిఫికేషన్

హైదరాబాద్:

మహా హైదరాబాద్ పరిధిలో పేదల సొంత ఇంటి కలను సాకారం చేసేందుకు ఇందిరమ్మ టవర్స్ పేరుతో ఎల్ఐజీ గృహాల ప్రక్రియను శరవేగంగా కొలిక్కి తెచ్చిన హౌసింగ్ బోర్డు ఇప్పుడు మిడిల్ ఇన్ కమ్ గ్రూప్ (ఎంఐజీ) టవర్ల నిర్మాణంపై దృష్టి సారించింది. - మిగతా 9లో

బ్రిటీష్ కాలం నాటి మానవ అవశేషాలను భారత్‌కు అప్పగించిన ఆక్స్‌ఫర్డ్ మ్యూజియం!



- బ్రిటిష్ కాలంలో ఆక్స్‌ఫర్డ్ మ్యూజియానికి చేరిన నాగాల మానవ అవశేషాలు
- తిరిగి అప్పగించేందుకు అంగీకరించిన మ్యూజియం
- 30 మంది నాగా ప్రతినిధులతో బ్రిటన్‌లో ఒప్పందం
- పుర్రెలతో కూడిన ఈ అవశేషాలు 1910--1940 మధ్య ఆక్స్‌ఫర్డ్‌కు చేరినట్లు అంచనా
- ఒకే స్మారక స్థలం వద్ద గౌరవప్రదంగా సమాధి చేయాలని గిరిజన నాయకుల నిర్ణయం



సముద్ర గర్భంలోకి భారత్ సాహసయాత్ర..

- సముద్రయాన్ ప్రాజెక్టులో భాగంగా 'మత్స్య-6000' జలాంతర్గామిని అభివృద్ధి చేస్తోన్న భారత్
- ముగ్గురు వ్యక్తులను 6 వేల మీటర్ల లోతుకు తీసుకెళ్లేలా దీని రూపకల్పన
- 600 బార్‌ల నీటి ఒత్తిడిని తట్టుకునేలా టైటానియంతో గోళాకార గది నిర్మాణం



మోదీతో పెద్దగా పరిచయం లేదు..
ఎదురుపడినా కళ్లలోకి చూడరు

- కొత్త పుస్తకం 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్'లో ప్రధాని మోదీపై వ్యాఖ్యలు
- రాజకీయ ప్రయాణాలు, దేశంపై దృక్పథాలు వేర్వేరని వెల్లడి
- రాజీవ్ గాంధీ హత్యకు సంబంధించిన విషాద జ్ఞాపకాలను పంచుకున్న కాంగ్రెస్ అగ్రనేత

సంపాదకీయం

ట్రంపిజానికి ఎదురుదెబ్బ

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు 2026 మధ్యావధి ఎన్నికల్లో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. 2024 అధ్యక్ష ఎన్నికల్లో ఘన విజయం సాధించి, కాంగ్రెస్‌లోనూ రిపబ్లికన్ల ఆధిపత్యంతో దూకుడుగా వ్యవహరిస్తూ వస్తున్న ట్రంప్ ప్రయాణానికి రెండేండ్లకే అడ్డుకట్ట పడింది. ప్రతినిధుల సభలో డెమోక్రాట్లు 254 విజయం సాధించగా, రిపబ్లికన్లు 162 సీట్లకే పరిమితమయ్యారు. సెనేట్‌లో డెమోక్రాట్లు 54 మంది, రిపబ్లికన్లు 44 మంది గెలుపొందారు. ఇక ప్రతినిధుల సభతోపాటు సెనేట్‌లోనూ డెమోక్రాట్లు మెజారిటీ సాధించడం ఆ దేశ రాజకీయాల్లో కీలక మలుపు. ఇప్పటివరకు ట్రంప్ తీసుకున్న అనేక నిర్ణయాలకు రిపబ్లికన్ ఆధిక్యంలోని కాంగ్రెస్ పెద్దగా అడ్డంకులు సృష్టించలేదు. ఇకపై పరిస్థితి అలా నల్లేరు మీద నడకలా మాత్రం ఉండబోదు. అయితే ఎన్నికల ఫలితాల తర్వాత ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యతను సంతరించుకున్నాయి. ఓటమిని హుందాగా అంగీకరించకుండా తాను పోటీలో చేయలేదు కాబట్టి, ఫలితాలు ఇలా ఉన్నాయని, పోటీలో ఉండి ఉంటే మరోలా ఉండేవన్నారు. ఇదంతా కూడా తన పరాజయాన్ని పలుచనే చేసి చూపించే ప్రయత్నమేనని స్పష్టంగా అర్థమవుతున్నది. అంతేకాకుండా డెమోక్రాట్లు తీసుకొచ్చే బిల్లులను వీటో చేస్తానంటూ హెచ్చరించడం ట్రంప్ తెంపరితనానికి తాజా తార్కాణం. ఇక్కడే చర్చ ఆసక్తికరంగా మారింది. ట్రంప్ చేతిలో ఇంకా వీటో అధికారం ఉన్నది. తనకు నచ్చని బిల్లులను తిరస్కరించవచ్చు. కానీ కాంగ్రెస్‌లో మూడింట రెండొంతుల మెజారిటీతో ఆ బిల్లులను మళ్లీ ఆమోదిస్తే అధ్యక్షుడి వీటో కూడా పని చేయదు. ప్రస్తుతానికి డెమోక్రాట్లకు ఆ స్థాయి బలం లేదు. అయినప్పటికీ కాంగ్రెస్‌పై పట్టు కోల్పోవడం ట్రంప్‌కు చిన్న పరాభవం కాదు. అగ్రరాజ్య మధ్యావధి ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకమైనవి. తాజా ఫలితాలు ట్రంప్ వ్యక్తిగత రాజకీయ ప్రతిష్టకు మాత్రమే కాదు, ఆయన పాలనా విధానాలకూ ప్రజల నుంచి ఎదురైన ప్రశ్నలుగా చూడాలి. ద్రవ్యోల్బణం, జీవన వ్యయం, టారిఫ్‌ల విధింపు, ఇమ్మిగ్రేషన్ దాడులు, ఇరాన్ యుద్ధం వంటి అంశాలు ఓటర్ల నిర్ణయాన్ని ప్రభావితం చేశాయి. ఇప్పు డు అమెరికా కాంగ్రెస్‌లో అధ్యక్షుడికి అధికారం ఉంటుంది. కానీ దానికి హద్దులు ఉంటాయి. ట్రంప్‌కు ఇప్పుడు మిగిలింది రెండేండ్ల పదవీకాలం మాత్రమే. మిగిలిన ఈ కాలంలో గతం లో మాదిరిగా ఏకపక్షంగా నియంతృత్వ ధోరణిని అనుసరిస్తానంటే కుదరదు. ఉభయ సభ ల్లో సంఖ్యాబలంతో డెమోక్రాట్లు ముకుతాడు వేయగలరు. ప్రజల తీర్పు ట్రంప్‌కు రాజకీయ హెచ్చరిక మాత్రమే కాదు, ప్రజాస్వామిక హద్దులను దాటుతున్న పోకడలకు కొరడా దెబ్బ. తాజా ఎన్నికల ఫలితాలు అమెరికాలోని పాలన, ప్రపంచ దేశాలపై ఎలాంటి ప్రభావం చూపుతాయనేది కూడా చర్చనీయాంశమే. ఇకపై ట్రంప్ ప్రతిపాదించే చట్టాలకు డెమోక్రాట్ల నుంచి ప్రతిఘటన ఎదురయ్యే అవకాశమున్నది. ప్రభుత్వ విధానాలపై విచారణలు, పరిపాలనా నిర్ణయాలపై ప్రశ్నలు ఎదుర్కోకతప్పదు. బడ్జెట్ కేటాయింపుల విషయంలోనూ అధ్యక్షుడికి రాజకీయ సవాళ్లు తలెత్తుతాయి. జనవరి నుంచి ప్రారంభం కానున్న కొత్త కాంగ్రెస్ ఇరాన్ యుద్ధం, సర్కార్ అవినీతి ఆరోపణలపై విచారణలు ప్రారంభిస్తుందని అమెరికా రాజకీయవర్గాల్లో సంకేతాలు వెలువడుతున్నాయి. సుప్రీంకోర్టు జడ్జిలు, మంత్రుల నియామకాలను కూడా డెమోక్రాట్లు అడ్డుకోవచ్చు. డెమోక్రాట్లు లీగల్ ఇమ్మిగ్రేషన్‌కు అనుకూలం. కాబట్టి హఠాత్తుగా రూల్స్ మారుతాయనే భయం తగ్గుతుంది. గ్రీన్ కార్డు బ్యాక్‌లాగ్‌కు కూడా అవకాశాలు పెరుగుతాయి. కానీ వెంటనే పెద్ద పెద్ద సంస్కరణలు వస్తాయని మాత్రం అనుకోలేం. అయితే గియితే విద్యార్థులు, ఉద్యోగులకు ఊరట కలుగవచ్చు. టెక్సాస్, జార్జియా, ఓహియో వంటి తెలుగు విద్యార్థులు ఎక్కువగా ఉన్న రాష్ట్రాల్లో డెమోక్రాట్ గవర్నర్లు గెలుపొందడం మంచి పరిణామం. కానీ ప్రత్యక్షంగా గానీ, ఆన్‌లైన్ విద్వేష వ్యక్తీకరణ పట్ల గానీ మనవాళ్లు సంయమనం పాటించాల్సిన అవసరమున్నది. అమెరికాలోని తాజా రాజకీయ పరిణామాలతో టారిఫ్‌లు తగ్గి, భారత్‌తో వాణిజ్యం మళ్లీ కుదుటపడితే ఇండియన్ ఐటీ, ఫార్మా కంపెనీలకు మేలు జరుగుతుందని ఆశించవచ్చు. గెలిచిన వారిలో భారత సంతతికి చెందిన ప్రముఖులు కూడా ఉండటం విశేషం. మొత్తంగా ఎన్ని అడ్డదారులు తొక్కి అయినా అధికారం దక్కించుకోవాలని అనుకునేవాళ్లకు, నియంతలుగా తామే కొనసాగుతామని విర్రవీగేవాళ్లకు ట్రంప్‌కు తగిలిన ప్రజాస్వామిక దెబ్బ కచ్చితంగా ఒక గుణపాఠం అనే చెప్పాలి.

సామాన్యుడికి భారంగా బియ్యం ధరలు



తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనలో పంజాబ్, ఏపీ వంటి రాష్ట్రాలను అధిగమించేలా ధాన్యం పండించి అగ్రస్థానంలో నిలిచింది. ఈ తర్వాత వచ్చిన కాంగ్రెస్ హయాంలో ధాన్యం ఉత్పత్తి మాట అటుంచి, బియ్యం ధరలు భారంగా మారుతున్నాయి. ఇప్పటికే రాష్ట్రంలోని హైదరాబాద్ సహా పలు ప్రాంతాల్లో సన్నబియ్యం కిలో ధర రూ.85 నుంచి రూ.90కు చేరింది. గతంలో రూ.50 నుంచి రూ.55కు లభించిన కొన్ని రకాల బియ్యం ధరలు నాలుగు నెలల్లోనే గణనీయంగా పెరిగాయి. ధరల పెరుగుదలకు సాగు విస్తీర్ణం తగ్గడం, వాతావరణ ప్రభావం, ఇతర రాష్ట్రాల వ్యాపారుల కొనుగోళ్లు, స్థానిక సరఫరా తగ్గడం వంటి కారణాలను వ్యాపారులు, మిల్లర్లు చెప్తున్నారు. తెలంగాణ సన్నధాన్యానికి ఇతర రాష్ట్రాల్లో డిమాండ్ ఉండటం రైతుకు మెరుగైన ధర లభించే అవకాశాన్ని కల్పిస్తున్నది. అక్టోబర్ 13న వెలువడిన నివేదిక ప్రకారం.. కొన్ని రకాల ధాన్యానికి క్వింటాల్‌కు రూ.4,000 నుంచి రూ.4,600 వరకు ప్రైవేట్ కొనుగోలు ఆఫర్లు వచ్చాయి. అక్టోబర్ 26న మరో నివేదికలో సాధారణ సన్నధాన్యం రకాలకు రూ.3,100 నుంచి రూ.3,700 ధరలు పలికింది. మహబూబాబాద్ జిల్లా కేసముద్రంలో ఒక మేలు రకం క్వింటాల్‌కు రూ.5,016 పలికింది. ఈ ధరల వ్యత్యాసం రకం, నాణ్యత, ప్రాంతం, కొనుగోలుదారును బట్టి రైతు ఆదాయం మారుతుందని సూచిస్తున్నది. అయితే ధాన్యం ధర పెరిగిందనే కారణంతో బియ్యం ధర కూడా అదే నిష్పత్తిలో పెరగాల్సిన అవసరం లేదు. రైతు నుంచి మిల్లుకు, అక్కడి నుంచి హోల్‌సేల్ వ్యాపారి, చిల్లర దుకాణం వరకు ప్రతి దశలో ఖర్చులు, మార్జిన్లు చేరుతాయి. అక్టోబర్ 5న వెలువడిన నివేదికలో హెచ్‌ఎంటీ ముడిబియ్యం 25 కిలోల సంచి లెక్కన కిలోకు సగటు రూ.69గా ఉండగా, కిరాణా దుకాణాల్లో అదే రకం కిలోకు రూ.78కు విక్రయించారు. ఈ రెండింటి మధ్య రూ.9 వ్యత్యాసం ఉన్నది. ఇది మొత్తం చిల్లర వ్యాపారి లాభం కాదు; రవాణా, నిల్వ, ప్యాకింగ్, పంపిణీ, దుకాణ నిర్వహణ ఖర్చులూ ఉంటాయి. ధాన్యం నుంచి బియ్యం తయారీ లెక్కను పరిశీలిస్తే ధరల నిర్మాణం మరింత స్పష్టమవుతుంది. కాగ్ 2015 పనితీరు ఆడిట్ ప్రకారం 100 కిలోల ధాన్యం నుంచి సాధారణంగా 67 కిలోల ముడి బియ్యం లేదా 68 కిలోల ఉప్పుడు బియ్యం రావాలని మిల్లింగ్ ప్రమాణం చెప్తున్నది. ఇది అన్ని రకాల ధాన్యాలకు హామీ ఇచ్చే స్థిర దిగుబడి కాదు; ధాన్యం నాణ్యత, తేమ, రకం, మిల్లింగ్ విధానాన్ని బట్టి మారుతుంది. మిల్లింగ్, విద్యుత్తు, కార్మికుల వేతనాలు, నిల్వ, రవాణా, ప్యాకింగ్, వడ్డీ వంటి ఖర్చులు కలుస్తాయి. మరోవైపు తవుడు, పొట్టు, నూకలు వంటి ఉప ఉత్పత్తుల విక్రయం ద్వారా ఆదాయం వస్తుంది. కాబట్టి ధాన్యం ఖర్చు నుంచి బియ్యం ధరను తీసివేసి మిగిలిన మొత్తాన్ని మిల్లర్ లాభంగా చెప్పడం సరికాదు. మిల్లింగ్ దిగుబడి, ఉప ఉత్పత్తుల విలువ, వాస్తవ ఖర్చులు, హోల్‌సేల్, చిల్లర ధరలను కలిపి ప్రభుత్వం వెల్లడిస్తేనే ధరల పెరుగుదల్లో అసలు వ్యత్యాసం ఎక్కడ ఏర్పడుతున్నదో తెలుస్తుంది. రైతు ఆదాయాన్ని కూడా వాస్తవికంగా లెక్కించాలి. సీఏసీపీ నివేదికను ఉటంకిస్తూ 2026 మే 15న వెలువడిన వార్తల ప్రకారం.. తెలంగాణలో వరి ఉత్పత్తి వ్యయం ఎకరాకు సుమారు రూ.46,800 అవుతుంది. ఇది నివేదికలోని అంచనా మాత్రమే; ప్రాంతం, దిగుబడి, కౌలు, నీటి వసతి, పెట్టుబడి, కుటుంబ శ్రమ ఆధారంగా రైతు వాస్తవ ఖర్చు మారుతుంది. 202627 మార్కెటింగ్ సీజన్‌కు గ్రేడ్-ఏ ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2,461 కనీస మద్దతు ధరగా నిర్ణయించారు. ప్రభుత్వం గుర్తించిన ఏడు సన్నధాన్య రకాలకే అదనంగా రూ.500 బోనస్ వర్తిస్తుంది. అర్హమైన రకానికి మొత్తం రూ.2,961 చొప్పున లెక్కిస్తే 26 క్వింటాళ్లకు రూ.76,986 స్థూల ఆదాయం వస్తుంది. ఉదాహరణకు తీసుకున్న రూ.46,800 ఉత్పత్తి వ్యయాన్ని తీసివేస్తే సుమారు రూ.30,200 మిగులుతుంది. ఇది నికర లాభం కాదు; కౌలు, వడ్డీ, ఇతర ఖర్చులు, కుటుంబ శ్రమ విలువను బట్టి వాస్తవ ఆదాయం మారుతుంది. అదే ధాన్యాన్ని ప్రైవేట్ వ్యాపారి క్వింటాల్‌కు రూ.4,000 నుంచి రూ.4,600 చొప్పున కొనుగోలు చేస్తే 26 క్వింటాళ్లకు రూ.1,04,000 నుంచి రూ.1,19,600 స్థూల ఆదాయం వస్తుంది. పైన పేర్కొన్న ఉత్పత్తి వ్యయాన్ని తీసివేస్తే రూ.57,200 నుంచి రూ.72,800 మధ్య మిగులుతుంది. ప్రతి రైతుకూ ఈ ధర లభిస్తుందని భావించరాదు. పంట చేతికొచ్చిన వెంటనే అమ్ముకోవాల్సిన పరిస్థితి, నిల్వ సదుపాయాల కొరత, అప్పుల ఒత్తిడి రైతు బేరసారాల శక్తిని తగ్గిస్తున్నాయి. నిల్వ చేయగలిగే సామర్థ్యం, మిల్లింగ్ సదుపాయం, మార్కెట్ సమాచారం, ఆర్థిక వనరులు ఉన్నవారికి మాత్రం కొనుగోలు, సరఫరాపై ఎక్కువ ప్రభావం ఉంటుంది. ఈ ఖరీఫ్‌లో 65 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు కోసం, 8,283 కేంద్రాలను ఏర్పాటు చేస్తామని ప్రభుత్వం తెలిపింది. అక్టోబర్ 26 నాటికి రెండువేల కేంద్రాలు కూడా ప్రారంభం కాలేదు. ఈ అలసత్వం వల్ల రైతులు ప్రైవేట్ వ్యాపారులపై ఆధారపడాల్సి వస్తుంది. ప్రభుత్వ గిడ్డంగుల్లో అక్టోబర్ 16 నాటికి 9.64 లక్షల టన్నుల బియ్యం ఉండగా, మిల్లర్ల నుంచి మరో 18.39 లక్షల టన్నుల కస్టమ్ మిల్లింగ్ బియ్యం రావాల్సి ఉన్నదని అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ నిల్వలు, మిల్లుల వద్ద ఉన్న బియ్యం, ప్రైవేట్ వ్యాపారుల నిల్వలు, బహిరంగ మార్కెట్ సరఫరా వివరాలను వేర్వేరుగా ప్రకటించాలి. అక్రమ నిల్వలపై అనుమానాలుంటే తనిఖీలు జరిపి ఆధారాలతో చర్యలు తీసుకోవాలి. ధాన్యం పండుతున్న రాష్ట్రంలో బియ్యం ధరలు సామాన్యుడికి భారమవుతున్నాయంటే, సమస్య పంటలో మాత్రమే లేదు; పంట నుంచి వినియోగదారుడి చేతికి చేరే మార్కెట్ వ్యవస్థలోనూ ఉన్నది. ఆ వ్యవస్థలో ఎవరు లాభపడుతున్నారు, ఎవరు నష్టపోతున్నారు అనేది ప్రభుత్వం పారదర్శకమైన లెక్కలతో వెల్లడించాలి.

సోదరి చేత భోజనం - భగినీ హస్త భోజనం
కార్తీక శుద్ధ విదియ పర్వదినం నవంబర్ 11న



భగినీ హస్త భోజనం
కార్తీక శుద్ధ విదియ నాడు సోదరి ఇంట సోదరుడు భోజనం చేయడమే 'భగినీ హస్త భోజనం'.
యమధర్మరాజు తన సోదరి యమున ఇంట భోజనం చేసి, ఆమె ఆతిథ్యానికి మెచ్చుకొని, అమ్మా! ఏదైనా వరం కోరుకోమనగా, అన్నా! ఈనాడు ఎవరు సోదరి ఇంట భోజనం చేసినా వారికి సంపూర్ణ ఆయుష్షు ప్రాప్తించేలా వరం ఇమ్మని కోరింది. 'తథాస్తు' అన్నాడు యమధర్మరాజు

1. సోదరి చేతి భోజనం
కార్తీక శుద్ధ విదియ పర్వదినం రోజున తన ఇంట భోజనం చేయకుండా సోదరి చేతి భోజనం చేయడమే భగినీ హస్త భోజనం.

2. పుష్టి -- ఆయుష్షు
ఇది పుష్టిని కలిగించి, సోదరుని ఆయుష్షును పెంచుతుందని యమధర్యరాజు చెప్పినట్లు సంప్రదాయం. కుటుంబ ఆప్యాయతలను పెంచే ఇటువంటి పర్వదినాలు ప్రోత్సహించదగినవి.

3. అక్కాచెల్లెళ్లకు సత్కారం
అన్నదమ్ములు అక్కాచెల్లెళ్లను పస్త్రాలంకారాలతో తృప్తిపరచాలని శాస్త్రం చెబుతోంది. పుట్టింటి మమకారం, అండదండలు స్త్రీలకు మానసిక బలాన్ని, ఉత్సాహాన్ని కలిగిస్తాయి.

4. అనుబంధాల పండుగ
అందరూ సోదరి చేతి భోజనం చేసి, బంధుత్వాన్ని బలపరచుకొని సుఖంగా ఉండాలి.
అకాల మృత్యుహరుడు ధర్మపురి యముడు
'భూషణవికాస శ్రీధర్మ పుర నివాస దుష్ట సంహార నరసింహ దురితదూర" అనే మకుటంతో భక్తాగ్రేసరులు శేషప్ప రాసిన నరసింహ శతక పద్యాల మాధుర్యాన్ని ఆస్వాదించని, తెలుగువారు ఉండరంటే అతిశయోక్తి కాదేమో. భారతీయ ప్రాచీన ఆర్ష విద్యా సభ్యతా సంస్కృతులకు పట్టు కొమ్మగా, హైందవ సనాతన సంప్రదాయాలకు నెలవుగా, అనాది కాలంగా హైందవ ధర్మ ప్రచారం కేంద్ర బిందువుగా, పవిత్ర గోదావరి నదీ తీరాన వెలసి, ఆస్తిక ప్రపంచానికి వరదాయిగా, భక్తి ముక్తి ప్రదాయినిగా విరాజిల్లుతున్నది సుప్రసిద్ధ గోదావరి తీరస్థ తీర్థమైన ప్రాచీన ధర్మపురి క్షేత్రం. తెలుగునేలపై సుప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా, దక్షిణ కాశీగా, నవ నారసింహ క్షేత్రాలలో ఉత్కృష్టమైనదిగా, హరి హర క్షేత్రంగా, పౌరాణిక, ఐతిహాసిక చారిత్రక ప్రాధాన్యతను సంతరించు కున్నది క్షేత్ర రాజ్యం. బ్రహ్మాండ, స్కందాది పురాణాలలో, ధర్మపురి క్షేత్ర ప్రాశస్త్యం నిక్షిప్తమై ఉంది. ఈ క్షేత్ర దేవస్థాన అంతర్గతంగా ఉన్న యమధర్మరాజు మందిరం, విశేష ప్రాధాన్యతను సంతరించుకుంది. భారతావనిలోనే అరుదుగా, అపురూ పంగా, క్షేత్రంలో వెలసిన "యమధర్మరాజును దర్శిస్తే", "యమపురి" ఉండబోదని ప్రతీతి. హిరణ్యకశిపుని సంహరించిన అనంతరం ఉగ్ర నరసింహ స్వామిని శాంతింప చేసేందుకు, బ్రహ్మాది దేవతలు పుణ్య తీర్థం, పవిత్ర క్షేత్రము అయిన ధర్మపురిలో తపో, యజ్ఞ, ధ్యానం ఆది సత్కర్మలను ఒనరించి నట్లు స్థల పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. ఒకానొక సమయాన యమధర్మరాజు, తన లోకమునందు అనేక శారీరక బాధలను అనుభవించుచున్న పాపులను గాంచి, నిట్టూర్పులు విడిచి, తనలో తాను విచారిం చెను. పుణ్యాత్ములను దర్శించిన చో పుణ్యము, పాపాత్ములను చూచినచో పాపమే లభించునని, నిత్యము పాపులను దర్శించుట వల్ల, తనకు పాప సంచయమే కలుగుతున్నదని, తనయందు స్వయంకృత పాపం అనునది ఏమాత్రము లేకున్ననూ, పాపుల నిత్య దర్శనంతో మనశ్శాంతి కలగడం లేదని తలంచి, మనశ్శాంతిని పొందుటకు పుణ్యక్షేత్ర దర్శన ప్రయానొమ్ముఖుడై, సమస్త క్షేత్రములను తిరిగెను. చివరకు ధర్మపురికి రాగా ఈ క్షేత్రమున గోదావరి నది స్నానము ఆచరించ గానే, యమునకు మనశ్శాంతి కలిగెనని, పాపాత్ముల దర్శన దోషములు తొలగెగని, బ్రహ్మాండం, స్కాంద పురాణాంతర్గత "ధర్మపురి క్షేత్ర మహాత్మ్యం" ఆధారంగా నైమిశారణ్యంలో సూత పౌరాణికుడు, శౌనకాది మహర్షులకు వివరించినట్లు నారదుడు పృథు మహారాజుకు క్షేత్ర మహిమను తెలిపినట్లు వివరించ బడింది.
యమధర్మరాజు నరసింహుని మందిరానికి ఏగి, చేసిన పూజలకు ప్రసన్నుడైన నరసింహుడు, యమధర్మరాజును తన సన్నిధిలో నివసించమని తెలిపెనని పురాణాల ఆధారం. యముడు గోదావరిలో స్నానమాచరించిన స్థలమునకు "యమ కుండము" అని పేరు కలిగినట్లు,



అచట స్నానమాచరించి, నరసింహుని పూజించు వారికి యమ లోక బాధలు కలుగకుండా ఉండు న్నట్లు, సర్వ పాప విముక్తి కలుగునట్లు, నరసింహుడు వరం ఇచ్చినట్లు, యమ ధర్మరాజు తన అంశ రూపమును, నరసింహ మందిర పురో భాగమున నిలిపెనని, పురాణాలు స్పష్టం చేస్తున్నాయి. దేవస్థానంలో యోగానంద నరసింహ ప్రధానాలయం ముందు భాగాన, ఉంది యమ ధర్మ రాజ మందిరం. కోరలతో, యమ దండాన్ని ధరించిన భీకరాకార ఆరు అడుగుల భారీ విగ్రహం ఇందుంది. "దక్షిణాదిభి ముఖీ గంగా, యత్ర దేవో నృకేసరి, తత్ర శ్రీర్విజయోర్భూతి: కాశ్య యశ్వత గుణం భవేత్", అని అని దక్షిణ అభి ముఖియై ప్రవహిస్తున్న గోదావరి తీరస్థమైన, ధర్మపురి క్షేత్రం విశిష్టతను కలిగి ఉన్నది. వేరే ఎక్కడ కాన రాని విధంగా, ధర్మపురి క్షేత్రం వద్ద గోదావరి దక్షిణ వాహినిగా ప్రవహిస్తు న్నది.
అష్టదిక్పాలకులలో ఒకరైన యముడు, దక్షిణ దిశకు అధిపతి. అంతేకాక గ్రహాల దృష్ట్యా, కుజుడు దక్షిణ దిశకు అధిపతి. కుజ గ్రహానికి మూలాధిపతి నరసింహుడు అని పరాశరుడు బృహత్ పరాశర హోరా శాస్త్రం నందు నుడివి ఉన్నాడు. కనుక ధర్మపురిలో దక్షిణ వాహినిగా ఉన్న గౌతమి యందు దక్షిణాభిముఖులై, స్నానాలు ఆచరిస్తే నరసింహూని దర్శిస్తే, నరక బాధలు ఉండవని భక్తుల ప్రగాఢ విశ్వాసం, ఇంతటి ప్రాధాన్యత సంతరిం చుకున్న ధర్మపురిలో వెలసిన యమ ధర్మరాజును దర్శించే భక్తుల సంఖ్య, నానాటికీ అధికమ వుతున్నది. ఇటీవల సంభవిస్తున్న అనూహ్య ప్రకృతి వైపరీత్యాల దృష్ట్యా, అకాల మృత్యు నివారణకై అధర్వణ వేదంలో పేర్కొనబడిన "ఆయుష్య సూక్తం" ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. అలాగే భరణి నక్షత్రం, చతుర్దశి తదితర ప్రత్యేక దినాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. గురు వారం యమ ద్వితీయ సంధర్భంగా, అభిషేకం, ఆయుష్య సూక్తం, యమ సూక్త మంత్రం, పురుష సూక్తం, శ్రీసూక్తం, జ్వర హర స్తోత్ర పఠనాలు, రోగ నివారణ సూక్తాలు పూజలు, యమాష్టకాది నిర్వహించేందుకు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.

కొలనుపాక కుమారస్వామి
వరంగల్, 9963720669

ప్రధాన తాగునీటి పైపులైన్ మరమ్మతు పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి





- జీడబ్ల్యూఎంసీ కమిషనర్ టి. వెంకన్న

మన మీ వార్త నవంబర్ 10 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

జీడబ్ల్యూఎంసి , నవంబర్ 10: దేశాయిపేట ప్రధాన ఫిల్టర్ బెడ్ నుంచి ఎంజీఎం ఆసుపత్రి, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, ఎల్బీ కళాశాల, వరంగల్ డెయిరీతో పాటు కాకతీయ కాలనీ తదితర ప్రాంతాలకు తాగునీరు సరఫరా చేసే ప్రధాన పైపులైన్ మరమ్మతు, మార్పిడి పనులను వేగవంతంగా పూర్తి చేసి, నీటి సరఫరాను పునరుద్ధరించాలని గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ టి. వెంకన్న అధికారులను ఆదేశించారు.

మంగళవారం ములుగు రోడ్డు వద్ద కొనసాగుతున్న ప్రధాన పైపులైన్ మార్పిడి పనులను కమిషనర్ ఇంజినీరింగ్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. నిజాం కాలం నాటి సుదీర్ఘకాలంగా వినియోగంలో ఉన్న పాత పైపులైన్‌లో ఏర్పడిన లీకేజీల కారణంగా మరమ్మతు పనుల్లో భాగంగా కొత్త పైపులైన్ ఏర్పాటు చేస్తున్న తీరును పరిశీలించి, పనుల్లో ఎలాంటి జాప్యం లేకుండా నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు.

ప్రత్యేకించి ఎంజీఎం, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల వంటి ప్రధాన వైద్య సంస్థలకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, అదేవిధంగా ఎల్బీ కళాశాల, వరంగల్ డెయిరీ, కాకతీయ కాలనీ తదితర ప్రాంతాల ప్రజలకు సైతం నీరు అందేలా త్వరతగతిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

పైపులైన్ పనులు పూర్తయిన వెంటనే పరీక్షలు నిర్వహించి, తాగునీటి సరఫరాను అందుబాటులోకి తీసుకురావాలని స్పష్టం చేశారు.

నగర ప్రజలకు, ముఖ్యంగా ఆసుపత్రులకు నిరంతర తాగునీటి సరఫరా కల్పించడంలో అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పనిచేయాలని కమిషనర్ సూచించారు. ఈ పర్యటనలో సూపరింటెండెంట్ ఇంజినీర్ రాజ్‌కుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవికుమార్, సంబంధిత ఇంజినీరింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

చిలుకానగర్‌లో నిబంధనల ప్రకారమే అభివృద్ధి పనులు చేపట్టాలి

- ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాకు వినతిపత్రం అందించిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్

చిలుకా నగర్, నవంబర్ 10 (మన మీ వార్త):

చిలుకానగర్ డివిజన్ పరిధిలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, మౌలిక వసతుల కల్పన పనులను ప్రభుత్వ నిబంధనలు, నిర్దేశిత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని చిలుకానగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ అధికారులను కోరారు. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మందుముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తాను కలిసి డివిజన్‌లోని పలు సమస్యలపై



వినతిపత్రం అందజేశారు.

ఈ సందర్భంగా రాజేష్ ముదిరాజ్ మాట్లాడుతూ.. చిలుకానగర్ డివిజన్ పరిధిలోని శ్మశానవాటికలో చేపడుతున్న అభివృద్ధి పనుల్లో భాగంగా కాంట్రాక్టర్ కొన్ని పాత సమాధులను ధ్వంసం చేస్తున్న విషయాన్ని జోనల్ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. దీనిపై స్పందించిన జోనల్ కమిషనర్ సంబంధిత అధికారులతో మాట్లాడి, పాత సమాధులకు ఎలాంటి నష్టం కలగకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే పనులు చేపట్టాలని కాంట్రాక్టర్‌కు, అధికారులకు సూచించినట్లు పేర్కొన్నారు.

అలాగే డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో నిర్లక్ష్యం వహించరాదని అధికారులకు సూచించినట్లు తెలిపారు. ప్రజల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని రాజేష్ ముదిరాజ్ పేర్కొన్నారు.

నల్లచెరువు--శేషసాయినగర్ రిటైనింగ్ వాల్ నిర్మాణానికి రూ.2 కోట్ల నిధులు మంజూరు

- విద్యుత్ స్తంభాల తరలింపులో జాప్యం లేకుండా పనులు వెంటనే ప్రారంభించాలి.. అధికారులకు పరమేశ్వర్ రెడ్డి సూచన

ఉప్పల్, నవంబర్ 10 (మన మీ వార్త):

ఉప్పల్ డివిజన్ పరిధిలోని మల్లికార్జున కాలనీ, శేషసాయినగర్ నుంచి నల్లచెరువు వరకు రిటైనింగ్ వాల్ నిర్మాణ పనుల కోసం రూ.2 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవతో ఈ నిధులు మంజూరైనట్లు తెలిపారు. రిటైనింగ్ వాల్ నిర్మాణం పూర్తయితే ఆయా ప్రాంతాల ప్రజలకు వరద ముప్పు తగ్గడంతో పాటు కాలనీలకు మెరుగైన రక్షణ లభించనుంది.

అయితే రెండు నెలల క్రితమే నిధులు మంజూరైనప్పటికీ, నిర్మాణ పనులకు విద్యుత్ స్తంభాలు అడ్డంకిగా మారడంతో పనులు ప్రారంభం కాలేదు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన పరమేశ్వర్ రెడ్డి మంగళవారం మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి సంబంధిత ప్రాంతాల్లో క్షేత్రస్థాయిలో పర్యటించారు. ఈ సందర్భంగా రిటైనింగ్ వాల్ నిర్మాణానికి ఎదురవుతున్న సమస్యలను అధికారులకు





వివరించి, పనులు ప్రారంభించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. ముఖ్యంగా నిర్మాణ పనులకు ఆటంకంగా ఉన్న విద్యుత్ స్తంభాలను వెంటనే తరలించాలని విద్యుత్ శాఖ అధికారులతో చర్చించారు. దీనిపై స్పందించిన విద్యుత్ శాఖ ఏడీ పోల్స్ షిఫ్టింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.విద్యుత్ స్తంభాల తరలింపు పూర్తయిన వెంటనే ఎలాంటి జాప్యం లేకుండా రిటైనింగ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభించి, నిర్ణీత సమయంలో పూర్తి చేసేలా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని పరమేశ్వర్ రెడ్డి కోరారు. ప్రజల భద్రత, కాలనీల రక్షణ దృష్ట్యా ఈ నిర్మాణ పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని స్పష్టం చేశారు.ఈ క్షేత్రస్థాయి పర్యటనలో టీజీసపీడీసీల్ డీఈ రవీందర్, ఏఈ నిఖిల్, డీఈ వెనీల్ గౌడ్, ఏఈ రాజ్ కుమార్, మోదుగు మోహన్ రెడ్డి, రంగనాథ్ గౌడ్, శేషసాయినగర్ కాలనీ అధ్యక్షులు అచ్చన శ్రీనివాస్, రాకేష్ నాయక్, సల్లా ప్రభాకర్ రెడ్డి, నర్సయ్య, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వరరావు, పూజారి హనుమంతు, పవన్ కుమార్, సురేష్, నరసింహారెడ్డి, విప్లవ్ రెడ్డి, ప్రశాంత్, వేణుగోపాల్ రెడ్డి, హనుమంతు, అనిల్ రెడ్డి, శివశంకర్, చారి, సోమిరెడ్డి, జగన్ రెడ్డి, వెంకటేశ్వర్లు కె., శ్రీనివాస్ జి., పి.సి. రావు, శ్యామ్, సందీప్, సత్తిరెడ్డి, గాలయ్య, నాగేష్, ఓబుల్ రెడ్డి, నారాయణ రెడ్డి, సమ్మయ్య, కొండల్ రెడ్డి, కృష్ణంరాజు, దీపక్, శ్రీనివాస్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మంచే బాలరాజుకు ఘన నివాళులర్పించిన నాయకులు

ఖానాపురం నవంబర్ 10(మల్లేష్ మీవార్త ప్రతినిధి) :

ఖానాపురం మండలం మనుబోతులగడ్డ గ్రామానికి చెందిన మంచే బాలరాజు ఇటీవల మృతి చెందగా, ఆయన దశదిన కర్మ కార్యక్రమానికి మార్కెట్ వైస్ చైర్మన్ , ఖానాపురం కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు శాఖమూరి హరిబాబు , సొసైటీ చైర్మన్ వల్లె శ్రీనివాస్ యాదవ్ ,కాంగ్రెస్ శ్రేణులు హాజరయ్యారు.

ఈ సందర్భంగా బాలరాజు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఈ సందర్భంగా బాలరాజు మృతి పట్ల వారు విచారం



వ్యక్తం చేస్తూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ఖానాపురం సొసైటీ డైరెక్టర్లు శివరాత్రి వెంకన్న, కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ బొంత శ్రీను, మండల పార్టీ సహాయ కార్యదర్శి మేకల వరదయ్య, మనుబోతులగడ్డ గ్రామ పార్టీ అధ్యక్షుడు ఎస్.కె. కమాలుద్దీన్,పిలిగిల్ల నాగరాజు యాదవ్, వార్డు సభ్యుడు ఆబోతు రవికుమార్ యాదవ్, మనుబోతులగడ్డ మాజీ సర్పంచ్ భూక్య నరసింహ నాయక్ , పోలు శ్రీను, కుంచం వెంకన్న, ఎండి మహబూబ్ పాషా, ఓర్సు సంపత్, శివరాత్రి యాకయ్య, ఎస్.కె. యాకూబ్ పాషా, వల్లెపు సాయిలు, ఎస్.కె. సైదులు, వల్లెపు నవీన్, వల్లెపు కృష్ణ, వేల్పుల కృష్ణ, బొంత శ్రీను, ఎస్.కె. కరీంపాషా తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపముఖ్యమంత్రి రేపు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో ఏర్పాట్లు పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

మన మీ వార్త నవంబర్ 10 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



కాజీపేట లోని జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ వారి బాలుర వసతి గృహం ప్రాంగణం లో నిర్మించ తలపెట్టిన తెలంగాణ పబ్లిక్ స్కూల్ కి రేపు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు బట్టి విక్రమార్క గారు శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో... ఏర్పాట్లను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి గారు.

కార్తీక మాసం సందర్భంగా పంచారామాల దర్శనానికి ప్రత్యేక బస్సులు

మన మీ వార్త నవంబర్ 10 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

-హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్



హన్మకొండ: కార్తీక మాసం సందర్భంగా శైవ క్షేత్రాలైన పంచారామాలకు హనుమకొండ నుండి ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు హనుమకొండ డిపో మేనేజర్ భూక్యా ధరంసింగ్ తెలిపారు. భక్తుల సౌకర్యార్థం తెలంగాణలోని రామప్ప శ్రీ రామలింగేశ్వరాలయం, లక్న వరం సరస్సు, మేడారం సమ్మక్క - సారలమ్మ, మల్లూరు శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం, బొగత జలపాతం, కాళేశ్వరంలోని శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం, భద్రాచలం శ్రీసీతారామచంద్రస్వామి దేవస్థానం లతో పాటు హైదరాబాదు రామోజీ ఫిలిం సిటీ, సాలార్‌జంగ్ మ్యూజియం, గోల్కొండ కోట, ఆంధ్ర ప్రదేశ్ లోని ప్రసిద్ధి చెందిన పంచరామ క్షేత్రాలైన అమరావతి , ద్రాక్షారామం, భీమవరం, పాలకొల్లు, సామర్లకోట లలోని స్వామి వార్లను దర్శించుకునేలా ప్రత్యేక బస్సు సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. అంతేకాకుండా తమిళనాడులోని అరుణాచలంకు కూడా నడపడం జరుగుతుందని తెలిపారు. అయ్యప్ప భక్తుల సౌకర్యార్థం శబరిమలై దేవస్థానానికి భక్తుల డిమాండ్ కు అనుగుణంగా ఈ ప్రత్యేక బస్సులు నడపడం జరుగుతుందని, మరిన్ని వివరాల కోసం 8977781103, 9493882464, 9949193893 లను సంప్రదించాలని డిఎం తెలిపారు.

మూసాపేట్, ఖైతలాపూర్ డివిజన్ లలో ఘనంగా సదర్ సమ్మేళనలో పాల్గొన్న వడ్డేపల్లి రాజేశ్వరరావు



కూకట్పల్లి నవంబర్ 10 మన మీ వార్త

దీపావళి పండుగను పురస్కరించుకుని నిన్న రాత్రి మూసాపేట్ మరియు ఖైతలాపూర్ డివిజన్ లలో యాదవ సోదరుల ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ సమ్మేళనం కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు వారి ఆహ్వానం మేరకు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా యాదవ సోదరులు సంప్రదాయబద్ధంగా నిర్వహించిన ప్రత్యేక పట్నం పూజా కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సదర్ సమ్మేళనంలో పాల్గొన్న యాదవ సోదరులను ఆప్యాయంగా పలకరించి దీపావళి పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ సందర్భంగా సదర్ సమ్మేళనం యాదవ సోదరుల సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని, తరతరాలుగా వస్తున్న ఆచార వ్యవహారాలను భావితరాలకు అందించడంలో ఇలాంటి కార్యక్రమాలు ఎంతో ప్రాధాన్యత కలిగి ఉన్నాయని అన్నారు. యాదవ సోదరుల ఐక్యత, ఆత్మీయత, సామాజిక సమైక్యత అభినందనీయమని పేర్కొన్నారు. శ్రీకృష్ణ పరమాత్మ ఆశీస్సులతో యాదవ సోదరులందరూ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలతో వర్ధిల్లాలని వడ్డేపల్లి రాజేశ్వరరావు ఆకాంక్షించారు.

గ్రామాల అభివృద్ధి లక్ష్యంగా కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుంది

- కొనయామకుల గ్రామ పంచాయతీ నూతన భవనాన్ని ప్రారంభించిన పరకాల ఎమ్మెల్యే శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి

మన మీ వార్త నవంబర్ 10 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



15,16వ డివిజన్ మరియు గీసుగొండ మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ
గీసుగొండ మండలం కొనయామకుల



గ్రామంలో నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి గారు ప్రారంభించారు.గ్రామాల అభివృద్ధి ద్వారానే రాష్ట్ర సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని, ఈ లక్ష్యంతో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందని అన్నారు. గ్రామ ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పిస్తూ, ప్రతి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పన, రహదారులు, పారిశుధ్యం, తాగునీరు, విద్య, వైద్యం వంటి రంగాలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతోందని పేర్కొన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి, గ్రామాల రూపురేఖలు మార్చేలా అభివృద్ధి పనులను దశలవారీగా ముందుకు తీసుకెళ్తున్నామని తెలిపారు. అనంతరం 15,16వ డివిజన్ మరియు గీసుగొండ మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి ఉ షాది ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు.అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు.

హనుమకొండ టీజీపీఎస్సీ నిర్వహించే పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు పూర్తి చేయాలి

- హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి

మన మీ వార్త నవంబర్ 10 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.



హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లో వివిధ శాఖల అధికారులతో టీజీపీఎస్సీ పరీక్ష నిర్వహణపై సమన్వయ సమావేశం
తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) నిర్వహించే డిప్యూటీ



ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీఈవో/ గెజిటెడ్ హెడ్‌మాస్టర్ (గ్రేడ్-1) పరీక్షలకు అన్ని ఏర్పాట్లను పకడ్బందీగా పూర్తి చేయాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి అధికారులను ఆదేశించారు.

మంగళవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో వివిధ శాఖల అధికారులతో టీజీపీఎస్సీ నిర్వహించే పరీక్షలు నిర్వహణపై సమన్వయ సమావేశాన్ని జిల్లా కలెక్టర్ నిర్వహించారు.

ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య, విద్యుత్, పోలీస్, ఆర్టీసీ శాఖల అధికారులతో పాటు పరీక్షా కేంద్రాల ప్రతినిధులతో ఏర్పాట్ల సంబంధించిన అంశాలపై కలెక్టర్ సమీక్షించారు.

ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ ఈ నెల 12, 13 తేదీల్లో నిర్వహించే డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ (డీఈవో / గెజిటెడ్ హెడ్‌మాస్టర్ గ్రేడ్-1) పరీక్షకు కేటాయించిన పరీక్షా కేంద్రాలలో పటిష్ట ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 నుండి ఐదు సాయంత్రం 5'00 గంటల వరకు పరీక్షలు జరుగుతాయన్నారు. 12వ తేదీన జరగనున్న పరీక్షకు 1825 మంది అభ్యర్థులు, 13వ తేదీన జరగనున్న పరీక్షకు 1825 మంది అభ్యర్థులు(మొత్తం పరీక్ష రాసే అభ్యర్థులు(3650) పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు.

హనుమకొండ వడ్డేపల్లి లోని అయాన్ డిజిటల్ జోన్, ములుగు క్రాస్ రోడ్ లోని ప్రభుత్వ ఐటిఐ కళాశాల ఎదురుగా ఉన్న శ్రీ గాయత్రి డిగ్రీ అండ్ పీజీ కళాశాల, రామారం(భీమారం) పొద్దుటూరి గార్డెన్స్ సమీపంలోని మోక్షిత్ కంప్యూటర్స్, హనుమకొండ గోపాల్ పూర్ కల్లుమండవ సమీపంలోని ఎన్ఎస్ గ్లోబల్ టెక్నాలజీస్, హసన్పర్తి చింతగట్టు హైవే సమీపంలోని నోబెల్ టెక్నాలజీ అండ్ సొల్యూషన్స్ లలో పరీక్ష జరుగుతుందన్నారు.

జిల్లాకు సంబంధించి 3,650 మంది అభ్యర్థులు ఈ పరీక్షకు హాజరుకానున్న నేపథ్యంలో పరీక్షల నిర్వహణలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలన్నారు.

పరీక్షా కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. పరీక్షల నిర్వహణలో సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలన్నారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ అప్పయ్య, పోలీస్ ఇన్స్పెక్టర్ చంద్రమోహన్, ఆర్టీసీ డిఎం ధరమ్ సింగ్, కలెక్టరేట్ పరిపాలన అధికారి గౌరీ శంకర్, ఇతర అధికారులతో పాటు పరీక్షా కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు, ఆయా పరీక్షా కేంద్రాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కిసాన్ మేళా నిర్వహణకు శాఖల సమన్వయంతో పకడ్బందీ ఏర్పాట్లు చేయాలి: జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద



మన మీ వార్త నవంబర్ 10 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

జిల్లా కలెక్టరేట్‌లో మంగళవారం వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) ఆధ్వర్యంలో నిర్వహించబోయే కిసాన్ మేళా నిర్వహణకు సంబంధించి ముందస్తు ప్రణాళిక, ఏర్పాట్లపై సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సమీక్ష సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం నేపథ్యంలో రైతులకు పంటల సాగుపై అవగాహన కల్పించేందుకు కిసాన్ మేళాలో వివిధ శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఎల్‌నినో ప్రభావంతో భూగర్భ జలాలు తగ్గే అవకాశాలను దృష్టిలో ఉంచుకొని అధిక నీటి అవసరం లేని ఆరుతడి పంటల సాగు, ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, నీటి పొదుపు విధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆరుతడి పంటల సాగు ద్వారా పెట్టుబడి వ్యయాన్ని తగ్గించుకుంటూ మెరుగైన దిగుబడులు సాధించే విధానాలను వివరించాలన్నారు. అదేవిధంగా రైతులకు బ్యాంకుల ద్వారా పంట రుణాలు, వ్యవసాయానికి సంబంధించిన ఇతర రుణాలు, సోలార్ పథకాల ద్వారా కలిగే ప్రయోజనాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులకు అవసరమైన సమాచారం, ప్రభుత్వ పథకాలు, సాంకేతిక సలహాలు ఒకే వేదికపై అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

రైతులకు మేలు చేసే ఆధునిక వ్యవసాయ పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయ ప్రణాళికపై కిసాన్ మేళా ద్వారా విస్తృత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు.

ఈ సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ ఎల్ కిషోర్ కుమార్, అదనపు కలెక్టర్ లోకల్ బాడీ వైవి గణేష్, డియార్వో విజయలక్ష్మి, ఆత్మ పిడి విజయ నిర్మల,డిసివో నీరజ, ఎలక్ట్రిసిటీ ఎస్. ఇ ఆనందం ,ఆర్ డబ్యూ ఎస్ ఇ ఇ నిర్మల,ఉద్యానవన శాఖ అధికారి శ్రీనివాస్ రావు వ్యవసాయ శాఖ అధికారి విజయ్ భాస్కర్, పశుసంవర్ధక శాఖ అధికారి బాలాజీ, ఫిషరీస్ శ్రీపతి, డిఆర్డిఓ నాగ పద్మజ,సిపివో చంద్రకళ తదితర సంబంధితశాఖల అధికారులు పాల్గొన్నారు.

జనగామ ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలి

- వరి పంటపైనే ఆధారపడకుండా సమగ్ర వ్యవసాయ విధానాలను అవలంబించాలి

- తక్కువ నీటితో అధిక ఆదాయం ఇచ్చే పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలి

- పాడి పరిశ్రమ, పశు పోషణ, ఉద్యాన, మత్స్య రంగాల ద్వారా అదనపు ఆదాయ వనరులు పెంపొందించుకోవాలిలి

- రైతులకు అవగాహన కల్పించేందుకు జిల్లా స్థాయి కిసాన్ మేళా నిర్వహణ

- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

మన మీ వార్త నవంబర్ 10 వరంగల్ ఉమ్మడి జిల్లా ప్రతినిధి.

ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులు దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు.

మంగళవారం, జిల్లా కేంద్రంలోని ధర్మకంచ స్టేడియంలో ఆత్మ సౌజన్యంతో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కిసాన్ మేళా కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ముఖ్య అతిథిగా హాజరై, జ్యోతి ప్రజ్వలన గావించి, కార్యక్రమాన్ని ఆరంభించారు, అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతాలాపన చేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. రైతుల సంక్షేమం, వ్యవసాయ రంగ అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. తాను కూడా రైతు కుటుంబం నుంచి వచ్చిన వ్యక్తినని, వ్యవసాయ రంగంపై తనకు అవగాహన ఉందని తెలిపారు.

ప్రస్తుత పరిస్థితుల్లో ఎల్‌నినో ప్రభావం కారణంగా వర్షపాతం గణనీయంగా తగ్గిపోయిందని, సాధారణంగా ఈ సమయానికి జిల్లాలో సుమారు 800 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా, ఇప్పటివరకు కేవలం 525 మిల్లీమీటర్లు మాత్రమే నమోదైందని, దాదాపు 40 శాతం లోటు వర్షపాతం ఉందని వివరించారు.

వర్షాలు తగ్గడం, ఉష్ణోగ్రతలు పెరగడం వల్ల రాబోయే రోజుల్లో వ్యవసాయంపై ప్రభావం పడే అవకాశం ఉందని, రైతులు ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంటపైనే పూర్తిగా ఆధారపడకుండా పంటల వైవిధ్యీకరణకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. తక్కువ నీటితో సాగు చేయగల కంది, పెసర, మినుము, వేరుశెనగ, నూనె గింజలు, కూరగాయలు, ఉద్యాన పంటలతో పాటు ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించుకోవాలని తెలిపారు.

వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ, పశు పోషణ, గొర్రెల పెంపకం, మత్స్య సంపద, కోళ్ల పెంపకం వంటి అనుబంధ రంగాలను కూడా చేపట్టడం ద్వారా రైతులు బహుళ ఆదాయ వనరులను అభివృద్ధి చేసుకోవచ్చన్నారు.

వ్యవసాయంలోనూ ఒకే పంటపై ఆధారపడకుండా వివిధ పంటలు, అనుబంధ రంగాలను కలిపి చేపట్టాలని సూచించారు. ఒక పంటకు నష్టం వాటిల్లినా మరో పంట (లేదా) అనుబంధ రంగం ద్వారా ఆదాయం పొందే అవకాశం ఉంటుందని వివరించారు.

రైతులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలని, కిసాన్ మేళాలో ఏర్పాటు చేసిన సుమారు 50 స్టాళ్లను సందర్శించి, వివిధ శాఖల ద్వారా అందిస్తున్న పథకాలు, సాంకేతిక పద్ధతులపై అవగాహన పెంపొందించుకోవాలని కోరారు.

ముఖ్యంగా పుట్టగొడుగుల పెంపకం వంటి ఉపాధి అవకాశాలను వినియోగించుకోవాలని సూచించారు. తక్కువ స్థలంలోనే పుట్టగొడుగుల సాగు చేపట్టవచ్చని, సుమారు 30 నుంచి 40 రోజుల్లో దిగుబడి పొందే అవకాశం ఉందని, మార్కెటింగ్‌కు సంబంధించిన వివరాలను కూడా సంబంధిత ప్రతినిధులు అందిస్తున్నారని తెలిపారు.

జిల్లా కలెక్టరేట్ పరిసరాల్లో సుమారు 2 ఎకరాల్లో ఉద్యాన తోటలు, కూరగాయలు, కంది, తదితర పంటలను సాగు చేస్తున్నామని తెలిపారు. కోతుల బెడదను నివారించేందుకు పంటల ఎంపిక, సాగు పద్ధతుల్లో తీసుకున్న చర్యలను రైతులు స్వయంగా పరిశీలించి, తెలుసుకోవాలని సూచించారు. అక్కడ డ్రిప్ ఇరిగేషన్ విధానాన్ని టైమర్ల సహాయంతో ఎలా అమలు చేస్తున్నారో గమనించి, తమ పొలాల్లోనూ అటువంటి పద్ధతులను అవలంబించాలని విజ్ఞప్తి చేశారు.

రైతులందరూ కలెక్టరేట్‌ను సందర్శించి, ఈ విధానాలను పరిశీలించాలని, వ్యవసాయ విస్తరణ అధికారులు రైతులకు అవసరమైన వివరాలను తెలియజేయాలని ఆదేశించారు.

రైతులకు ఆధునిక సాగు పద్ధతులపై అవగాహన

ఈ నేపథ్యంలో జనగామ ఆత్మ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ.. రైతులకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించడం, శిక్షణ కల్పించడం ఆత్మ కమిటీ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భూసార పరీక్షలు చేయించుకొని, నేల స్వభావానికి అనుగుణంగా పంటలు సాగు చేయాలని, ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ వ్యవసాయం, డ్రిప్ ఇరిగేషన్, స్ప్రింక్లర్ల వినియోగాన్ని ప్రోత్సహించాలని సూచించారు. రైతుల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి





కృషి చేస్తామని తెలిపారు.

ఈ క్రమంలో పాలకుర్తి ఆత్మ కమిటీ చైర్మన్ మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో రాబోయే రోజుల్లో వర్షాభావం, అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు ముందుగానే ప్రత్యామ్నాయ పంటల సాగుకు సిద్ధం కావాలన్నారు. అధిక నీటి అవసరమున్న వరి సాగును తగ్గించి, ఆరుతడి పంటలపై దృష్టి సారించాలని సూచించారు. ఆయిల్ పామ్ సాగు ద్వారా రైతులు మంచి ఆదాయం పొందుతున్నారని, పాలకుర్తి మండలంలో ఒక రైతు సుమారు 30 ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేస్తూ ఎకరాకు రూ.2 లక్షల వరకు ఆదాయం పొందుతున్నారని ఉదాహరణగా వివరించారు.

ఈ సందర్భంగా ఘనపూర్ (స్టేషన్) ఆత్మ కమిటీ ఛైర్మన్ మాట్లాడుతూ.. జిల్లాలో రైతులు సంప్రదాయ వరి సాగుకు ప్రత్యామ్నాయంగా కంది, పత్తి, చిరుధాన్యాలు, ఇతర ఆరుతడి పంటల సాగును ప్రోత్సహించే దిశగా ముందుకు సాగుతున్నారని తెలిపారు.

ఉద్యాన పంటలు, ఆయిల్ పామ్ సాగుతో అధిక ఆదాయం.. రైతులకు అవగాహన

అంతకుముందు జిల్లా ఉద్యానవన శాఖ అధికారి మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం పలు రకాల రాయితీలు అందిస్తోందని తెలిపారు. గత నాలుగేళ్లలో జిల్లాలో సుమారు 20 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగు చేపట్టినట్లు వివరించారు. ఆయిల్ పామ్ రైతులకు ఎకరానికి సంవత్సరానికి రూ.4,200 నిర్వహణ ఖర్చుల రాయితీ, డ్రిప్ ఇరిగేషన్ ఏర్పాటుకు మొదటి సంవత్సరంలో రూ.22,900 సబ్సిడీ అందిస్తున్నట్లు తెలిపారు. మొక్కలపై 90 శాతం సబ్సిడీ కల్పిస్తున్నట్లు వివరించారు.

ప్రస్తుతం జిల్లాలో సుమారు 5 వేల ఎకరాల్లో ఆయిల్ పామ్ పంట అందుబాటులోకి వచ్చిందని, కంపెనీల ద్వారా బైబ్యాక్ విధానంలో పంట కొనుగోలు జరుగుతోందని తెలిపారు. ఈ సంవత్సరం ఆయిల్ పామ్ సాగు నిర్వహణకు సంబంధించి రూ.2.11 కోట్ల సబ్సిడీని రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేసినట్లు, గత మూడు సంవత్సరాల్లో ఇప్పటివరకు సుమారు రూ.58 కోట్ల మేర రైతులకు చెల్లింపులు జరిగినట్లు వివరించారు.

సమగ్ర వ్యవసాయంతో రైతులకు ఆర్థిక భద్రత

అలాగే జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నీటి సంరక్షణ పనులు, పంట కుంటల నిర్మాణం, పశుగ్రాసం పెంపకం, పండ్ల తోటలు, కూరగాయల సాగు, వ్యవసాయ భూములకు మట్టి రోడ్ల నిర్మాణం, పాత బావుల పూడికతీత, కొత్త బావుల నిర్మాణం వంటి పనులు చేపట్టుకునే అవకాశం ఉందని తెలిపారు.

వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని, తక్కువ నీటితో అధిక ఆదాయం అందించే పంటలను సాగు చేయాలని వివరించారు.

అలాగే జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి మాట్లాడుతూ.. వ్యవసాయంతో పాటు పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకం, పెరటి కోళ్ల పెంపకం వంటి అనుబంధ రంగాల ద్వారా రైతులు నిరంతర ఆదాయం పొందవచ్చన్నారు. పంటల ద్వారా కాలానుగుణంగా ఆదాయం వస్తుందని, పాడి పరిశ్రమ ద్వారా రోజువారీ ఆదాయాన్ని పొందే అవకాశం ఉంటుందని వివరించారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి పశు పోషణ కీలకమని తెలిపారు.

అలాగే జిల్లా మత్స్యశాఖ అధికారి మాట్లాడుతూ.. జిల్లాలో సుమారు 736 చెరువులు ఉండగా, ప్రస్తుత ఎండ తీవ్రత, వర్షాభావ పరిస్థితుల కారణంగా దాదాపు 85 శాతం చెరువులు ఎండిపోయాయని తెలిపారు. దీనివల్ల మత్స్య సంపదపై ఆధారపడిన సుమారు 20 వేల మంది మత్స్యకారులు, వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశం ఉందన్నారు. ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన పథకం ద్వారా యూనిట్‌కు రూ.6.50 లక్షల వ్యయంతో 40 శాతం సబ్సిడీ, మహిళా రైతులకు 60 శాతం సబ్సిడీ అందిస్తున్నట్లు వివరించారు. చౌడు భూముల్లో ఆక్వాకల్చర్ చేపట్టేందుకు ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

అలాగే జిల్లా భూగర్భ జల శాఖ అధికారి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం తగ్గడం వల్ల భూగర్భ జలమట్టం గణనీయంగా పడిపోయిందని తెలిపారు. గత సంవత్సరం అక్టోబర్ లో 3.9 మీటర్ల లోతులో ఉన్న భూగర్భ జలమట్టం ప్రస్తుతం 7.9 మీటర్ల లోతుకు పడిపోయిందని వివరించారు. రైతులు కొత్త బోర్లు వేయడానికి తొందరపడకుండా ఉన్న నీటిని సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసిపట్టేందుకు పంట కుంటలు నిర్మించుకోవాలని, పాత బావులు, బోర్లలోకి వర్షపు నీరు చేరేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డ్రిప్, స్ప్రింక్లర్ పద్ధతుల ద్వారా నీటిని ఆదా చేయాలని, బోరు

మోటార్లను నిరంతరంగా నడపకుండా విరామాలతో నడిపి నీటిని పొదుపుగా వినియోగించుకోవాలని వివరించారు.

భూశ్రీస్రవ జెడ్పీ సీఈవో మాట్లాడుతూ.. పాడి పంట అనే భావనకు అనుగుణంగా పశు పోషణ, వ్యవసాయాన్ని సమన్వయం చేసుకోవాలని తెలిపారు. పశువుల నుంచి లభించే పేడ, మూత్రం వంటి సహజ వనరులను వినియోగించి, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో పంటలు సాగు చేయాలని సూచించారు. ఒకే పంటపై ఆధారపడకుండా పాడి పరిశ్రమ, గొర్రెలు, మేకల పెంపకం, కోళ్ల పెంపకం, కూరగాయలు, పండ్ల తోటల సాగు వంటి మూడు, నాలుగు ఆదాయ వనరులను అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. దీనివల్ల ఒక రంగంలో నష్టం వచ్చినా మరో రంగం ద్వారా కుటుంబానికి ఆర్థిక భద్రత లభిస్తుందని వివరించారు.

రైతులకు పథకాలు, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన

అదే విధంగా వ్యవసాయ శాఖ అధికారిమాట్లాడుతూ.. రైతులకు ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి, రైతు భీమా, అగ్రిస్టాక్ రైతు నమోదు, సబ్సిడీ విత్తనాల పంపిణీ, భూసార పరీక్షలు, సాయిల్ హెల్త్ కార్డులు, వ్యవసాయ యాంత్రీకరణ, ప్రకృతి వ్యవసాయం, పంటల వైవిధ్యీకరణ, రైతు వేదికలు, డిజిటల్ క్రాప్ బుకింగ్, వ్యవసాయ మార్కెటింగ్, కొనుగోలు కేంద్రాల వినియోగం, తదితర అంశాలపై వివరించారు.

రైతులకు విజయవంతమైన సాగు విధానాల పరిచయం

అలాగే రైతు సేవా కేంద్రం ప్రతినిధి సింగరి స్వప్న మాట్లాడుతూ.. మహిళా సంఘాల ద్వారా రైతు సేవా కేంద్రాలను ఏర్పాటు చేసి, రైతులకు ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు అందుబాటులోకి తీసుకువస్తున్నామని తెలిపారు. తమ కేంద్రం ద్వారా ఇప్పటివరకు సుమారు రూ.18 నుంచి రూ.20 లక్షల వరకు వ్యాపార లావాదేవీలు నిర్వహించినట్లు వివరించారు. రైతులకు అవసరమైన వ్యవసాయ ఉత్పాదకాలను గ్రామస్థాయిలోనే అందుబాటులో ఉంచడం వల్ల సమయం ఆదా అవుతోందని తన అనుభవాన్ని పంచుకున్నారు.

అదే విధంగా ఘనపూర్ (స్టేషన్) మండలానికి చెందిన రైతు మారపాక రాములు మాట్లాడుతూ.. గత నాలుగేళ్లుగా కొర్రమీను చేపల పెంపకం చేపడుతున్నట్లు తెలిపారు. కేవలం 10 గుంటల విస్తీర్ణంలో చేపల పెంపకం చేపట్టి, ఒక్కో చేపల పెంపకం కాలానికి సుమారు రూ.80 వేల నుంచి రూ.1.50 లక్షల వరకు లాభం పొందుతున్నట్లు వివరించారు. వ్యవసాయంతో పాటు అనుబంధంగా చేపల పెంపకం చేపట్టడం ద్వారా రైతులు మంచి ఆదాయం పొందవచ్చని తన అనుభవాన్ని పంచుకున్నారు.

కంది పంటలో చీడపీడల నివారణపై శాస్త్రవేత్త సూచనలు

అనంతరం శాస్త్రవేత్త డాక్టర్ వీరన్న మాట్లాడుతూ.. కంది పంటలో పూత, కాయ దశల్లో ఆశించే కాయ తొలుచు పురుగులు, శనగపచ్చ పురుగు, కాయ ఈగ, తదితర చీడపీడల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పంట దశను బట్టి శాస్త్రీయ పద్ధతుల్లో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, పురుగుల ఉధృతిని గుర్తించి, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అధికారుల సూచనల మేరకు మాత్రమే పురుగుమందులను వినియోగించాలని వివరించారు.

రైతుల సమస్యలకు అధికారుల సమాధానాలు

కిసాన్ మేళాలో పలువురు రైతులు తమకున్న సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురాగా, పత్తి పంటలో పూత రాలిపోవడం, ఆయిల్ పామ్‌లో మగ, ఆడ పుష్పాల సమస్యలు, అంతర పంటల సాగు సమయంలో మొక్కలపై ఒత్తిడి, ఆయిల్ పామ్ దిగుబడి, పోషకాల యాజమాన్యం, డ్రిప్ ఇరిగేషన్ పరికరాల సరఫరా, భూసార పరీక్షలు, తక్కువ నీటితో సాగు చేయగల పంటల ఎంపిక వంటి అంశాలపై ప్రశ్నలు అడిగారు. సంబంధిత అధికారులు, నిపుణులు రైతుల సందేహాలను నివృత్తి చేసి, తగిన సూచనలు, సలహాలు అందించారు.

అంతకుముందు ఈ కిసాన్ మేళాలో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు ప్రత్యామ్నాయ పంటల సాగు విధానాలపై పాటలు, సాంస్కృతిక ప్రదర్శనల ద్వారా రైతుల్లో చైతన్యం నింపారు.

ఈ కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ (జనగామ) బి. మహేందర్ రెడ్డి, ఆత్మ కమిటీ ఛైర్మన్ (ఘనపూర్ - స్టేషన్) బి. పెద్ది రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ (పాలకుర్తి) ఈ. రాఘవరావు, జిల్లా వ్యవసాయ అధికారి అంబికా సోనీ, డీఆర్డీఓ భాస్కర్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ మురళీధర్ రావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి నర్సయ్య, మత్స్య శాఖ అధికారి రాణా ప్రతాప్, భూగర్భ జల శాఖ అధికారి నరసింహులు, జెడ్పీ సీఈవో బాలరామ రావు, ఎల్డీఎం ప్రతిభ, విజయ డైరీ డీడీ గోపాల్ సింగ్, వివిధ శాఖల సంబంధిత అధికారులు, ఆత్మ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.

printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512

రిజర్వ్ ఫారెస్ట్‌లో ఇటుక బట్టీల కార్యకలాపాలు చేపడితే కఠిన చర్యలు తప్పవు

-రూప్లా తండాలో ఇటుక బట్టీలను క్షేత్రస్థాయిలో పరిశీలించిన నర్సాపూర్ ఎంఆర్ఓ దివ్య

శివ్వంపేట మీ వార్త ప్రతినిధి నవంబర్ (10):

రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలో అనుమతులు లేకుండా ఇటుక బట్టీల నిర్వహణ, మట్టి తవ్వకాలు,మట్టి రవాణా వంటి కార్యకలాపాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని నర్సాపూర్ ఎంఆర్ఓ దివ్య హెచ్చరించారు.అటవీ భూములను ఆక్రమించడం, ఇటుకల తయారీ కోసం అటవీ భూములను వినియోగించడాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోమని స్పష్టం చేశారు.మంగళవారం జిల్లా కలెక్టర్ ప్రతిభా సింగ్, డీఎఫ్ఓ జోజి ఆదేశాల మేరకు శివ్వంపేట మండల పరిధిలోని రూప్లా తండాలో కొనసాగుతున్న ఇటుక బట్టీల కార్యకలాపాలను ఎంఆర్ఓ దివ్య క్షేత్రస్థాయిలో పరిశీలించారు.ఈ సందర్భంగా రిజర్వ్ ఫారెస్ట్ పరిధిలోకి వచ్చే భూమిలో ఇటుకల తయారీ కోసం మట్టిని డంపు చేసినట్లు గుర్తించారు.దీంతో మట్టి రవాణా,డంపింగ్‌కు వినియోగిస్తున్న సంబంధిత వ్యక్తికి చెందిన ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నట్లు ఆమె వెల్లడించారు.ఈ వ్యవహారంపై గతంలోనే సంబంధిత వ్యక్తులకు నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు.భూమి హద్దులు, అటవీ భూమి పరిధిపై స్పష్టత కోసం రెవెన్యూ, ఇరిగేషన్ శాఖల అధికారులను సర్వే నిర్వహించాలని కోరినట్లు పేర్కొన్నారు.సర్వే పూర్తయిన అనంతరం భూమి హద్దులు, నిబంధనల ఉల్లంఘనపై పూర్తి వివరాలు వెల్లడవుతాయని తెలిపారు.ప్రభుత్వ భూములు,అటవీ ప్రాంతాల పరిరక్షణకు అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా ఇటుక బట్టీలు నిర్వహించినా,మట్టి తవ్వకాలు లేదా తరలింపులకు పాల్పడినా బాధ్యులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఎంఆర్ఓ దివ్య హెచ్చరించారు.

చాకరిమెట్ల ఆంజనేయస్వామి సన్నిధికి ఎమ్మెల్సీ అంజిరెడ్డి దంపతులు





శివ్వంపేట:మండల పరిధిలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన చాకరిమెట్ల శ్రీ ఆంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసం మొదటి రోజు సందర్భంగా మంగళవారం ఎమ్మెల్సీ అంజిరెడ్డి దంపతులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్సీ అంజిరెడ్డి దంపతులకు ఆలయ చైర్మన్ ఆంజనేయ శర్మ, ఈవో సార శ్రీనివాస్ పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.అలాగే ఆలయంలోని సత్యనారాయణ స్వామి మండపంలో దంపతులు భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఆచరించారు.ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు దేవదత్త శర్మ,ఈవో సార శ్రీనివాస్, బీజేపీ రాష్ట్ర నాయకులు వీరారెడ్డి,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు కొండల్ రావు,సీనియర్ నాయకులు భిక్షపతి,రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

యువతకు ఉచిత శిక్షణ.. ఉద్యోగ అవకాశాలు

కాసిపేట, నవంబర్ 10: (మన మీ వార్త మండల ప్రతినిధి)



గ్రామీణ ప్రాంత యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) ఆధ్వర్యంలో మంచిర్యాల ఆర్ఎస్ఈటీఐ--సీసీసీ సంస్థ ద్వారా ఉచిత శిక్షణ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. 18 నుంచి 35 ఏళ్ల వయస్సు గల యువతీ యువకులు ఈ శిక్షణకు అర్హులని పేర్కొన్నారు. శిక్షణ సమయంలో ఉచిత భోజన సదుపాయంతో పాటు శిక్షణ పూర్తి చేసిన వారికి ధ్రువపత్రం అందజేయడంతోపాటు ప్రైవేటు సంస్థల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు వెల్లడించారు.ఈ శిక్షణకు సంబంధించిన పోస్టర్‌ను పీడీ--డీఆర్‌డీఓ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఎంపీడీఓ సత్యనారాయణ సింగ్, ఎంపీఓ షేక్ సఫ్దర్ అలీ, ఏపీఎం రాజ్‌కుమార్, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనారాయణ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బంది పాల్గొన్నారు. అర్హులైన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

వ్యవసాయ శిక్షణలో బెల్లంపల్లి ఎఫ్‌పీఓ ప్రతినిధులు

- డిజిటల్ వ్యవసాయం, పంటల మార్కెటింగ్‌పై అవగాహన

కాసిపేట, నవంబర్ 10:(మన మీ వార్త మండల ప్రతినిధి)



హైదరాబాద్‌లోని రాష్ట్ర వ్యవసాయ నిర్వహణ, విస్తరణ శిక్షణ సంస్థ (సామేటి) కార్యాలయంలో ఈ నెల 9, 10 తేదీల్లో నిర్వహించిన వ్యవసాయ శిక్షణ కార్యక్రమంలో బెల్లంపల్లి ఫార్మర్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ ప్రతినిధులు పాల్గొని సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి ఎఫ్‌పీఓ చైర్మన్ ఎంబడి కిషన్, సీఈఓ కుమార్, డైరెక్టర్ పి. మల్లేష్ హాజరయ్యారు.ఈ శిక్షణలో డిజిటల్ వ్యవసాయం, పంటల మార్కెటింగ్, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలు, అధిక లాభాలు వచ్చే సాగు విధానాలపై అవగాహన కల్పించారు. ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, మార్కెటింగ్ విధానాలపై ప్రతినిధులు శిక్షణ పొందారు.

ఈ నెల 16, 17 తేదీల్లో తెలంగాణ వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో యువతను వ్యవసాయం వైపు ఆకర్షించి, వ్యవసాయ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో మరో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారు. వ్యవసాయంపై ఆసక్తి ఉన్న యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎఫ్‌పీఓ ప్రతినిధులు కోరారు.

శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించిన వ్యవసాయ శాఖ అధికారులకు బెల్లంపల్లి ఎఫ్‌పీఓ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల అభివృద్ధే మా లక్ష్యం

గాంధీనగర్ కమిటీ హాల్ నిర్మాణానికి రూ.65 లక్షల నిధులు.. పరమేశ్వర్ రెడ్డికి ఘన సన్మానం

- చిరకాల స్వప్నం సాకారం దిశగా అడుగులు.. అభివృద్ధికి సహకరించినందుకు సంక్షేమ సంఘం కృతజ్ఞతలు

రామంతపూర్, నవంబర్ 10 (మనమీ వార్త):

రామంతపూర్ డివిజన్ పరిధిలోని గాంధీనగర్‌లో స్థానిక ప్రజల చిరకాల ఆకాంక్ష అయిన కమిటీ హాల్ నిర్మాణానికి రూ.65 లక్షల నిధులు మంజూరు చేయించడంలో కీలక పాత్ర పోషించిన కాంగ్రెస్ నాయకుడు పరమేశ్వర్ రెడ్డిని గాంధీనగర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయనకు శాలువా కప్పి ప్రత్యేకంగా సత్కరించి, గాంధీనగర్ అభివృద్ధికి అందించిన



సహకారానికి సంఘం సభ్యులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేశారు.కమిటీ హాల్ నిర్మాణం పూర్తయితే స్థానిక ప్రజలకు సమావేశాలు నిర్వహించుకోవడంతో పాటు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సంక్షేమ సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న తమ ప్రాంత ప్రజల అవసరాన్ని గుర్తించి నిధుల మంజూరుకు కృషి చేసిన నాయకత్వానికి వారు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షులు మహమ్మద్ రఫీక్, అధ్యక్షులు లగుసాని శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఎడ్ల సిద్ధిరాములు, కోశాధికారి ఎర్ర ఎస్. బిక్షపతి, ఉపాధ్యక్షులు ఎం.డి. అజీజ్ ఖాన్, జాంగీర్ భాయ్, సలహాదారులు ముత్యాల నరసింహ గౌడ్, నరేష్ చారి, నరసింహ, లింగం యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గాంధీనగర్ అభివృద్ధికి సహకారం అందించిన ప్రతి ఒక్కరికీ సంక్షేమ సంఘం సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉప్పల్, రామంతాపూర్ డివిజన్ల అభివృద్ధికి రూ.3.89 కోట్ల నిధులు మంజూరు

- కాలనీల సమగ్ర అభివృద్ధే లక్ష్యం.. ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయం

- అభివృద్ధి పనులను దశలవారీగా పూర్తి చేస్తాం.. కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి

ఉప్పల్, నవంబర్ 10 (మన మీ వార్త):

ఉప్పల్ నియోజకవర్గంలోని ప్రతి కాలనీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని కాంగ్రెస్ పార్టీ ఉప్పల్ నియోజకవర్గ ఇంచార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందులో భాగంగా రామంతాపూర్, ఉప్పల్ డివిజన్ల పరిధిలో వివిధ అభివృద్ధి పనుల కోసం మొత్తం రూ.3.89 కోట్ల నిధులు మంజూరు చేసినట్లు వెల్లడించారు. మంగళవారం ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులకు నిధుల మంజూరు పత్రాలను అందజేశారు.

ఈ సందర్భంగా పరమేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ.. కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, వీధి దీపాలు, తాగునీటి సరఫరా, పారిశుద్ధ్యం వంటి సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి, స్థానికుల సూచనలు, సలహాలకు ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి పనులు చేపడతామని పేర్కొన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధి, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని అన్నారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ పేదలు, మధ్యతరగతి కుటుంబాలు, రైతులు, మహిళలు, యువత సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతోందని వివరించారు. రాష్ట్రంలోని నగరాలు, పట్టణాలు,



గ్రామాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు.అభివృద్ధి అనేది కేవలం హామీలకే పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో ప్రజలకు కనిపించేలా ఉండాలన్నదే తమ అభిమతమని పరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు. ప్రతి కాలనీలో పర్యటిస్తూ ప్రజల సమస్యలను స్వయంగా తెలుసుకుని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను పూర్తి చేయడంతో పాటు, అవసరమైన కొత్త పనులకు కూడా నిధులు మంజూరయ్యేలా కృషి చేస్తానన్నారు. రాజకీయాలకు అతీతంగా ప్రజల అవసరాలకే ప్రాధాన్యతనిస్తూ ఉప్పల్ నియోజకవర్గాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దడమే తన సంకల్పమని వెల్లడించారు.

మంజూరైన అభివృద్ధి పనుల వివరాలను కాలని వాసులకు ఆయన వివరించారు.రూ.18 లక్షలతో: ఉప్పల్ వార్డు నంబర్ 28 పరిధిలోని రామంతాపూర్ శ్రీరామనపురం కాలనీలో నంబర్ 3-4-63/19/109 నుంచి హెచ్.నెం. 2-65 వరకు, అలాగే హెచ్.నెం. 3-4-63/19/181 నుంచి హెచ్.నెం. 3-4-19/+ణ వరకు సీసీ రోడ్ల నిర్మాణంరూ.58 లక్షలతో: శ్రీ సాయి కాలనీలోని 4, 5, 6వ రోడ్లలో సీసీ రోడ్ల నిర్మాణం,రూ.50 లక్షలతో: లక్ష్మీనారాయణ కాలనీలో



బజరంగబలి కిరాణా స్టోర్ నుంచి ఆర్.కె. పాఠశాల వరకు, అలాగే హెచ్.నెం. 2-24-105/22/4 నుంచి బైపాస్ రోడ్డు వరకు దెబ్బతిన్న సీసీ రోడ్ల పునర్నిర్మాణం,రూ.65 లక్షలతో: రామంతాపూర్ వార్డు నంబర్ 26 పరిధిలోని గాంధీనగర్‌లో కమ్యూనిటీ హాల్ నిర్మాణం,రూ.1.98 లక్షలతో: రామంతాపూర్ వార్డు నంబర్ 26 పరిధిలోని శాంతినగర్‌లో మనస్వి మెడికల్ హాల్ నుంచి 6వ వీధి వరకు బాక్స్ డ్రెయిన్ నిర్మాణం వంటి పనులను త్వరలోనే ప్రారంభిస్తామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కందికంటి అశోక్ గౌడ్, సందీప్, రఫిక్, వల్లపు శ్రీకాంత్ యాదవ్,గాంధీనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు లఘుసాని శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి వడ్ల సిద్ధిరాములు, కోశాధికారి బిక్షపతి, ఉపాధ్యక్షుడు అజీజ్ ఖాన్‌తో పాటు నరసింహ గౌడ్, నరేష్, నరసింహ, లింగం యాదవ్, జహంగీర్ భాయ్ తదితరులు పాల్గొన్నారు.శాంతినగర్ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రాజుతో పాటు రాంనర్సయ్య, చిట్టిబాబు, శ్రీను, వేణు, శ్రీనివాస్ గుప్తా, శ్రీకాంత్, పాషా, ఎంపీ కుమార్, శ్యామ్, సునీల్, జనార్ధన్, ఎస్ఎఫ్‌సీ సత్యనారాయణ, యూనుస్, మల్లేష్, సురేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నాగేశ్వరరావు, మధుబాబు, సుధాకర్, అచ్చిరెడ్డి, సీహెచ్ రాములు, మీసాల రాములు, ఇస్తారాకుల శీను, ఆర్టీసీ కుమార్, జాకీర్, బిక్షపతి తదితరులతో పాటు అడ్వకేట్ పి. రాఘవేందర్, జి. పాండు, బాలస్వామి, సుంకరి సంతోష తదితరులు పాల్గొన్నారు.

డిసెంబర్ 15 నుంచి ఆశా వర్కర్ల నిరవధిక సమ్మె - ప్రభుత్వ హామీల అమలుకు డిమాండ్

మేడ్చల్-మల్కాజిగిరి, నవంబర్ 10:(వార్త ప్రతినిధి)

తెలంగాణలో ప్రజారోగ్య వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్న ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (CITU) మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం. రేవతి కళ్యాణి డిమాండ్ చేశారు.

సోమవారం ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి నీ కలిసి వినతిపత్రం అందజేశారు తమ సమస్యలపై ప్రభుత్వంతో చర్చించి పరిష్కారం చూపాలని ఎమ్మెల్యేను కోరారు. డిమాండ్లు నెరవేరకపోతే డిసెంబర్ 15 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నిరవధిక సమ్మెకు దిగుతామని స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా రేవతి కళ్యాణి మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా సుమారు 1200 మంది ఆశా వర్కర్లు గత 20 ఏళ్లుగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో గర్భిణీ స్త్రీలకు వైద్య సేవలు, ఆసుపత్రి ప్రసవాలు, తల్లీబిడ్డల సంరక్షణ, టీకాలు, కుటుంబ నియంత్రణ, డెంగ్యూ, మలేరియా,



కరోనా వంటి అంటువ్యాధుల నివారణలో నిరంతరం సేవలందిస్తున్నారన్నారు.

కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తమ పోరాటాలకు మద్దతు తెలిపి, అధికారంలోకి వస్తే వేతనాలు పెంచుతామని మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందని, అలాగే 2024లో కోఠి కమిషనర్ కార్యాలయం వద్ద జరిగిన పోరాటాల సందర్భంగా ఉన్నతాధికారులు రూ.18,000 ఫిక్స్‌డ్ వేతనం ఫైల్ ప్రాసెస్‌లో ఉందని హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు కాలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రధాన డిమాండ్లు :

నెలకు రూ.18,000 ఫిక్స్‌డ్ వేతనం, PF, ESI, ఉద్యోగ భద్రత, రూ.50 లక్షల ఇన్సూరెన్స్, రూ.50 వేల అంత్యక్రియల ఖర్చు, రిటైర్మెంట్ బెనిఫిట్ గా రూ.5 లక్షలు, పారితోషికంలో సగం పెన్షన్, ఆదివారాలు, పండుగ సెలవులు, ఏడాదికి 20 జూ లు, 6 నెలల వేతనంతో కూడిన మెడికల్, మెటర్నిటీ సెలవులు, ANM, GNM చేసిన వారికి ప్రమోషన్, టార్గెట్లు, స్టుటమ్ డబ్బాల మోత రద్దు, 2వ PRCలో కనీస వేతనం రూ.30,000, 2 DAల అమలు, అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాల వర్తింపు.ప్రభుత్వం స్పందించకపోతే సమ్మె తప్పదని, ఆశా వర్కర్లందరూ ఐక్యంగా పోరాటాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో CITU జిల్లా సహాయ కార్యదర్శి కె. ఉన్ని కృష్ణన్, యూనియన్ నాయకులు లత, ప్రవీణ తదితరులు పాల్గొన్నారు.

ఇచ్చేదే గుక్కెడు నీళ్ళు అవికూడా దుర్వాసన తో కూడిన మురుగు నీరు జనసేన నాయకులు:కొల్లా శంకర్

కూకట్పల్లి నవంబర్ 10 మన మీ వార్త

కేపీహెబి 4వ ఫేస్ గత కొన్ని నెలలుగా వేధిస్తున్న తాగునీటి సమస్యపై ఎల్ఐజి కాలనీవాసులు జనసేన కూకట్పల్లి కంటెస్టెడ్ ఎమ్మెల్యే ముమ్మారెడ్డి ప్రేమ కుమార్ దృష్టికి వారి యొక్క త్రాగునీటి సమస్యను తీసుకురావడం జరిగింది.

ఈ సందర్భంగా ప్రేమకుమార్ సూచనలు మేరకు

జనసేన పార్టీ కూకట్పల్లి కోఆర్డినేటర్ కొల్లాశంకర్ తాగునీటి సమస్యపై స్థానిక ప్రజలతో కలిసి వాటర్ బోర్డు డీజీఎం త్రినాథరావు ని కలిశారు.

?ఈ సందర్భంగా స్థానికుల సమస్యలను జనసేన నాయకులు కొల్లా శంకర్ వివరిస్తూ తాగునీటిలో మురుగునీరు కలవడం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారాని నీటి సరఫరా ప్రారంభమైన 30 నిమిషాల్లో మొదటి 10 నిమిషాలు కలుషితమైన మురికినీరే వస్తోందని, ఆ తర్వాతే మంచి నీరు వస్తుందని,స్థానిక ప్రజలు అనారోగ్యానికి పాల్పడుతున్నారని, ప్రజల ఆరోగ్యం పై దృష్టి సారించాలని ఈ సమస్యపై తగిన చర్యలు తీసుకోవాలని త్రినాథరావు దృష్టికి తీసుకెళ్లారు. ఈ తీవ్రమైన సమస్యపై వెంటనే స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని ఆయనను కోరారు.

?జనసేన నాయకులు తెలిపిన సమస్యపై వారు సానుకూలంగా స్పందించారు. నెల రోజుల్లోగా ఈ సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. అదే విధంగా, స్థానిక ప్రజలు కూడా అధికారులకు సహకరించాలని, తాగునీటిని వృథా చేయవద్దని ఈ సందర్భంగా ఆయన విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు ఆళ్ల నరేంద్ర ,పుప్పాల అంజి ,దాసరి వెంకట్ మరియు కాలనీ మహిళలు పాల్గొన్నారు...



బీరప్పగడ్డలో ఘనంగా సదర్ వేడుకలు.. పాల్గొన్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్(ఉప్పల్ ఖాన్)







- యాదవుల సంస్కృతి, సంప్రదాయాలు భావితరాలకు అందించాలి.. ఐక్యత, సోదరభావానికి సదర్ వేడుకలు ప్రతీక

బీరప్ప గడ్డ, నవంబర్ 10 (మన మీ వార్త):

బీరప్పగడ్డ డివిజన్‌లో దయాకర్ యాదవ్, సురేష్ యాదవ్ ఆధ్వర్యంలో నిర్వహించిన సదర్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్) ముఖ్యంగా పాల్గొని సందడి చేశారు.యాదవుల సంప్రదాయం, సంస్కృతి, వీరత్వం, ఆత్మగౌరవానికి ప్రతీకగా నిలిచే సదర్ వేడుకలు ఎంతో విశిష్టమైనవని ఈ సందర్భంగా నాయకులు పేర్కొన్నారు. పూర్వీకుల నుంచి వారసత్వంగా వస్తున్న ఆచార సంప్రదాయాలను భావితరాలకు అందించడంతో పాటు, సమాజంలో ఐక్యత, సోదరభావం, సామాజిక సమైక్యతను పెంపొందించడంలో ఇలాంటి పండుగలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.ఈ సందర్భంగా ఇర్షాద్ ఖాన్ మాట్లాడుతూ, సదర్ వేడుకలను ఘనంగా నిర్వహించిన నిర్వాహకులు దయాకర్ యాదవ్, సురేష్ యాదవ్‌లను అభినందించారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరి సంస్కృతి, సంప్రదాయాలను గౌరవిస్తూ ఐక్యత, సోదరభావంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఎస్సీ సెల్ జనరల్ సెక్రటరీ తుమ్మల సందీప్ భీషన్, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు డాక్టర్ అంజయ్య, అల్తాఫ్, యాసీన్, జహంగీర్, అమీర్, రోహిత్, మన్నన్ తదితర నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యాశాఖకు కేటాయించిన రూ.71,071 కోట్లు ఎక్కడ ఖర్చు చేశారు?

- బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా జనరల్ సెక్రటరీ బత్తిని శ్రీనివాస్ గౌడ్

వరంగల్ నవంబర్ 10(మల్లేష్ మీవార్త ప్రతినిధి) :

విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర విద్యారంగాన్ని ఉద్ధరిస్తానని చెప్పి అధికారంలోకి వచ్చారని, మరి విద్యాశాఖకు కేటాయించిన నిధులు, విద్యార్థులకు మరియు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీల అమలు పరిస్థితి ఏమిటో తెలంగాణ ప్రజలకు సమాధానం చెప్పాలని బీఆర్ఎస్ పార్టీ వరంగల్ జిల్లా జనరల్ సెక్రటరీ, బీసీ సెల్ రాష్ట్ర నాయకులు, నర్సంపేట మాజీ మార్కెట్ చైర్మన్ బత్తిని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈసందర్భంగా అయన మాట్లాడుతూ 2024 నుంచి 2026 వరకు విద్యాశాఖకు కేటాయించినట్లు పేర్కొన్న బడ్జెట్ వివరాలను ఆయన వెల్లడించారు.

- 2024 సంవత్సరం: రూ.21,292 కోట్లు
- 2025 సంవత్సరం: రూ.23,108 కోట్లు
- 2026 సంవత్సరం: రూ.26,674 కోట్లు

మొత్తంగా మూడు సంవత్సరాల్లో రూ.71,074 కోట్లు కేటాయించినట్లు ఈ లెక్కలు సూచిస్తున్నాయని, ఈ నిధులను ఏయే కార్యక్రమాలకు ఖర్చు చేశారు? పాఠశాలలు, కళాశాలల అభివృద్ధికి ఎంత వినియోగించారు? విద్యార్థులకు అందించిన ప్రయోజనాలేమిటి? అనే అంశాలపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేసి ప్రజలకు వివరించాలని బత్తిని శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు.

కాంగ్రెస్ ఇచ్చిన 12 హామీల అమలు ఏది అని ప్రశ్నించారు.2023 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రకటించిన అభయహస్తం హామీల్లో విద్యార్థులు, నిరుద్యోగ యువతకు సంబంధించి అనేక హామీలు ఉన్నాయని, వాటి అమలు పరిస్థితిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ఆయన ప్రశ్నించారు. యువత కోసం ప్రకటించిన యువ వికాసం పథకం ఏమైంది?. కళాశాల విద్యార్థులకు ప్రకటించిన రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు ఎక్కడుంది?. ప్రతి మండలంలో తెలంగాణ ఇంటర్నేషనల్ స్కూల్ ఏర్పాటు చేస్తామన్న హామీ ఏమైంది?. ఐఐటీ, జేఈఈ, నీట్ ప్రవేశ పరీక్షలకు ఉచిత శిక్షణ కేంద్రాల ఏర్పాటు ఏమైంది?. నిరుద్యోగులకు నెలకు రూ.4,000 నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీ ఏమైంది?. 18 సంవత్సరాలు నిండిన కళాశాల విద్యార్థినులకు ఉచిత ఎలక్ట్రిక్ స్కూటీలు అందిస్తామన్న హామీ ఏమైంది?. రాష్ట్రంలోని 65 ఐటీఐ కళాశాలలను సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మారుస్తామన్న ప్రకటన అమలు ఎంతవరకు వచ్చింది?. ప్రతి మండలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ గురుకుల భవనాలు నిర్మిస్తామన్న హామీ ఏమైంది?. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్య అందిస్తామన్న హామీ ఏమైంది?. ప్రతి సంవత్సరం జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రెండు లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న హామీ ఏమైంది?. ప్రభుత్వ పాఠశాలలను అంతర్జాతీయ ప్రమాణాలతో మోడల్ స్కూళ్లుగా తీర్చిదిద్దుతామన్న ప్రకటన ఏమైంది?.



ఉన్నత విద్యను అభ్యసించిన ఎస్సీ, ఎస్టీ నిరుద్యోగులకు రూ.లక్ష నుంచి రూ.5 లక్షల వరకు ప్రోత్సాహకాలు అందిస్తామన్న హామీ ఏమైంది అని ప్రశ్నించారు.కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు గడుస్తున్నా ఎన్నికల సమయంలో ప్రకటించిన అనేక హామీల అమలుపై విద్యార్థులు, నిరుద్యోగ యువతలో తీవ్ర అసంతృప్తి నెలకొందని బత్తిని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. హామీల అమలుకు నిధులు కేటాయించారా? కేటాయించిన నిధులు ఎక్కడ ఖర్చు చేశారు? ఎన్ని పథకాలు ప్రారంభించారు? ఎంతమంది విద్యార్థులు, నిరుద్యోగులు లబ్ధి పొందారు? అనే వివరాలను ప్రభుత్వం వెల్లడించాలని డిమాండ్ చేశారు. విద్యార్థులు, యువత భవిష్యత్తుతో ముడిపడిన అంశాలపై ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం తగదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని కోరారు.

భావి భారత నిర్మాణంలో కీలక పాత్ర పోషించే విద్యార్థులు, యువతకు సరైన విద్యా అవకాశాలు, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని ఆయన పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీ తరపున విద్యార్థులు, నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ పనితీరును ప్రజలు, విద్యావంతులు, మేధావులు నిశితంగా పరిశీలించాలని, ప్రజా సమస్యలపై ప్రశ్నించాలని, రాబోయే రోజుల్లో ప్రజాస్వామ్య పద్ధతిలో తగిన సమాధానం చెప్పాలని బత్తిని శ్రీనివాస్ గౌడ్ విజ్ఞప్తి చేశారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలి

- అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవు -- అదనపు కలెక్టర్ హెచ్చరిక

- పెబ్బేరు, నాగవరం బియ్యం విక్రయ కేంద్రాలు ప్రారంభం

ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో నవంబర్ 10 మీ వార్త

వనపర్తి టౌన్ న్యూస్ : జిల్లాలో ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరలకు అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే బియ్యం విక్రయించాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వ ధరలను ఉల్లంఘించి అధిక ధరలకు బియ్యం విక్రయించే వ్యాపారులపై నిబంధనల ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.ఈ మేరకు మంగళవారం పెబ్బేరు మండలంలోని సాయి గణేష్ రైస్ మిల్ వద్ద, వనపర్తి మండలంలోని నాగవరం గ్రామంలో ఉన్న శ్రీ రాఘవేంద్ర ఇండస్ట్రీస్ వద్ద ఏర్పాటు చేసిన రెండు బియ్యం విక్రయ కేంద్రాలను అదనపు కలెక్టర్ ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సామాన్య ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని అందుబాటు ధరల్లో అందించడమే ఈ విక్రయ కేంద్రాల ప్రధాన ఉద్దేశమని తెలిపారు. బియ్యం వ్యాపారులు ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే విక్రయాలు జరపాలని, ప్రభుత్వ మార్గదర్శకాలు, నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. కేంద్రాల నిర్వహణపై అధికారుల నిరంతర పర్యవేక్షణ అవసరం...

జిల్లాలో ఏర్పాటు చేసిన బియ్యం విక్రయ కేంద్రాల ద్వారా ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా బియ్యం అందేలా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని అదనపు కలెక్టర్ ఆదేశించారు. విక్రయ కేంద్రాల నిర్వహణలో పారదర్శకత పాటిస్తూ, ప్రజలకు సకాలంలో సేవలు అందించాలని సూచించారు.





ప్రభుత్వం నిర్ణయించిన బియ్యం ధరలు ఇవే!
బియ్యం రకం। ధర (కిలోకు)
బీపీటీ / కెఎన్ఎం । రూ.66
ఆర్ఎన్ఆర్ / తెలంగాణ సోనా। రూ.74
హెచ్ఎంటీ / జెఎస్ఆర్ । రూ.79
ప్రజలు ఈ విక్రయ కేంద్రాలను సద్వినియోగం చేసుకొని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే నాణ్యమైన బియ్యాన్ని కొనుగోలు చేయాలని అధికారులు సూచించారు...

అటవీ ప్రాంతంలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి!



- పేకాట ఆడుతున్న ఇద్దరు వ్యక్తుల పట్టివేత...రూ.4,360 నగదు, బైక్, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం

ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో నవంబర్ 10 మీ వార్త :

వనపర్తి టౌన్ న్యూస్ : వనపర్తి పట్టణ శివారులోని అటవీ ప్రాంతంలో పేకాట ఆడుతున్న వారిపై పోలీసులు దాడి చేసి ఇద్దరిని పట్టుకుని వారి వద్ద నుంచి నగదు, ద్విచక్ర వాహనం, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.వివరాల్లోకి వెళితే.. మంగళవారం బిజినగడ్డ తండా (హెచ్/ఓ శ్రీనివాసపురం) సమీపంలోని అటవీ ప్రాంతంలో ఏడుగురు వ్యక్తులు కలిసి పేకాట ఆడుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో పోలీసులు అక్కడికి చేరుకుని తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు.పట్టుబడిన వారిలో వనపర్తి పట్టణంలోని సంత బజార్‌కు చెందిన కొమీరే ఆంజనేయులు (తండ్రి బాలచంద్రయ్య), గాంధీనగర్‌కు చెందిన కోమారి వెంకటరమణ (తండ్రి బాలకిష్టయ్య) ఉన్నారు.వీరి వద్ద నుంచి రూ.4,360 నగదు, ఒక ద్విచక్ర వాహనం, రెండు సెల్‌ఫోన్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి తదుపరి చట్టపరమైన చర్యలు చేపట్టినట్లు ఎస్సై రిషికేశ్ తెలిపారు.అక్రమ జూద కార్యకలాపాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదుప్రజా శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చట్టవిరుద్ధ కార్యకలాపాలపై పోలీసులు నిఘా కొనసాగిస్తున్నారు. ముఖ్యంగా పట్టణ శివారు ప్రాంతాలు, నిర్మానుష్య ప్రదేశాల్లో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై నిఘా ఉంచి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటున్నారు...

బోడుప్పల్ సర్కిల్ సమస్యలపై కత్తి వెంకట్ రెడ్డి సమరశంఖం

- అక్రమ షెడ్లు, అక్రమణలు, కాలనీల సమస్యలపై గళం..

- కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డికి సెటిలర్స్ ఫోరం వినతిపత్రం!

- అల్మాస్ కుంట, సుద్ద కుంట చెరువుల పరిరక్షణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి!

బోడుప్పల్ సర్కిల్ నవంబర్ 10 (మన మీ వార్త)



బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని వివిధ కాలనీల్లో నెలకొన్న ప్రజా సమస్యలను తక్షణమే పరిష్కరించాలని బోడుప్పల్ సర్కిల్ సెటిలర్స్ ఫోరం ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఇందిరా నగర్ బస్‌స్టాండ్‌లో మరుగుదొడ్ల నిర్మాణం, గాయత్రి నగర్‌లో నివాస ప్రాంతంలోని టపాసుల దుకాణం తొలగింపు, ఎన్‌టీఆర్ విగ్రహం పరిసరాల్లో ఆక్రమణల తొలగింపు, పలు కాలనీలో అక్రమ నిర్మాణాలపై విచారణ చేపట్టాలని కోరారు. అలాగే అల్మాస్ కుంట, సుద్ద కుంట చెరువుల పరిరక్షణ, అనుషక్తి నగర్ రోడ్ల మరమ్మతులతో పాటు పలు ప్రాంతాల్లో వెలసిన భారీ షెడ్లు, అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.ప్రజల ఆరోగ్యం, భద్రత, పారిశుద్ధ్యం, ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఫోరం ప్రతినిధులు కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఫోరం చైర్మన్ ఎడ్ల శ్రీనివాస్ రెడ్డి, అధ్యక్షుడు కత్తి వెంకట్ రెడ్డి, వైస్ చైర్మన్ తల్కా శతృజ్ఞ, ప్రధాన కార్యదర్శి అమర్ లింగా రెడ్డి అల్వా, ట్రెజరర్ బజ్జూరి శ్రీనివాస్ గుప్తా, సలహాదారులు వెంకట స్వామి, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కారు ఢీకొని స్కూటీపై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలు

- కోర్టు ఎదుట రోడ్డు ప్రమాదం.. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలింపు

- బాధితుడి సోదరుడి ఫిర్యాదుతో కేసు నమోదు -- ఎస్సై హరిప్రసాద్

ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో నవంబర్ 10 మీ వార్త :



వనపర్తి టౌన్ న్యూస్ : వనపర్తి పట్టణంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటీపై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు స్కూటీని ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. బాధితుడి పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

వివరాల్లోకి వెళితే.. నవంబర్ 8వ తేదీ రాత్రి సుమారు 9 గంటల సమయంలో వనపర్తి పట్టణంలోని కోర్టు ఎదుట రోడ్డుపై ఈ ప్రమాదం జరిగింది. పట్టణంలోని బండారు నగర్‌కు చెందిన అక్కలి సాయిబాబా గౌడ్ (60) తన స్కూటీపై సాగర్ కాలనీ వైపు వెళ్తుండగా, వెనుక నుంచి వచ్చిన కారు ఆయన స్కూటీని బలంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో సాయిబాబా గౌడ్ తలకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు ఆయనను వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.ఈ ఘటనపై నవంబర్ 10వ తేదీన బాధితుడి సోదరుడు వనపర్తి పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేపట్టారు.

ఈ సందర్భంగా ఎస్సై హరిప్రసాద్ మాట్లాడుతూ రోడ్లపై వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, వేగ నియంత్రణ పాటిస్తూ ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు...

నర్సింగాయపల్లిలో రోడ్డు ప్రమాదం.. ఇద్దరికి తీవ్ర గాయాలు!

- రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొని ప్రమాదం.. ఆసుపత్రికి తరలింపు

- బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన వనపర్తి పట్టణ పోలీసులు

ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో నవంబర్ 10 మీ వార్త :

వనపర్తి టౌన్ న్యూస్ : వనపర్తి జిల్లా నర్సింగాయపల్లి ప్రభుత్వ కళాశాల సమీపంలో మంగళవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదంలో గాయపడిన వారిని వెంటనే వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.వివరాల్లోకి వెళితే.. నవంబర్ 10వ తేదీ ఉదయం సుమారు 9:30 గంటల సమయంలో వనపర్తి పట్టణానికి చెందిన ఎం.డి. జహూర్ అహ్మద్ ఖాన్ (56), తన స్నేహితుడు ముడావత్ హన్మంతు (45)తో కలిసి మోటార్ సైకిల్‌పై వనపర్తి వైపు ప్రయాణిస్తున్నారు. ఈ క్రమంలో నర్సింగాయపల్లి ప్రభుత్వ కళాశాల ముందు వనపర్తి వైపు నుంచి వస్తున్న మరో మోటార్ సైకిల్ వీరి వాహనాన్ని ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో జహూర్ అహ్మద్ ఖాన్, ముడావత్ హన్మంతుకు తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి క్షతగాత్రులను చికిత్స నిమిత్తం వనపర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఈ ఘటనపై జహూర్ అహ్మద్ ఖాన్ కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు వనపర్తి పట్టణ పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రమాదానికి గల కారణాలు, ఇతర వివరాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ సూచనలు...

రోడ్డుపై ప్రయాణించే సమయంలో వాహనదారులు వేగ నియంత్రణ పాటిస్తూ, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని పోలీస్ లు సూచిస్తున్నారు. ముఖ్యంగా ఎదురెదురుగా వాహనాలు వచ్చే సమయంలో అప్రమత్తంగా ఉండటం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని పేర్కొన్నారు...

అప్పుల బాధతో వ్యక్తి మృతి

- తిరుమలాయగుట్ట వెళ్లే దారిలో ఫారెస్ట్ ఏరియాలో విషాద ఘటన

- భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన ఎస్సై రిషికేశ్

ఉమ్మడి మహబూబ్‌నగర్ బ్యూరో నవంబర్ 10 మీ వార్త :

వనపర్తి రూరల్ న్యూస్ : కుటుంబ అవసరాల నిమిత్తం చేసిన అప్పులు ఎలా తీర్చాలో తెలియక తీవ్ర మనస్తాపానికి గురైన ఓ వ్యక్తి ప్రాణాలు కోల్పోయిన విషాద ఘటన చోటుచేసుకుంది.

వివరాల్లోకి వెళితే.. వనపర్తి జిల్లా కదుకుంట్ల గ్రామానికి చెందిన నక్క లక్ష్మీనారాయణ (42), తండ్రి సాయన్న, కుటుంబ అవసరాల కోసం అప్పులు చేసినట్లు సమాచారం. అయితే చేసిన అప్పులను ఎలా తీర్చాలో తెలియక కొంతకాలంగా ఆందోళనకు గురవుతున్నట్లు తెలుస్తోంది.ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది నవంబర్ 9వ తేదీన తిరుమలాయగుట్టకు వెళ్లే మార్గంలోని అటవీ ప్రాంతంలో గుర్తుతెలియని పురుగుల మందు తాగినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఘటనలో ఆయన మృతి చెందాడు.మృతుడి భార్య నక్క యాదమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై రిషికేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను పోలీసులు సేకరిస్తున్నారు.

కుటుంబంలో విషాదం...

కుటుంబ అవసరాల కోసం చేసిన అప్పుల నేపథ్యంలో చోటుచేసుకున్న ఈ ఘటన స్థానికంగా విషాదాన్ని నింపింది. మృతుడి కుటుంబ సభ్యులు తీవ్ర ఆవేదనకు గురయ్యారు...

భూమి, ఇల్లు అమ్మి డబ్బులు ఇవ్వాలంటూ తండ్రిపై వేధింపులు!

- తిట్టి కొడుతున్నాడని తండ్రి ఫిర్యాదు.. కుమారుడిపై కేసు నమోదు
- కేసు నమోదు చేసిన ఎస్సై రిషికేశ్

ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో నవంబర్ 10 మీ వార్త :

వనపర్తి రూరల్ న్యూస్ : కుటుంబ ఆస్తుల విషయంలో తండ్రిపై కుమారుడు వేధింపులకు పాల్పడుతున్న ఘటన వెలుగులోకి వచ్చింది. భూమి లేదా ఇల్లు విక్రయించి తనకు డబ్బులు ఇవ్వాలని కొంతకాలంగా తండ్రిని వేధిస్తూ, దుర్భాషలాడుతూ దాడి చేస్తున్నాడని బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. వివరాల్లోకి వెళితే.. అచ్చుతాపురం గ్రామానికి చెందిన ఉమ్మల్ల జక్కయ్య, తండ్రి బుచ్చన్నను ఆయన కుమారుడు ప్రవీణ్ గత కొంతకాలంగా భూమి లేదా ఇల్లు అమ్మి డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. తన కోరిక మేరకు ఆస్తులు విక్రయించి డబ్బులు ఇవ్వాలని తండ్రిని తిడుతూ, కొడుతూ వేధింపులకు గురిచేస్తున్నాడని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.బాధితుడి ఫిర్యాదును స్వీకరించిన ఎస్సై రిషికేశ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. కుటుంబ వ్యవహారమైనప్పటికీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకొని తల్లిదండ్రులను వేధించడం, దాడులకు పాల్పడటం చట్టరీత్యా నేరమని ఈ ఘటన మరోసారి తెలియజేస్తోంది...

నంది విగ్రహం చోరీ కేసును ఛేదించాలి!

- పురాతన శివాలయాన్ని సందర్శించి దర్యాప్తు పురోగతిపై ఆరా తీసిన మంత్రి జూపల్లి
- సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలిస్తున్న పోలీసులు.. త్వరలోనే నిందితుల గుర్తింపు

ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో నవంబర్ 10 మీ వార్త :



నాగర్ కర్నూల్ జిల్లా ,కొల్లాపూర్ న్యూస్ : కొల్లాపూర్ మండలం కుడికిల్ల గ్రామంలోని పురాతన శివాలయంలో నంది విగ్రహం చోరీ ఘటనపై రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ప్రత్యేకంగా ఆరా



తీశారు. చోరీ కేసు దర్యాప్తు పురోగతిని పోలీసు అధికారులను అడిగి తెలుసుకున్నారు. మంగళవారం మంత్రి జూపల్లి కృష్ణారావు కుడికిల్ల గ్రామంలోని సుమారు 200 ఏళ్ల చరిత్ర కలిగిన పురాతన



శివాలయాన్ని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి ఆశీర్వచనం అందించారు. అనంతరం ఆలయంలో నంది విగ్రహం చోరీకి గురైన ఘటనపై వివరాలు తెలుసుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పటివరకు చేపట్టిన దర్యాప్తు, నిందితుల గుర్తింపు కోసం తీసుకుంటున్న చర్యలపై అధికారులను ప్రశ్నించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నంది విగ్రహం చోరీ కేసులో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారని తెలిపారు. ఆలయం పరిసరాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీని క్షుణ్ణంగా పరిశీలిస్తూ నిందితుల ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. త్వరలోనే నిందితులను గుర్తించి పట్టుకుంటారనే ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

పురాతన ఆలయాల పరిరక్షణకు ప్రాధాన్యత...

చారిత్రక ప్రాధాన్యత కలిగిన ఆలయాల్లో ఇటువంటి చోరీ ఘటనలు జరగడం ఆందోళనకరమని, ఈ కేసును పోలీసులు సమర్థవంతంగా దర్యాప్తు చేసి నిందితులను గుర్తించే దిశగా చర్యలు తీసుకుంటున్నారని మంత్రి వెల్లడించారు...

గిరిజనుల ప్రాణాలతో చెలగాటమా?

- కేశంపేట--రేవల్లి రహదారిని వెంటనే నిర్మించాలి
- ఎమ్మెల్యే మెగా రెడ్డిపై బీజేపీ గిరిజన మోర్చా నాయకుడు తిరుపతి నాయక్ విమర్శలు

ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో నవంబర్ 10 మీ వార్త :



వనపర్తి జిల్లా,రేవల్లి న్యూస్ : కేశంపేట నుంచి రేవల్లి మండలానికి వెళ్లే ప్రధాన రహదారిని వెంటనే అభివృద్ధి చేసి, నాణ్యతతో కూడిన రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలని బీజేపీ గిరిజన మోర్చా వనపర్తి జిల్లా నాయకుడు తిరుపతి నాయక్ డిమాండ్ చేశారు. రహదారి దుస్థితి కారణంగా గిరిజన తండాల ప్రజలు, విద్యార్థులు, రైతులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా తిరుపతి నాయక్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సమయంలో రహదారిని బాగు చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు పూర్తిస్థాయిలో పనులు చేపట్టలేదని విమర్శించారు. ఆరు నెలల తర్వాత కేవలం కంకర డస్ట్ పోసి నామమాత్రంగా పనులు చేసినట్లు ప్రచారం చేసుకుని వదిలేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే మెగా రెడ్డి ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు.

గోతుల రోడ్డుతో ప్రజలకు తప్పని ఇబ్బందులు...

కేశంపేట, పాత తండా, కొత్త తండా ప్రజలకు ఈ రహదారి ఎంతో కీలకమని, విద్యార్థులు పాఠశాలలకు వెళ్లడానికి, గర్భిణులు ఆసుపత్రులకు చేరుకోవడానికి, రైతులు పంటలను మార్కెట్లకు తరలించడానికి ఇదే ప్రధాన మార్గమని తెలిపారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో ద్విచక్ర వాహనదారులు, ఆటో ప్రయాణికులు ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి నెలకొందన్నారు. వర్షాకాలంలో బురద, వేసవిలో దుమ్ముతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

కేంద్ర నిధులు ఏమయ్యాయి? ఎమ్మెల్యేకు ప్రశ్నలు...

గ్రామీణ రహదారుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయిస్తున్నప్పటికీ, ఈ ప్రాంత రహదారి అభివృద్ధి ఎందుకు జరగడం లేదని తిరుపతి నాయక్ ప్రశ్నించారు. రోడ్డు పనులు ఆలస్యం కావడానికి బాధ్యులెవరు? కంకర డస్ట్ వేసి పనులు నిలిపివేయడానికి కారణాలేమిటి? కేంద్ర నిధుల వినియోగం ఎలా జరిగిందో ప్రజలకు వివరించాలని డిమాండ్ చేశారు.

రోడ్డు పనులు ప్రారంభించకపోతే ఆందోళన...

కేశంపేట--రేవల్లి రహదారి పనులను వెంటనే ప్రారంభించి, నాణ్యతతో పూర్తి చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. గిరిజన ప్రజల సమస్యలను పరిష్కరించకపోతే తండాల ప్రజలను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని, రహదారిపై బైఠాయించి నిరసన తెలుపుతామని హెచ్చరించారు. గిరిజన ప్రజల రవాణా సౌకర్యం, భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇవ్వాలని తిరుపతి నాయక్ డిమాండ్ చేశారు...

వనపర్తి మైనింగ్ శాఖలో ఏం జరుగుతోంది?







- క్రషర్ యజమానులకు అండగా నిలుస్తున్నారా ఎడి ?
- అక్రమ రవాణాను అడ్డుకోవడంలో అధికారులు విఫలమవుతున్నారా?
- లీజు ముగిసి 19 నెలలు... పాత స్టాక్ పేరుతో ఇంకా రవాణా!
- కానాయపల్లి క్రషర్‌లో పింక్ చీటీ నంబర్ 47 కలకలం!
- కరెంట్ కనెక్షన్ తొలగింపు... క్రషర్ మూసివేత... అయినా మెటీరియల్ సరఫరా ఎలా?
- 19 నెలల్లో ఎంత కంకర బయటకు వెళ్లింది? ఏడి మైన్స్ వద్ద లెక్కలున్నాయా?
- మిగిలిన స్టాక్‌ను ఎందుకు సీజ్ చేయలేదు? విక్రయాలకు అనుమతులు ఉన్నాయా?
- వనపర్తి జిల్లాలో ఎన్ని క్రషర్లు సక్రమం? ఎన్ని నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నాయి?
- క్రషర్ యజమానులకు ప్రత్యేక వెసులుబాటా? అధికారుల పర్యవేక్షణపై అనుమానాలు!
- జీవోలు, మైనింగ్ చట్టాలు అమలు చేయాల్సిన బాధ్యత ఏడి మైన్స్‌దే!

ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో నవంబర్ 10 మీ వార్త

వనపర్తి జిల్లా, కానాయపల్లి న్యూస్ : జిల్లాలో మైనింగ్ వ్యవహారాలు అనేక అనుమానాలకు తావిస్తున్నాయి. ముఖ్యంగా కొత్తకోట మండలం కానాయపల్లి క్రషర్ వ్యవహారం మైనింగ్ శాఖ పనితీరుపై ప్రశ్నలు లేవనెత్తుతోంది. క్రషర్ యజమాని తోట తిరుపతయ్య తెలిపిన వివరాల ప్రకారం, క్వారీ, క్రషర్ లీజు ఏప్రిల్ 2025లో ముగిసింది. విద్యుత్ బిల్లుల భారంతో కరెంట్ కనెక్షన్ తొలగించుకుని క్రషర్ మూసివేశామని ఆయన పేర్కొన్నారు. అయితే పాత స్టాక్‌ను అప్పుడప్పుడు విక్రయిస్తున్నట్లు వెల్లడించిన నేపథ్యంలో, సుమారు 19 నెలలుగా ఆ స్టాక్ ఎంత మేరకు తరలిపోయిందన్నది కీలక ప్రశ్నగా మారింది.

19 నెలల పాత స్టాక్... అసలు లెక్కలు ఎక్కడ?

లీజు ముగిసిన సమయంలో క్రషర్ వద్ద ఎంత మెటీరియల్ నిల్వ ఉంది? అధికారులు ఎంత పరిమాణాన్ని కొలిచి నమోదు చేశారు? ఇప్పటివరకు ఎన్ని టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా ఎంత మెటీరియల్ విక్రయించారు? ఇంకా ఎంత స్టాక్ మిగిలి ఉంది?పాత స్టాక్ పేరుతో నెలల తరబడి విక్రయాలు కొనసాగుతున్నాయంటే దానికి సంబంధించిన రోజువారీ లెక్కలు, స్టాక్ రిజిస్టర్, రవాణా అనుమతులు ఉండాలి. ఆ రికార్డులను ఏడి మైన్స్ అధికారులు పరిశీలించారా? మిగిలిన స్టాక్‌ను ఎందుకు సీజ్ చేయలేదు? ప్రజలకు స్పష్టత ఇవ్వాలి.

పింక్ చీటీ నంబర్ 47... డస్ట్ పేరుతో డబ్ల్యూఎంఎం రవాణా జరిగిందా?

10-11-2025న ఖానాయపల్లి--కొత్తకోట రహదారిపై ఓ టిప్పర్ డ్రైవర్ శివ చూపించిన పింక్ చీటీలో సీరియల్ నంబర్ 47, ఆర్ఎంసి పార్టీ, కెఎన్పి ప్రదేశం, 600 సిఎఫ్టీ , నెట్ వెయిట్, డస్ట్ మెటీరియల్ అని నమోదైంది. వాహనం నెంబర్ టీఎస్ 12 యూఈ 2233 వాహనం నెంబర్ లో డ్రైవర్ మాత్రం డబ్ల్యూఎంఎం మెటల్ ఆర్ఎంసి కి తీసుకెళ్తున్నానని, ఇది రెండో ట్రిప్పు అని చెప్పినట్లు సమాచారం.చీటీలో డస్ట్ అని ఉండగా డ్రైవర్ డబ్ల్యూఎంఎం అని చెప్పడం వెనుక వాస్తవం ఏమిటి? ఆ చీటీకి ప్రభుత్వ ట్రాన్సిట్ పాస్‌కు సంబంధించిన చట్టబద్ధత ఉందా? రాయల్టీ చెల్లింపులు జరిగాయా? ఈ అంశాలను ఏడి మైన్స్ స్వయంగా పరిశీలించి సమాధానం చెప్పాలి.

ఏడి మైన్స్ బాధ్యత ఏమిటి? క్రషర్ యజమానులకు సహకరిస్తున్నారా?

క్రషర్ యజమాని మిగిలిన స్టాక్‌ను విక్రయిస్తున్నామని చెబుతుంటే, ఆ స్టాక్ ఎంత? ఎక్కడి నుంచి ఎంత రవాణా అవుతోంది? అనుమతులు ఏమిటి? అనే వివరాలను పర్యవేక్షించాల్సిన బాధ్యత మైనింగ్ శాఖ అధికారులదే.మరోవైపు మిగిలిన స్టాక్‌ను లెక్కించి డిమాండ్ నోటీసు ఇచ్చామని, అందులో స్టాక్ కూడా కవర్ అయిందని ఏడి మైన్స్ అధికారి తెలిపినట్లు సమాచారం. అయితే డిమాండ్ నోటీసు ఇవ్వడం మాత్రమే సరిపోతుందా? స్టాక్ విక్రయానికి, రవాణాకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? అధికారుల తనిఖీలు జరిగాయా?క్రషర్ యజమానులకు ప్రత్యేక వెసులుబాటు కల్పిస్తున్నారా? లీజు గడువు ముగిసినప్పటికీ మెటీరియల్ రవాణాపై అధికారులు ఎందుకు స్పష్టత ఇవ్వడం లేదు? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. ఇవి నిజమో కాదో తేల్చాల్సిన బాధ్యత కూడా ఏడి మైన్స్ అధికారులదే. సంబంధిత రికార్డులను బయటపెట్టి పారదర్శకంగా సమాధానం ఇవ్వాలి.

వనపర్తి జిల్లాలో ఎన్ని క్రషర్లు సక్రమం? ఎన్ని అక్రమం?

వనపర్తి పట్టణం, కొత్తకోట, పానగల్, ఖిల్లా గణపురం, గోపాలపేట మండలంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో కంకర, 20ఎంఎం , 40ఎంఎం , డస్ట్, డబ్ల్యూఎంఎం వంటి మెటీరియల్స్ టిప్పర్లు, ట్రాక్టర్లలో రవాణా అవుతున్నాయన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. రాయల్టీ, ట్రాన్సిట్ పాస్‌లు లేకుండా, ఓవర్‌లోడ్‌తో వాహనాలు తిరుగుతున్నాయన్న ఫిర్యాదులపైనా అధికారులు విచారణ చేపట్టాలి.జిల్లాలో మొత్తం ఎన్ని క్రషర్లు ఉన్నాయి? ఎన్ని క్రషర్ల లీజులు ప్రస్తుతం సక్రమంగా అమల్లో ఉన్నాయి? ఎన్ని లీజుల గడువు ముగిసింది? ఎన్ని క్రషర్లు అనుమతుల కోసం దరఖాస్తు చేసుకున్నాయి? నిబంధనలకు విరుద్ధంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న క్రషర్లు ఎన్ని? ఇప్పటివరకు ఎన్ని తనిఖీలు చేసి, ఎన్ని కేసులు నమోదు చేశారు?ఈ వివరాలన్నీ ఏడి మైన్స్ కార్యాలయం ప్రజలకు వెల్లడించాలి.

జీవోలు, చట్టాలు చెబుతున్నది ఏమిటి?

మైనింగ్ కార్యకలాపాలు ఇష్టానుసారంగా నిర్వహించడానికి వీల్లేదు. కేంద్ర ప్రభుత్వ మైన్స్ అండ్ మినిరాల్స్ (డెవలప్మెంట్ అండ్ రెగ్యులేషన్) యాక్ట్ , 1957లోని సెక్షన్లు 4, 21, 23ని ప్రకారం లీజులు, అనుమతులు, అక్రమ తవ్వకాలు, ఖనిజాల రవాణా, నిల్వలపై చట్టపరమైన నియంత్రణ ఉంది.తెలంగాణ ప్రభుత్వం జారీ చేసిన G.O.Ms.No.26, తేదీ 31-03-2022 ద్వారా తెలంగాణ మైనర్ మినరల్ కాన్సెషన్ రూల్స్ , 1966లోని రూల్ 12కు సవరణలు చేసి, సంబంధిత మైనర్ మినరల్ లీజుల మంజూరుకు వేలం విధానాన్ని ప్రవేశపెట్టింది.అదేవిధంగా G.O.Ms.No.45, తేదీ 10-11-2022 ద్వారా మైనర్ మినరల్ కన్సెషన్ల వేలం ప్రక్రియకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసింది. ఇందులో ఏడి మైన్స్ అధికారులకు కూడా నిర్దిష్ట బాధ్యతలు ఉన్నాయి. సంబంధిత శాఖల అనుమతులు, లీజు ప్రక్రియలు నిబంధనల ప్రకారం జరిగేలా పర్యవేక్షించాల్సి ఉంటుంది. G.O.Ms.No.15, తేదీ 08-07-2025 ద్వారా వేలం మార్గదర్శకాల్లో మరిన్ని సవరణలు చేశారు. సంబంధిత ప్రక్రియలో రెవెన్యూ శాఖ ఎన్ఓసి , డీజీపీస్ సర్వే వంటి అంశాలను కూడా చేర్చారు. ఈ జీవోల పరిధి, వర్తించే లీజుల వివరాలను అధికారులు పరిశీలించాలి.అలాగే తెలంగాణ మైనర్ మినరల్ కన్సెషన్ రూల్స్, 1966 ప్రకారం లీజులు, రాయల్టీ, నిల్వలు, రవాణా అనుమతులు, ట్రాన్సిట్ పాస్‌లకు సంబంధించిన నిబంధనలు అమలు కావాలి. చట్టవిరుద్ధ రవాణా లేదా ఉల్లంఘనలు నిర్ధారణ అయితే సంబంధిత నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలి.

ఏడి మైన్స్ పూర్తి బాధ్యత తీసుకోవాలి!

కానాయపల్లి క్రషర్‌కు సంబంధించిన లీజు గడువు, స్టాక్ వెరిఫికేషన్, డిమాండ్ నోటీసు, రాయల్టీ చెల్లింపులు, విక్రయాల లెక్కలు, పింక్ చీటీ నంబర్ 47, రవాణా అనుమతులపై ఏడి మైన్స్ సమగ్ర వివరణ ఇవ్వాలి.జిల్లాలోని అన్ని క్రషర్లపై తనిఖీలు నిర్వహించి, సక్రమంగా నడుస్తున్నవి ఎన్ని? గడువు ముగిసినవి ఎన్ని? నిబంధనలకు విరుద్ధంగా పనిచేస్తున్నవి ఎన్ని? అనే వివరాలతో అధికారిక నివేదిక విడుదల చేయాలి.క్రషర్ యజమానులపై వచ్చిన ఆరోపణలు నిజమైతే చర్యలు తీసుకోవాలి. అధికారులు ఎవరైనా నిబంధనల ఉల్లంఘనలను పట్టించుకోకుండా వ్యవహరించినట్లు తేలితే వారిపైనా శాఖాపరమైన చర్యలు తీసుకోవాలి. అదే సమయంలో క్రషర్ యజమానులు తమ వద్ద ఉన్న లీజు, స్టాక్, రాయల్టీ, రవాణా అనుమతుల పత్రాలను సమర్పించాలి.

అధికారుల పర్యవేక్షణలో లోపమా? క్రషర్ యజమానులకు ప్రత్యేక వెసులుబాటా?

లీజు ముగిసిన క్రషర్ నుంచి 19 నెలలుగా ఎంత మెటీరియల్ బయటకు వెళ్లింది? పాత స్టాక్ పేరుతో విక్రయాలు చేయడానికి ఏ అనుమతులు ఉన్నాయి? జిల్లాలో ఎన్ని క్రషర్లు సక్రమంగా నడుస్తున్నాయి? అక్రమ రవాణాను అడ్డుకోవడంలో మైనింగ్ శాఖ చర్యలు ఏమిటి?ఈ ప్రశ్నలకు ఏడి మైన్స్ అధికారులు స్పష్టమైన సమాధానం చెప్పాలి. క్రషర్ యజమానులకు అధికారులు సహకరిస్తున్నారన్న అనుమానాలకు తావులేకుండా రికార్డులను ప్రజల ముందుంచాలి.జిల్లా కలెక్టర్, డైరెక్టర్ ఆఫ్ మైన్స్ తక్షణమే స్పందించి స్వతంత్ర విచారణకు ఆదేశించాలి. ప్రభుత్వ ఖనిజ సంపదను కాపాడాల్సిన బాధ్యత అధికారులదే. బాధ్యత నుంచి ఎవరూ తప్పించుకోలేరు...

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి!

- జాతీయ ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను తప్పనిసరిగా సాధించాలి
- వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కీలక ఆదేశాలు

ఉమ్మడి మహబూబ్నగర్ బ్యూరో నవంబర్ 10 మీ వార్త

వనపర్తి టౌన్ న్యూస్ : జిల్లాలో ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంతో పాటు, ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాలని కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ అధికారులను ఆదేశించారు. మాతా శిశు ఆరోగ్యం, మహిళల్లో క్యాన్సర్ వ్యాధుల ముందస్తు గుర్తింపు, వ్యాధి నిరోధక టీకాలు, డెంగ్యూ, మలేరియా నివారణ, క్షయ వ్యాధి నిర్మూలన వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.ఈ సందర్భంగా కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆధ్వర్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో అమలవుతున్న వివిధ జాతీయ ఆరోగ్య కార్యక్రమాల పురోగతి, లక్ష్యాల సాధన, ఎదురవుతున్న సమస్యలపై సమగ్రంగా సమీక్షించి పలు కీలక సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.

మాతా శిశు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి...

గర్భిణీలందరినీ సకాలంలో నమోదు చేసి అవసరమైన వైద్య పరీక్షలు నిర్వహించాలని, ఐరన్ ఫోలిక్ యాసిడ్ మాత్రలను క్రమం తప్పకుండా పంపిణీ చేయాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల శాతాన్ని 100 శాతానికి పెంచడంతో పాటు, అనవసర సిజేరియన్ ఆపరేషన్లను తగ్గించాలని సూచించారు.

మహిళల్లో క్యాన్సర్ వ్యాధుల ముందస్తు గుర్తింపు...

ఆరోగ్య మహిళ కార్యక్రమం ద్వారా నోటి, రొమ్ము,





గర్భాశయ ముఖద్వార క్యాన్సర్లను ముందుగానే గుర్తించేలా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. చిన్నారులందరికీ 100 శాతం వ్యాధి నిరోధక టీకాలు అందించాలని, పోషకాహార లోపం ఉన్న పిల్లలకు ప్రత్యేక వైద్య సేవలు అందించాలని సూచించారు.

డెంగ్యూ, మలేరియా నివారణకు చర్యలు...

జిల్లాలో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టేందుకు యాంటీ లార్వా ఆపరేషన్లు విస్తృతంగా చేపట్టాలని, దోమల ఉత్పత్తి కేంద్రాలను గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. క్షయ వ్యాధి బాధితులకు అవసరమైన చికిత్సతో పాటు ఆర్థిక, పోషకాహార సహాయం అందించాలని సూచించారు.

ప్రైవేట్ ఆసుపత్రులపై పర్యవేక్షణ పెంచాలి...

జిల్లాలోని ప్రైవేట్ ఆసుపత్రులను నిరంతరం తనిఖీ చేస్తూ నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. లింగ నిర్ధారణ పరీక్షలు జరగకుండా కఠినంగా పర్యవేక్షించాలని, 30 ఏళ్లు పైబడిన వారందరికీ రక్తపోటు, మధుమేహం తదితర వ్యాధుల పరీక్షలు నిర్వహించాలని సూచించారు.

ఈ నెల 16 నుంచి ఈ - ప్రమాణ యాప్ ద్వారా హాజరు తప్పనిసరి

వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి తప్పనిసరిగా ఈ - ప్రమాణ యాప్ ద్వారా హాజరు నమోదు చేసుకోవాలని కమిషనర్ స్పష్టం చేశారు. ఈ నెల 16వ తేదీ నుంచి కేవలం ఈ - ప్రమాణ యాప్ ద్వారానే ఉద్యోగుల హాజరు నమోదు చేయనున్నట్లు వెల్లడించారు.అలాగే అభా కార్డుల నమోదు పెంచాలని, ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, డిజిటల్ ఆరోగ్య సేవలను మరింత విస్తరించాలని అధికారులకు సూచించారు.జిల్లాలోని అన్ని ఆరోగ్య కార్యక్రమాలను నిర్దేశించిన లక్ష్యాల మేరకు అమలు చేస్తూ ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కమిషనర్ ఆదేశించారు.

ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్, జిల్లా ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ మారుతి నందన్ గౌడ్, డాక్టర్ రాకేశ్ రెడ్డి, జిల్లా ప్రోగ్రామ్ కోఆర్డినేటర్లు, ఇతర వైద్య ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

వాయు కాలుష్యంలోనూ 'విశ్వగురువు' కావాలా?

న్యూఢిల్లీ, నవంబర్ 10: దేశ రాజధాని దిల్లీలో వాయు కాలుష్యం తీవ్రరూపం దాల్చడంపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. వాయు కాలుష్యంలో దిల్లీ 'విశ్వగురువు'గా ఎందుకు మారుతోందని ప్రశ్నించారు. కాలుష్య నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు తీసుకోవడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. అరకొర చర్యలు, ప్రచార ఆర్భాటాలు, హామీలు, ఇతరులపై నిందలు వేయడమే బీజేపీ ప్రభుత్వ విధానంగా మారిందని మండిపడ్డారు. ప్రజలకు స్వచ్ఛమైన గాలి అందించడం ప్రభుత్వ బాధ్యత అని, అది ఎవరికో ఇచ్చే ప్రత్యేక హక్కు కాదని స్పష్టం చేశారు.

ప్రధాని హామీ ఏమైంది?

2019 మే 8న ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వాయు కాలుష్యాన్ని దేశం ఎదుర్కొంటున్న ప్రధాన సవాలుగా గుర్తించారని ఖర్గే గుర్తుచేశారు. అయితే ఆ సమస్య పరిష్కారానికి ఆయన ప్రభుత్వం ఇప్పటివరకు సరైన చర్యలు తీసుకోలేదని విమర్శించారు. దిల్లీ--ఎన్‌సీఆర్ ప్రాంతంతో పాటు ఉత్తరప్రదేశ్, బిహార్, హరియాణా, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోనూ ప్రజలు కలుషిత గాలితో ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణపై ప్రభుత్వం తీసుకున్న చర్యల వివరాలను ప్రజలకు వెల్లడించాలని డిమాండ్ చేశారు. ప్రధానమంత్రి మోదీ దేశానికి 'హవా కా హిసాబ్' (గాలి లెక్క) చెప్పగలరా? అని సవాల్ విసిరారు.

59 కేంద్రాల్లో 36 చోట్ల పీఎం2.5 వివరాలు లేవా?

దిల్లీలో కాలుష్య స్థాయిలు తీవ్రంగా ఉన్న సమయంలో 59 వాయు నాణ్యత పర్యవేక్షణ కేంద్రాల్లో 36 కేంద్రాల వద్ద పీఎం2.5 రీడింగ్‌లు కనిపించకుండా పోయాయని ఖర్గే ఆరోపించారు. గత ఏడాది కాలుష్య పర్యవేక్షణ కేంద్రాల చుట్టూ నీటి ట్యాంకర్లతో నీటిని పిచికారీ చేసి కాలుష్య గణాంకాలను తగ్గించి చూపించారనే ఆరోపణలు వచ్చాయని గుర్తుచేశారు. ఈ ఏడాది కాలుష్యం గరిష్ఠ స్థాయికి చేరిన సమయంలో పీఎం2.5 వివరాలు అందుబాటులో లేకపోవడంపై ఆయన అనుమానాలు వ్యక్తం చేశారు. అయితే ఈ ఆరోపణలపై సంబంధిత ప్రభుత్వ విభాగాల వివరణ



అవసరం.

కాలుష్యంతో వేలాది మరణాలు

వాయు కాలుష్యం ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతోందని ఖర్గే ఆందోళన వ్యక్తం చేశారు. గ్లోబల్ బర్డెన్ ఆఫ్ డిసీజ్ అధ్యయనం, సెంటర్ ఫర్ రీసెర్చ్ ఆన్ ఎనర్జీ అండ్ క్లీన్ ఎయిర్ (సీఆర్‌ఈఏ) అంచనాలను ప్రస్తావిస్తూ.. 2023లో దిల్లీలో సూక్ష్మ ధూళి కణాల కాలుష్యంతో సంబంధం ఉన్న మరణాలు 17,188గా ఉన్నాయని పేర్కొన్నారు. ఇది ఆ ఏడాది నగరంలోని మొత్తం మరణాల్లో దాదాపు 15 శాతమని తెలిపారు. అలాగే 'స్టేట్ ఆఫ్ గ్లోబల్ ఎయిర్-2024' నివేదిక ప్రకారం, 2021లో దేశవ్యాప్తంగా ఐదేళ్లలోపు వయసున్న 1,69,400 మంది చిన్నారుల మరణాలకు వాయు కాలుష్యం కారణమైందని ఖర్గే ప్రస్తావించారు. పీఎం2.5 కాలుష్యానికి గురికావడం వల్ల పిల్లల్లో ఊపిరితిత్తుల ఎదుగుదల దెబ్బతినడంతో పాటు మరణాల ముప్పు పెరుగుతుందని పరిశోధనలు సూచిస్తున్నాయని అన్నారు.

కాలుష్య నివారణ నిధులు ఖర్చు చేయలేదా?

కాలుష్య నియంత్రణ కోసం కేటాయించిన నిధుల వినియోగంపైనా ఖర్గే ప్రశ్నలు సంధించారు. 2026 సెప్టెంబర్‌లో సమాచార హక్కు చట్టం కింద లభించిన వివరాల ప్రకారం.. దిల్లీలో పర్యావరణ పరిహార నిధుల నుంచి వసూలైన మొత్తంలో దాదాపు 60 శాతానికి సమానమైన రూ.1,154 కోట్లు ఖర్చు చేయకుండా మిగిలిపోయాయని ఆరోపించారు. జాతీయ స్వచ్ఛ వాయు కార్యక్రమం కింద 2025 డిసెంబర్ వరకు విడుదలైన నిధుల్లో దిల్లీ ప్రభుత్వం కేవలం 17 శాతం మాత్రమే వినియోగించుకుందని పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణకు నిధులు ఉన్నప్పటికీ వాటిని సక్రమంగా ఖర్చు చేయకపోవడం వల్లే సమస్య తీవ్రంగా కొనసాగుతోందని విమర్శించారు.

సుప్రీంకోర్టు ఆదేశాలపై ప్రస్తావన

దిల్లీలో కాలుష్య పరిస్థితులపై సుప్రీంకోర్టు కూడా ఆందోళన వ్యక్తం చేసిందని ఖర్గే తెలిపారు. బీజేపీ పాలిత దిల్లీ, హరియాణా, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు కాలుష్య సమస్యను ఎదుర్కొనేందుకు తీసుకోబోయే చర్యలపై రెండు వారాల్లోగా సమగ్ర వివరణ ఇవ్వాలని సుప్రీంకోర్టు ఆదేశించినట్లు పేర్కొన్నారు.

దీపావళి తర్వాత మరింత తీవ్రం

దీపావళి పండుగ అనంతరం దిల్లీలో వాయు కాలుష్యం మరింత పెరిగింది. బాణసంచా కాల్చడం, పంజాబ్, హరియాణా వంటి పొరుగు రాష్ట్రాల్లో పంట వ్యర్థాలను తగులబెట్టడం, వాహనాల పొగ, పరిశ్రమల ఉద్గారాలు, నిర్మాణ పనుల నుంచి వెలువడే ధూళి కాలుష్యానికి ప్రధాన కారణాలుగా ఉన్నాయి. చలికాలంలో ఉష్ణోగ్రతలు తగ్గడం, గాలుల వేగం మందగించడం వల్ల కాలుష్య కారకాలు వాతావరణంలోనే నిలిచిపోతున్నాయి. దీంతో దిల్లీతో పాటు పరిసర ప్రాంతాల్లోనూ పొగమంచు తరహా కాలుష్యం ఏర్పడుతోంది.

శాశ్వత పరిష్కారాలు కావాలి

ప్రతి ఏడాది అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు ఇదే పరిస్థితి పునరావృతమవుతోందని ఖర్గే విమర్శించారు. కాలుష్యం పెరిగినప్పుడు తాత్కాలిక చర్యలు ప్రకటించడం, ఆ తర్వాత ఒకరిపై మరొకరు నిందలు వేసుకోవడం వల్ల సమస్య పరిష్కారం కాదన్నారు. కాలుష్య నియంత్రణ నిధులను పూర్తిస్థాయిలో వినియోగించాలని, వాహనాలు--పరిశ్రమల ఉద్గారాలను తగ్గించాలని, నిబంధనలను కఠినంగా అమలు చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. "స్వచ్ఛమైన గాలి ప్రజల ప్రాథమిక హక్కు. అది ప్రభుత్వం ప్రసాదించే ప్రత్యేక సౌకర్యం కాదు" అని ఖర్గే స్పష్టం చేశారు.

ప్రపంచ సంక్షోభాల్లో భారత్ వైపే చూపు

ప్రపంచ దేశాల మధ్య యుద్ధాలు, ఉద్రిక్తతలు నెలకొన్నప్పుడు అందరి దృష్టి భారత్‌పైనే ఉంటోందని బీజేపీ పేర్కొంది. ప్రధాని నరేంద్ర మోదీకి ప్రపంచ నేతల్లో విస్తృత ఆదరణ ఉందని తెలిపింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు వొలోదిమిర్ జెలెన్‌స్కీతో మోదీ ఫోన్‌లో మాట్లాడిన నేపథ్యంలో ఈ వ్యాఖ్యలు చేసింది. బీజేపీ ఎంపీ ప్రవీణ్ ఖండేల్వాల్ మాట్లాడుతూ.. గత 12 ఏళ్లలో భారత ప్రతిష్ఠను మోదీ పెంచారని అన్నారు. ప్రపంచంలో ఏ సంక్షోభం తలెత్తినా, రెండు దేశాల మధ్య యుద్ధ పరిస్థితులు ఏర్పడినా అంతర్జాతీయ సమాజం భారత్ వైపు చూస్తోందని చెప్పారు. జెలెన్‌స్కీతో తాజా సంభాషణ దీనికి నిదర్శనమని పేర్కొన్నారు. అయితే ఈ అంశంపై కాంగ్రెస్ ఎంపీ ఇమ్రాన్ మసూద్ భిన్నంగా స్పందించారు. అంతర్జాతీయ రాజకీయాల్లో భారత్ ఉన్న స్థానం దృష్ట్యా ఇలాంటి అంశాలపై చాలా జాగ్రత్తగా మాట్లాడాలని సూచించారు. జెలెన్‌స్కీతో సోమవారం ఫోన్‌లో మాట్లాడిన వివరాలను మోదీ 'ఎక్స్' వేదికగా వెల్లడించారు. భారత్-ఉక్రెయిన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత బలోపేతం చేసుకోవాలని ఇరువురు నేతలు నిర్ణయించినట్లు తెలిపారు. ఉక్రెయిన్‌లో కొనసాగుతున్న యుద్ధం, మానవతా సమస్యలు, శాంతి ప్రయత్నాలపై చర్చించినట్లు పేర్కొన్నారు. యుద్ధానికి శాంతియుత పరిష్కారం లభించేలా భారత్ అన్ని విధాలా సహకరిస్తుందని స్పష్టం చేశారు. మరోవైపు, అబుదాబిలో జరగనున్న శాంతి చర్చలకు ముందు తాజా పరిణామాలను మోదీకి వివరించినట్లు జెలెన్‌స్కీ తెలిపారు. చర్చల కోసం ఉక్రెయిన్ సిద్ధమవుతోందని చెప్పారు. ఉద్రిక్తతలు తగ్గించేందుకు రష్యా కూడా ముందుకు రావాలని కోరారు. యుద్ధాన్ని కొనసాగించడం కంటే ముగించడమే ముఖ్యమని మోదీ గతంలో రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు చెప్పారని గుర్తుచేశారు.

బ్రిటీష్ కాలం నాటి మానవ అవశేషాలను భారత్‌కు అప్పగించిన ఆక్స్‌ఫర్డ్ మ్యూజియం!

బ్రిటిష్ వలస పాలన సమయంలో భారత్ నుంచి తీసుకెళ్లిన 39 మంది నాగా ప్రజల మానవ అవశేషాలను ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన పిట్ రివర్స్ మ్యూజియం సోమవారం వారి వారసులకు అప్పగించింది. ఈ కార్యక్రమంలో పాల్గొనేందుకు ఈశాన్య భారతంలోని నాగాలాండ్ నుంచి 30 మంది బ్రిటన్‌కు వెళ్లారు. ఈ అప్పగింత చారిత్రక ఘట్టమని మ్యూజియం డైరెక్టర్ లారా వాన్ బ్రోఖోవెన్ పేర్కొన్నారు. ప్రధానంగా పుర్రెలతో కూడిన ఈ అవశేషాలను నాగాల సంప్రదాయాల ప్రకారం అంత్యక్రియలు నిర్వహించి, ఒకే స్మారక స్థలం వద్ద సమాధి చేయాలని గిరిజన నాయకులు నిర్ణయించారు. 19వ శతాబ్దంలో స్థాపించిన పిట్ రివర్స్ మ్యూజియంలో ప్రపంచంలోనే అతిపెద్ద నాగాల సంస్కృతికి సంబంధించిన వస్తు సేకరణ ఉంది. ఇందులో 6 వేలకు పైగా వస్తువులు ఉన్నాయి. 1910 నుంచి 1940 మధ్య కాలంలో నాగాలాండ్ నుంచి మానవ అవశేషాలను ఆక్స్‌ఫర్డ్‌కు తీసుకెళ్లారు. మానవ శాస్త్రవేత్తలుగా పనిచేసిన ఇద్దరు బ్రిటిష్ వలస పాలనాధికారులు వీటిలో ఎక్కువ భాగాన్ని సేకరించారు. అప్పట్లో కొన్ని వస్తువులను ప్రజల అంగీకారంతో కాకుండా, సైనిక దండయాత్రల సమయంలో బలవంతంగా స్వాధీనం చేసుకున్నట్లు మ్యూజియం వెబ్‌సైట్ పేర్కొంటోంది. ఈ అవశేషాల అప్పగింత ప్రక్రియ ఆరేళ్లపాటు కొనసాగిందని మ్యూజియం డైరెక్టర్ తెలిపారు. ఈ విషయంలో ఎన్నో అధికారిక అడ్డంకులను అధిగమించాల్సి వచ్చిందన్నారు. నాగాల ప్రతినిధులు గతేడాది కూడా బ్రిటన్‌ను సందర్శించి ఈ ప్రక్రియలో పాల్గొన్నారు. అవశేషాల అప్పగింతపై ఇరు పక్షాలు అధికారిక ఒప్పందంపై సంతకాలు చేశాయి. నాగాల నాయకుడు తెజావో విహిన్యునో మాట్లాడుతూ.. తమ పూర్వీకుల అవశేషాలను గౌరవప్రదంగా అంత్యక్రియలు నిర్వహించి సమాధి చేస్తామని చెప్పారు. తమ భూమి నుంచి ఈ అవశేషాలను ఏ పరిస్థితుల్లో తీసుకెళ్లారో చెప్పడం కష్టమని, ఒక వ్యక్తి తన తండ్రి లేదా తాత పుర్రెను మరొకరికి బహుమతిగా ఇచ్చే అవకాశం లేదని వ్యాఖ్యానించారు. నాగాలు గతంలో శత్రువుల తలలను యుద్ధ విజయానికి గుర్తుగా తీసుకునే ఆచారం పాటించేవారు. గ్రామాల మధ్యలో తమ నాయకుల తలలను కూడా భద్రపరిచేవారని నాగాలాండ్‌కు చెందిన మానవ శాస్త్రవేత్త డాలీ కికోన్ తెలిపారు. తిరిగి అప్పగించిన అవశేషాల్లో ఒకటి గిరిజన నాయకుడిదని ఆమె వెల్లడించారు. పాశ్చాత్య దేశాల్లోని మ్యూజియంలు వలస పాలన కాలంలో ఇతర దేశాల నుంచి సేకరించిన వస్తువులు, ముఖ్యంగా మానవ అవశేషాల విషయంలో తమ విధానాలను పునఃపరిశీలిస్తున్నాయి. ఈ క్రమంలో కొన్ని సంస్థలు వాటిని మూల సమాజాలకు తిరిగి అప్పగిస్తున్నాయి. పిట్ రివర్స్ మ్యూజియం 2020లో మానవ అవశేషాలను ప్రదర్శన నుంచి తొలగించింది. అయినప్పటికీ మరో 2,700 అవశేషాలు ఇంకా నిల్వ ఉన్నాయని డైరెక్టర్ తెలిపారు. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, అమెరికాలోని ఆదివాసీ సమాజాలకు కూడా ఈ మ్యూజియం గతంలో మానవ అవశేషాలను తిరిగి అప్పగించింది.

సముద్ర గర్భంలోకి భారత్ సాహసయాత్ర

సముద్రం ఒడ్డున నిలబడి చూస్తే కనిపించేది అలల హోరు మాత్రమే. కానీ ఆ నీలి నీటి పొరల కింద వేల మీటర్ల లోతులో ఓ అద్భుత ప్రపంచం దాగి ఉంది. అక్కడ వెలుతురు ఉండదు.. మనిషి ఊహించలేనంత ఒత్తిడి ఉంటుంది. అయినా ఆ చీకటి అగాధంలోనూ జీవులు మనుగడ సాగిస్తున్నాయి. అలాంటి అంతుచిక్కని సముద్ర గర్భంలోకి మనుషులను పంపేందుకు భారత్ ఓ సాహసోపేత ప్రయోగానికి సిద్ధమవుతోంది. అదే 'మత్స్య-6000'.

ముగ్గురికి సురక్షిత ప్రయాణం

చెన్నైలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐఓటీ) ఈ జలాంతర్గామిని అభివృద్ధి చేస్తోంది. కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో సాగుతున్న సముద్రయాన్ ప్రాజెక్టులో ఇది కీలక భాగం. 6,000 మీటర్ల లోతు వరకు ముగ్గురు వ్యక్తులను తీసుకెళ్లేలా దీన్ని రూపొందిస్తున్నారు. ప్రయాణికుల కోసం 2.26 మీటర్ల వ్యాసంతో, 80 మిల్లీమీటర్ల మందంతో టైటానియం మిశ్రమ లోహంతో గోళాకార గదిని తయారు చేస్తున్నారు. సముద్ర గర్భంలో దాదాపు 600 బార్‌ల ఒత్తిడిని తట్టుకునేలా దీన్ని నిర్మిస్తున్నారు. ఈ కీలక గది అభివృద్ధిలో ఇస్రో కూడా భాగస్వామిగా ఉంది.

ప్రాణరక్షణకు పటిష్ఠ ఏర్పాట్లు

లోతైన సముద్రంలో ప్రయాణం అంటే కేవలం జలాంతర్గామిని కిందికి పంపడం మాత్రమే కాదు. లోపల ఉన్నవారికి నిరంతరం ఆక్సిజన్ అందించడం, బయట పరిస్థితులతో సమాచార సంబంధాలు కొనసాగించడం, దిశను గుర్తించడం, విద్యుత్ సరఫరా చేయడం వంటి అంశాలు అత్యంత కీలకం. అందుకే మత్స్య-6000లో జీవనాధార వ్యవస్థలు, నీటి అడుగున సమాచార వ్యవస్థ, నావిగేషన్, బ్యాటరీలు, అత్యవసర పరిస్థితుల్లో బయటపడే సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు. సాధారణంగా 12 గంటలపాటు పనిచేసేలా దీన్ని రూపొందించగా.. అత్యవసర పరిస్థితుల్లో 96 గంటల వరకు ప్రాణాలను కాపాడేలా ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. తమిళనాడులోని కట్టుపల్లి వద్ద నవంబర్ 6న మానవ రహిత పరీక్షలు నిర్వహించారు. 2028 నాటికి తొలి మానవ సహిత లోతైన సముద్ర యాత్ర చేపట్టాలన్నది భారత్ లక్ష్యం.

అగాధంలో దాగిన సంపద.. జీవ వైవిధ్యం

మత్స్య-6000 ప్రయాణం శాస్త్రవేత్తలకు సముద్ర గర్భాన్ని దగ్గరగా అధ్యయనం చేసే అవకాశం కల్పించనుంది. అక్కడ సూర్యరశ్మి లేకపోయినా కాంతిని వెలువరించే జీవులు ఉన్నాయి. సముద్రం అడుగున వేడి నీటిని విడుదల చేసే హైడ్రోథర్మల్ వెంట్ల సమీపంలో సూక్ష్మజీవులు నివసిస్తాయి. ఇవి సూర్యరశ్మిపై కాకుండా రసాయన చర్యల ద్వారా లభించే శక్తితో జీవిస్తాయి. మరోవైపు సముద్రపు అడుగున మాంగనీస్, నికెల్, కోబాల్ట్, రాగి వంటి విలువైన ఖనిజాలు ఉన్నాయి. బ్యాటరీలు, ఎలక్ట్రానిక్స్, ఉక్కు, స్వచ్ఛ ఇంధన రంగాల్లో వీటిని ఉపయోగిస్తారు. ఈ ప్రాంతాల్లో జీవుల మనుగడ, ఖనిజ నిక్షేపాల స్వభావం తెలుసుకోవడం భవిష్యత్తు పరిశోధనలకు కీలకం కానుంది. మంచుతో కప్పబడిన యూరోపా వంటి గ్రహాల ఉపగ్రహాల్లో జీవం ఉండే అవకాశాలపై అధ్యయనాలకూ ఈ పరిశోధనలు ఉపయోగపడవచ్చు.

అంతర్జాతీయ రేసులో భారత్

లోతైన సముద్ర పరిశోధనల్లో ఇప్పటికే అమెరికా, చైనా, రష్యా, ఫ్రాన్స్, జపాన్ వంటి దేశాలు ముందున్నాయి. అమెరికాకు 'ఆల్విన్', చైనాకు 'ఫెండౌజే', ఫ్రాన్స్‌కు 'నాటిల్' వంటి జలాంతర్గాములు ఉన్నాయి. చైనా జలాంతర్గామి 10 వేల మీటర్లకు మించిన లోతుకు వెళ్లగలదు. ఫ్రాన్స్ నాటిల్ 6 వేల మీటర్ల లోతు వరకు ప్రయాణించగలదు. భారత శాస్త్రవేత్తలు 2025 ఆగస్టులో అట్లాంటిక్ మహాసముద్రంలో ఫ్రాన్స్ నాటిల్ ద్వారా 5 వేల మీటర్ల లోతు వరకు వెళ్లి పరిశోధనల్లో పాల్గొన్నారు. మరోవైపు మధ్య హిందూ మహాసముద్ర ప్రాంతంలో ఖనిజ నిక్షేపాల అన్వేషణ కూడా కొనసాగుతోంది. సముద్ర అడుగున ఖనిజాలను సేకరించే వ్యవస్థ కదలికలు, విద్యుత్ సామర్థ్యాలను 2021లో 5,270 మీటర్ల లోతులో పరీక్షించారు.

మోదీతో పెద్దగా పరిచయం లేదు.. ఎదురుపడినా కళ్లలోకి చూడరు

న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీతో తనకు వ్యక్తిగతంగా పెద్దగా పరిచయం లేదని కాంగ్రెస్ మాజీ అధ్యక్షురాలు సోనియా గాంధీ వెల్లడించారు. అధికారిక కార్యక్రమాల్లో ఎదురుపడినప్పుడు పరస్పరం మర్యాదపూర్వకంగా నమస్కరించుకోవడం మినహా పెద్దగా సంభాషణ ఉండదని తెలిపారు. కొన్నిసార్లు మోదీ ఎదురుపడినప్పుడు నమస్కారం చేసినా తన కళ్లలోకి చూడకుండా పక్కకు చూస్తారని పేర్కొన్నారు. 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' పేరుతో హార్పర్‌కాలిన్స్ ఇండియా ప్రచురించిన తన పుస్తకంలో ఈ విషయాలను ప్రస్తావించారు. మంగళవారం మార్కెట్‌లోకి వచ్చిన ఈ పుస్తకంలో మోదీతో తన పరిచయం, దేశంపై ఇద్దరి దృక్పథాలు, రాజీవ్ గాంధీ హత్యకు సంబంధించిన వ్యక్తిగత జ్ఞాపకాలను వివరించారు.

మోదీతో మర్యాదపూర్వక పలకరింపులే!

పార్లమెంట్ సమావేశాలు ముగిసిన తర్వాత స్పీకర్ ఛాంబర్‌లో వివిధ పార్టీల నేతలు కలుసుకోవడం ఆనవాయితీగా ఉంటుందని సోనియా గుర్తుచేశారు. అలాంటి సందర్భాల్లో మోదీ ఎదురుపడితే ఇద్దరం మర్యాదపూర్వకంగా నమస్కరించుకుంటామని తెలిపారు. గతంలో భిన్న రాజకీయ పార్టీలకు చెందిన నేతల మధ్య కూడా స్నేహపూర్వక సంబంధాలు ఉండేవని, ప్రస్తుతం అలాంటి వాతావరణం కనిపించడం లేదని అభిప్రాయపడ్డారు. తాను ఆసుపత్రిలో చికిత్స పొందిన తర్వాత తిరిగి వచ్చిన సందర్భాల్లో మోదీ ఆరోగ్యం గురించి అడిగేవారని, తాను బాగున్నానని సమాధానం చెప్పేదాన్నని పేర్కొన్నారు. పుట్టినరోజు, నూతన సంవత్సర శుభాకాంక్షలు పరస్పరం తెలియజేసుకున్న సందర్భాలు ఉన్నాయని, అయితే అంతకుమించి తమ మధ్య సంభాషణ జరగలేదని వివరించారు.

భారత్‌పై ఇద్దరి దృక్పథాలు వేర్వేరు

తన రాజకీయ ప్రయాణం, మోదీ రాజకీయ ప్రయాణం పూర్తిగా భిన్నమైన మార్గాల్లో సాగాయని సోనియా పేర్కొన్నారు. తన దృష్టిలో భారత్ అంటే అనేక జాతులు, భాషలు, సంస్కృతులు, మతాలకు చెందిన ప్రజలు కలిసిమెలిసి జీవించే సమాజమని వివరించారు. స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం వంటి విలువలే తన ఆలోచనలకు పునాదులని తెలిపారు. మోదీ దేశంపై కలిగిన దృక్పథం మాత్రం ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలు, ఆయన వ్యక్తిగత అనుభవాల ప్రభావంతో రూపుదిద్దుకుందని అభిప్రాయపడ్డారు. అందులో ఒక మతం, సంస్కృతికి అధిక ప్రాధాన్యం ఇచ్చే భావజాలం కనిపిస్తుందని విమర్శించారు. భారతదేశం సమ్మిళితత్వం, లౌకికవాదం, సామాజిక న్యాయానికి ప్రతీకగా ఉండాలని తన అభిప్రాయాన్ని పుస్తకంలో వెల్లడించారు.

పార్లమెంట్‌లో మోదీ భాషపై విమర్శలు

పార్లమెంట్‌లో ప్రసంగించే సమయంలోనూ ప్రధాని మోదీ కొన్నిసార్లు బహిరంగ సభల్లో ఉపయోగించే కఠినమైన భాషనే వినియోగిస్తున్నారని సోనియా విమర్శించారు. ప్రతిపక్షాలపై తీవ్ర వ్యాఖ్యలు చేయడంతో పాటు, తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై బీజేపీ వైఖరిని కూడా ప్రస్తావించారు. 'కాంగ్రెస్ రహిత భారత్' అనే బీజేపీ నినాదం వెనుక కాంగ్రెస్ పార్టీ విధానాలు, సిద్ధాంతాలపై వ్యతిరేకత ఉందని పేర్కొన్నారు. ఈ వైఖరికి ఆర్ఎస్ఎస్ భావజాలమే కారణమని తాను భావిస్తున్నట్లు రాశారు. హిందూ సంప్రదాయంలో భిన్నమైన విశ్వాసాలు, ఆచారాలు, ఆలోచనలకు స్థానం ఉందని, మాజీ ప్రధాని ఇందిరా గాంధీ నుంచి అలాంటి విశాల దృక్పథాన్ని నేర్చుకున్నానని వివరించారు.



రాజీవ్ భద్రతపై రాహుల్ ముందే ఆందోళన

1991 మే 21న తమిళనాడులోని శ్రీపెరంబుదూర్‌లో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ హత్యకు గురైన ఘటనను సోనియా తన పుస్తకంలో గుర్తుచేసుకున్నారు. రాజీవ్ గాంధీతో కలిసి పర్యటనలో ఉన్న సమయంలో ఆయన భద్రతపై రాహుల్ ఆందోళన వ్యక్తం చేశారని తెలిపారు. భద్రతా ఏర్పాట్లలో మార్పులు చేయకపోతే తండ్రి అంత్యక్రియల కోసం తిరిగి రావాల్సి వస్తుందని రాహుల్ చెప్పినట్లు సోనియా రాశారు. ఆ మాటలు జరిగిన రెండు నెలలకే రాజీవ్ హత్యకు గురవడం తమ కుటుంబాన్ని తీవ్ర విషాదంలో ముంచిందని పేర్కొన్నారు. రాజీవ్ మరణవార్తను ఓ స్నేహితుడు రాహుల్‌కు ఫోన్‌లో తెలియజేసినట్లు గుర్తుచేసుకున్నారు. 'చెడు వార్త ఉంది' అని చెప్పగానే.. 'నాన్న చనిపోయారు కదా?' అని రాహుల్ వెంటనే అడిగినట్లు వివరించారు. అనంతరం దిల్లీకి చేరుకున్న రాహుల్.. తండ్రి పార్థివదేహం వద్ద కదలకుండా నిలబడిపోయారని భావోద్వేగంగా రాశారు.

ఎస్పీజీ భద్రత తొలగింపుపై ప్రశ్నలు

రాజీవ్ గాంధీ హత్యకు ఏడాదికి పైగా ముందు ఆయనకు కల్పించిన ప్రత్యేక రక్షణ దళం (ఎస్పీజీ) భద్రతను అప్పటి వీపీ సింగ్ ప్రభుత్వం ఉపసంహరించిందని సోనియా పుస్తకంలో ప్రస్తావించారు. అంతకుముందు జరిగిన సమావేశంలో కొత్తగా ఏదైనా ముప్పు ఉన్నట్లు గుర్తిస్తే తప్ప ఎస్పీజీ భద్రత కొనసాగించాలని నిర్ణయించినప్పటికీ, అలాంటి సమీక్ష జరగకుండానే మరుసటి నెలలో భద్రతను తొలగించారని ఆరోపించారు. ప్రత్యేక శిక్షణ పొందిన భద్రతా సిబ్బంది స్థానంలో స్థానిక పోలీసుల రక్షణ మాత్రమే మిగిలిందని పేర్కొన్నారు. ఈ నిర్ణయం రాజీవ్ భద్రతపై ఎలాంటి ప్రభావం చూపిందన్న అంశాన్ని పుస్తకంలో ప్రస్తావించినట్లు తెలిపారు.

ప్రియాంక చెప్పిన వార్తతో కుప్పకూలిన సోనియా

1991 మే 21న తనకు సాధారణ రోజుగానే ప్రారంభమైందని సోనియా గుర్తుచేసుకున్నారు. రాజీవ్ ఇంట్లో లేని సమయంలో ఆయన పడుకునే మంచం వైపు చూసి ఓదార్పు పొందేదాన్నని రాశారు. మరోవైపు ప్రియాంక స్నేహితురాలి పుట్టినరోజు వేడుకకు వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు. రాహుల్ అప్పట్లో అమెరికాలోని కళాశాలలో చదువుకుంటున్నారు. ఇంతలో ప్రియాంక వేగంగా తన గదిలోకి వచ్చారని, ఆమె ముఖం పాలిపోయి, శ్వాస వేగంగా ఉందని సోనియా వివరించారు. బాంబు పేలుడు జరిగిందని, పలువురు చనిపోయారని, వెంటనే మద్రాసుకు వెళ్లేందుకు సిద్ధం కావాలని ప్రియాంక చెప్పినట్లు గుర్తుచేసుకున్నారు. మొదట ఆమె మాటలు తనకు అర్థం కాలేదని, కానీ ప్రియాంక గొంతులోని భయం పరిస్థితి తీవ్రతను తెలియజేసిందని పేర్కొన్నారు. రాజీవ్ గాంధీకి ఏమైందో తెలుసుకునేందుకు పార్టీ నాయకులు, సన్నిహితులకు ఫోన్లు చేసినట్లు తెలిపారు. చివరకు జార్జ్‌తో మాట్లాడినప్పుడు రాజీవ్ ఇక లేరనే చేదు నిజం తెలిసిందని రాశారు. ఆ వార్త విన్న వెంటనే ప్రియాంకను పట్టుకుని విలపించానని, 'నేను ఆయనతో వెళ్లాల్సింది.. ఎందుకు వెళ్లలేదు?' అని పదేపదే అన్నానని గుర్తుచేసుకున్నారు. ఆ సమయంలో తన ప్రపంచమంతా చీకటిగా మారిపోయినట్లు అనిపించిందని భావోద్వేగంగా వివరించారు.

ప్రియాంకే కుటుంబానికి ధైర్యం

రాజీవ్ మరణవార్త తెలిసిన తర్వాత ఇంట్లోని సిబ్బంది కన్నీరుమున్నీరుగా విలపించారని సోనియా పేర్కొన్నారు. తాను తీవ్ర దిగ్భ్రాంతితో నిలబడలేని పరిస్థితిలో ఉన్నప్పుడు ప్రియాంక తనను పట్టుకుని గదిలోకి తీసుకెళ్లి కూర్చోబెట్టారని చెప్పారు. తాను బాధలో కుంగిపోయినప్పటికీ ప్రియాంక మాత్రం ధైర్యంగా వ్యవహరించారని, తన ముందు ఒక్కసారి కూడా కన్నీరు పెట్టుకోలేదని రాశారు. రాజీవ్ పార్థివదేహాన్ని తీసుకొచ్చే విమానంలో తాము కూడా వెళ్లేందుకు అనుమతించాలని ఆమె పట్టుబట్టారని, అవసరమైతే సొంత ఏర్పాట్లు చేసుకుంటామని స్పష్టం చేశారని గుర్తుచేసుకున్నారు.

నేత్రదానం చేయాలన్న రాజీవ్ కోరిక

రాజీవ్ పార్థివదేహాన్ని దిల్లీలోని ఎయిమ్స్‌కు తీసుకొచ్చిన తర్వాత ఆయనను చూడాలనే బలమైన కోరిక కలిగిందని సోనియా తెలిపారు. ఆ సమయంలో రాజీవ్ తన కళ్లను దానం చేయాలని నిర్ణయించుకున్న విషయం గుర్తొచ్చిందన్నారు. ఈ విషయాన్ని కుటుంబ వైద్యుడికి తెలియజేయాలని ప్రయత్నించగా, పేలుడు తీవ్రత కారణంగా ఆయన కళ్లను కాపాడటం సాధ్యం కాలేదని వైద్యుడు చెప్పినట్లు పేర్కొన్నారు. ఆ సమాధానం తనను మరింత కుంగదీసిందని పుస్తకంలో భావోద్వేగంగా వివరించారు.

ఏ హోదాలో ఉన్నా గతాన్ని మర్చిపోవద్దు..

-మొదటిపేజీ తరువాయి

కార్యక్రమానికి సీఎం ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డీజీపీ సీవీ ఆనంద్, హోంశాఖ ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, భద్రతా సలహాదారు శివధర్‌రెడ్డి, తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ అభిలాష బిస్త్‌తో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

పది మంది తప్పు చేసినా ప్రభుత్వానికే చెడ్డపేరు

పోలీసు అధికారుల ప్రవర్తన ప్రభుత్వ ప్రతిష్ఠపై నేరుగా ప్రభావం చూపుతుందని రేవంత్‌రెడ్డి అన్నారు. పది మంది డీఎస్పీలు అరాచకంగా వ్యవహరించినా రాష్ట్రంలో సరైన పరిపాలన లేదనే విమర్శలు వస్తాయని పేర్కొన్నారు. శాంతిభద్రతలు క్షీణించాయని, అవినీతి పెరిగిందనే ఆరోపణలకూ అవకాశం ఉంటుందని తెలిపారు. “మీరు తీసుకునే నిర్ణయాలే ఈ ప్రభుత్వానికి గీటురాయిగా మారుతాయి. పోలీసులు సక్రమంగా విధులు నిర్వర్తిస్తే ప్రభుత్వ ప్రతిష్ఠ మరింత పెరుగుతుంది” అని సీఎం పేర్కొన్నారు. పోలీసు శాఖను ప్రజల విశ్వాసం పొందిన విభాగంగా కొనసాగించాల్సిన బాధ్యత యువ అధికారులపై ఉందని సూచించారు.

బాధితులను కూర్చోబెట్టి సమస్యలు వినండి

పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులను గౌరవంగా కూర్చోబెట్టి, ఓపికగా వారి సమస్యలు వినాలని సీఎం సూచించారు. బాధితులతో సానుకూలంగా మాట్లాడితే సగం సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం లభిస్తుందని అన్నారు. ఎన్నో అవాంతరాలు, సంక్లిష్ట పరిస్థితులను అధిగమించి ఉద్యోగాలు సాధించిన యువ అధికారులు తమ నేపథ్యాన్ని మరిచిపోకుండా ప్రజలకు సేవ చేయాలని దిశానిర్దేశం చేశారు. 112 మంది డీఎస్పీల నియామక ప్రక్రియను తమ ప్రభుత్వం పారదర్శకంగా చేపట్టిందని తెలిపారు. నియామకాలపై కొందరు తప్పుడు ఆరోపణలు చేసినప్పటికీ, అభ్యర్థులకు న్యాయం జరిగేలా సుప్రీంకోర్టు వరకు న్యాయపోరాటం చేశామని గుర్తుచేశారు.

సైబర్ నేరాలు, డ్రగ్స్‌పై ప్రత్యేక దృష్టి

ప్రస్తుత పరిస్థితుల్లో సైబర్ నేరాలు పోలీసులకు అతిపెద్ద సవాల్‌గా మారాయని సీఎం అన్నారు. సైబర్ నేరాలతో పాటు డ్రగ్స్ అక్రమ రవాణా, ఆహార కల్తీ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. సైబర్ నేరాలు, ఫోరెన్సిక్ విభాగాల్లో ఆసక్తి ఉన్న డీఎస్పీలను విదేశాలకు పంపించి ప్రత్యేక శిక్షణ ఇప్పిస్తామని ప్రకటించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన పెంచుకుని నేరాల నియంత్రణలో ముందుండాలని సూచించారు.

ఫిట్‌నెస్‌పై రాజీ పడొద్దు

పోలీసు అధికారులు శారీరక దృఢత్వానికి ప్రాధాన్యం



ఇవ్వాలని రేవంత్‌రెడ్డి సూచించారు. విధుల నిర్వహణలో ఫిట్‌నెస్ ఎంతో ముఖ్యమని చెప్పారు. ఈ సందర్భంగా సరదాగా స్పందిస్తూ.. “బెల్ట్ లూజ్ అయినా పర్వాలేదు.. కానీ టైట్ కాకూడదు” అని వ్యాఖ్యానించారు. యువ అధికారులు ఆరోగ్యాన్ని కాపాడుకుంటూ విధుల్లో చురుగ్గా ఉండాలని సూచించారు.

పీఎస్సీ ప్రక్షాళనతో నియామకాల్లో మార్పులు

గతంలో గ్రూప్-1 నియామక ప్రక్రియ తీవ్ర జాప్యానికి గురైందని సీఎం రేవంత్‌రెడ్డి విమర్శించారు. అప్పటి ప్రభుత్వ నిర్ణయాలు, నిర్లక్ష్యం వల్ల ఎంతోమంది నిరుద్యోగులకు నష్టం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు. తాను ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ప్రక్షాళన చేసి నియామక ప్రక్రియను ముందుకు తీసుకెళ్లినట్లు వివరించారు. గతంలో పబ్లిక్ సర్వీస్ కమిషన్ రాజకీయ పునరావాస కేంద్రంగా మారిందని ఆరోపించారు. తగిన అవగాహన, అనుభవం లేని వ్యక్తులను బోర్డులో నియమించడం వల్ల నియామకాల ప్రక్రియలో సమస్యలు తలెత్తాయని విమర్శించారు. యూపీఎస్సీ తరహాలో తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో అనుభవం, చిత్తశుద్ధి ఉన్నవారిని నియమించినట్లు తెలిపారు.

563 గ్రూప్-1 పోస్టులకు 562 మంది ఎంపిక

563 గ్రూప్-1 పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేయగా, 562 మంది ఉద్యోగాల్లో చేరినట్లు సీఎం తెలిపారు. ఇంత పెద్ద సంఖ్యలో గ్రూప్-1 పోస్టులను గతంలో ఎప్పుడూ భర్తీ చేయలేదని పేర్కొన్నారు. ప్రభుత్వ పారదర్శక నిర్ణయాల వల్లే యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయని చెప్పారు. 2011 నుంచి 2025 వరకు గ్రూప్-1 నియామకాల ప్రక్రియలో జాప్యం, నోటిఫికేషన్లు, ప్రవేశ పరీక్షల విషయంలో గందరగోళం నెలకొందని గుర్తుచేశారు. కొంతమంది నియామకాలపై ఉద్దేశపూర్వకంగా ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఈ వ్యవహారంలో సుప్రీంకోర్టు వరకు వెళ్లి న్యాయపోరాటం చేసిన తర్వాతే ఉద్యోగ నియామకాలు పూర్తయ్యాయని వివరించారు.

పోలీసుల గౌరవాన్ని కాపాడాలి

ప్రభుత్వం అధికారుల నుంచి కోట్ల రూపాయలు ఆశించడం లేదని, ఎన్నికల్లో రిగ్గింగ్ చేయాలని ఆదేశించడం లేదని సీఎం పేర్కొన్నారు. అధికారులు తమ బాధ్యతను గుర్తించి నిజాయితీగా విధులు నిర్వర్తించాలని మాత్రమే కోరుకుంటోం దన్నారు. సీనియర్ పోలీసు అధికారులు తమ ప్రాణాలను సైతం పణంగా పెట్టి శాంతిభద్రతలను కాపాడుతూ పోలీసు శాఖ గౌరవాన్ని పెంచారని కొనియాడారు. అదే నిబద్ధతతో యువ డీఎస్పీలు పనిచేసి ప్రజల్లో పోలీసులపై నమ్మకాన్ని మరింత పెంచాలని సూచించారు.

రాబోయే 30 ఏళ్లు పోలీసులకు కీలకం: డీజీపీ

గత 30 ఏళ్లతో పోలిస్తే రాబోయే 30 ఏళ్లు పోలీసు శాఖకు ఎంతో కీలకమని డీజీపీ సీవీ ఆనంద్ అన్నారు. సైబర్ మోసాలు, ఆహార కల్తీ వంటి కొత్త తరహా నేరాలు, సమస్యలను యువ అధికారులు సమర్థంగా ఎదుర్కోవాలని సూచించారు. నూతన డీఎస్పీలకు ప్రభుత్వం, పోలీసు శాఖ పూర్తి సహకారం అందిస్తాయని భరోసా ఇచ్చారు.

త్వరలో ఇందిరమ్మ ఎంఐజీ టవర్స్!



-మొదటిపేజీ తరువాయి

మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కల నెరవేర్చేందుకు ఎంఐజీ గృహాలను నిర్మించి, సులభతర వాయిదాలలో అందజేయడమే లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ఇందిరమ్మ ఎంఐజీ టవర్ల నిర్మాణానికి కొన్ని ప్రాంతాల్లో అనువైన స్థలాలను ప్రాథమికంగా గుర్తించి రిజర్వ్ చేసింది. మరికొన్నింటి ప్రాంతాల్లో స్థలాలకోసం అన్వేషిస్తోంది. మొత్తంమీద రవాణా సౌకర్యాలు మెరుగ్గా ఉండి, వివాద రహితంగా ఉన్న ప్రభుత్వ భూములకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. భవిష్యత్తు సవాళ్లను అధిగమించేందుకు ప్రాజెక్ట్ ప్రారంభానికి ముందే విద్యుత్ సరఫరా, తాగునీటి లైన్లు,డ్రైనేజీ వ్యవస్థలను ఏర్పాటు చేసేలా ముందస్తు చర్యలు ఉపక్రమించాలని యోచిస్తోంది.

ఎల్ఐజీ ముగియగానే ఎంఐజీ..

క్యూర్ పరిధిలో మొదటి విడత ఎల్ఐజీ ఇళ్ల ప్రక్రియ పూర్తి కాగానే ప్రభుత్వం నుంచి ఎంఐజీ ఇళ్లకు గ్రీన్ సిగ్నల్ లభించనుంది. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో ఇళ్ల కేటాయింపు ప్రక్రియ పూర్తి కాగా, మరో నాలుగు నియోజకవర్గాల్లో ప్రాథమికంగా ఇళ్ల కేటాయింపుపై క్షేత్ర స్థాయి పరిశీలన కొనసాగుతోంది. త్వరలో మిగిలిన ఉప్పల్, జూబ్లీహిల్స్,చార్?మినార్, సికింద్రాబాద్ నియోజకవర్గాల్లో కూడా నోటిఫికేషన్ జారీ చేసేందుకు హౌసింగ్ బోర్డు సిద్ధమైంది. ఈ ప్రక్రియ పూర్తిగా కొలిక్కి రాగానే ఎంఐజీ తొలివిడత నోటిఫికేషన్ విడుదల చేసేందుకు తగిన ఏర్పాట్లు చేస్తోంది. ఎల్ఐజీ మాదిరిగానే లబి?ధదారుల ఎంపికలో ఎలాంటి అక్రమాలకు తావులేకుండా పారదర్శకమైన ఆన్‌లైన్ పోర్టల్ ద్వారానే దరఖాస్తులను స్వీకరించనుంది. మధ్యతరగతి వర్గాల నిర్దిష్ట వార్షిక ఆదాయాన్ని ప్రామాణికంగా తీసుకుని అర్హులను ఎంపిక చేయనుంది. దరఖాస్తు రుసుము, కేటాయింపు విధానం, వాయిదాల చెల్లింపుల షెడ్యూల్‌ను నోటిఫికేషరీన్ లోనే స్పష్టంగా పొందుపరచనున్నారు.

30 వేల ఎంఐజీ ఇళ్లు

నగరానికి నాలుగు వైపులా నూతన ఎంఐజీ టవరర్లో సుమారు 30 వేల ఇళ్ల నిర్మాణాలకు ప్రణాళిక పొందించింది.ఒక్కో టవర్‌లో ఆధునిక హంగులతో ఫ్లాట్లను నిర్మించేలా డిజైన్ చేస్తోంది. మధ్యతరగతి కుటుంబాలపై ఒక్కసారిగా ఆర్థిక భారం పడకుండా సింగిల్ విండో విధానం ద్వారా లబ్ధిదారులకు సులభంగా రుణ వసతి కల్పించేందుకు వివిధ బ్యాంకులతో ప్రభుత్వం ముందస్తు చర్చలు జరుపుతోంది. తక్కువ వడ్డీ రేటుకే బ్యాంకుల నుంచి గృహ రుణాలు అందించేలా ఆర్థిక సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. నిర్మాణం పురోగమించే కొద్దీ దశలవారీగా వాయిదాలలో సొమ్ము చెల్లించే వెసులుబాటును లబి?ధదారులకు కల్పించనుంది.

రుణాలపై మారటోరియం

హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల్లో రైతుల రుణాలపై మారటోరియం అమలు కానుంది. కరువు పరిస్థితులను ఎదుర్కోవడంపై నియమించిన మంత్రివర్గ ఉపసంఘం సిఫారసుకు అనుగుణంగా రాష్ట్రంలోని 365 మండలాల్లో రైతు రుణాల వసూళ్లపై తాత్కాలిక నిషేధానికి బ్యాంకర్లు సూత్రప్రాయంగా అంగీకరించారు. మంగళవారం ప్రజాభవన్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్‌ఎల్‌బీసీ) ప్రత్యేక సమావేశంలో ఈ మేరకు తీర్మానించారు. ప్రస్తుతమున్న రుణాలపై మారటోరియం అమలు చేయడంతో పాటు రానున్న రబీ సీజన్‌కు కొత్త రుణాలివ్వాలని ఈ సమావేశంలో ప్రభుత్వం పక్షాన డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క బ్యాంకర్లను కోరారు. ఈ నేపథ్యంలో బ్యాంకర్ల సమావేశం పలు తీర్మానాలను ఆమోదించింది.

ఈ తీర్మానాల మేరకు ఓ మోస్తరు కరువు ప్రకటించిన 254 మండలాల్లో రైతు రుణాలపై 12 నెలల మారటోరియం అమలు కానుంది. ఈ రుణాల చెల్లింపునకు గాను 36 నెలల గడువు ఇవ్వనున్నారు. అదే విధంగా తీవ్ర స్థాయిలో కరువు ఉన్న 111 మండలాల్లో కూడా రుణాల వసూళ్లకు 12 నెలల మారటోరియం వర్తించనుంది. అయితే ఈ మండలాల్లో రుణాల చెల్లింపునకు 60 నెలల గడువు ఇవ్వనున్నారు.

వడ్డీ భారంపై కేంద్రానికి వినతి

రైతులు మారటోరియం కోసం ముందుకొచ్చినా, రాకపోయినా సుమోటోగా బ్యాంకులు ఉపశమన చర్యలు తీసుకోనున్నాయి. రుణాల మారటోరియంకు అర్హులైన రైతుల బ్యాంకు అకౌంట్లను గుర్తించి వారికి మారటోరియం అమలు చేయడంతో పాటు కొత్త రుణాలను కూడా మంజూరు చేయనున్నాయి. అయితే ఈ మారటోరియం కాలానికి గాను రైతు రుణాలకు అయ్యే వడ్డీని రాయితీ కింద సర్దుబాటు చేసేలా కేంద్ర ప్రభుత్వాన్ని కోరాలని రాష్ట్ర ప్రభు త్వం



నిర్ణయించింది. ఇందుకు గాను రాష్ట్రంలో నెలకొన్న కరువు పరిస్థితిని 15 రోజుల్లోగా రిజర్వు బ్యాంకు (సీఐఎంఎస్) పోర్టల్‌లో రాష్ట్ర బ్యాంకర్లు అప్‌లోడ్ చేయాలని సమావేశంలో తీర్మానించారు.

ఎస్‌ఎల్‌బీసీ సమావేశం తీర్మానాలివే..

కరువు ప్రభావానికి గురయ్యే వర్గాలు బ్యాంకుల్లో తీసుకున్న రుణాల విషయంలో తగిన ఉపశమన చర్యలు తీసుకోవాలి. వ్యవసాయం కోసం తీసుకున్న స్వల్ప కాలిక, టర్మ్ రుణాలు, ఆగ్రో ప్రాసెసింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల కోసం తీసుకున్న రుణాలు, ఇతర వ్యవసాయ అనుబంధ రుణాలను ఈ కేటగిరిలో చేర్చారు. ఆర్‌బీఐ నిబంధనలు, ఆయా బ్యాంకుల విధానాల మేరకు ఈ ఉపశమన చర్యలు అమలు చేయాలి.

కరువు ప్రభావానికి గురైన రుణ గ్రహీతలను గుర్తించి వారికి మారటోరియం వర్తింపజేయాలి.

రుణ గ్రహీతతో సంబంధం లేకుండానే అర్హులైన వారి బ్యాంకు అకౌంట్లను గుర్తించి సుమోటో ప్రాతిపదికన చర్యలు తీసుకోవాలి.

కరువు ప్రభావానికి గురైన రుణ గ్రహీతలపై ఆర్థిక భారం తగ్గించడం కోసం అదనపు సాయం కూడా చేయాలి. ఉత్పత్తి సంబంధిత కార్యకలాపాల కొనసాగింపునకు అనుగుణంగా ఈ సాయం ఉండాలి. వ్యవసాయ అనుబంధ రంగాలకు అదనపు ఆర్థిక సాయం కోసం మంత్రివర్గ ఉప సంఘంతో చర్చించాలి.

రుణాల రీస్ట్రక్చర్ చేసిన బ్యాంకు అకౌంట్లకు కూడా రైతు లేదా పంట బీమాలను అమలు చేయాలి. ప్రభుత్వ నిబంధనల మేరకు సకాలంలో చెల్లించేవారికి ప్రోత్సాహకాలు, వడ్డీ రాయితీలను ఇవ్వాలి. వడ్డీ రాయితీ కోసం రాష్ట్ర ప్రభుత్వం కేంద్రాన్ని కోరాలి. బ్యాంకర్లు మానవీయ, సహానుభూతి, వృత్తి పరమైన స్ఫూర్తితో చర్యలు తీసుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకుంటున్న ఉపశమన చర్యలను కొనసాగించాలి.

జిల్లాల లీడ్ బ్యాంక్ మేనేజర్లు వెంటనే జిల్లా స్థాయిలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి ఆ సమావేశాల మినిట్స్‌ను ఎస్‌ఎల్‌బీసీకి పంపాలి. ఉపశమన చర్యలపై ఎస్‌ఎల్‌బీసీతో పాటు బ్యాంకులు తగిన ప్రచారం కలి?పంచాలి. అన్ని ఉపశమన చర్యల అమలు, పురోగతిని సమయానుగుణంగా ఎస్‌ఎల్‌బీసీ పర్యవేక్షించాలి.

అన్ని అంశాల పరిశీలన తర్వాతే ముందడుగు

-మొదటిపేజీ తరువాయి

న్యాయవాది వైద్యనాథన్‌తో పాటు నీటిపారుదల శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కాళేశ్వరం ప్రాజెక్టు అదనపు టీఎంసీ పనులు, న్యాయపరమైన అంశాలు, కేంద్ర అనుమతులు, భూసేకరణ తదితర అంశాలపై చర్చించారు. ప్రాజెక్టుకు సంబంధించిన అన్ని అనుమతులు, సాంకేతిక అంశాలను ముందుగానే పరిశీలించాలని సీఎం సూచించారు. న్యాయపరమైన చిక్కులు ఉన్నప్పుడు తొందరపడి పనులు చేపట్టడం వల్ల భవిష్యత్తులో సమస్యలు తలెత్తే అవకాశం ఉందని స్పష్టం చేశారు.

కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా సాధించాలి

కృష్ణా నదీ జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన న్యాయమైన వాటాను సాధించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సుప్రీంకోర్టులో రాష్ట్రం తరఫున సమర్థంగా వాదనలు వినిపించాలని న్యాయ నిపుణులకు సూచించారు. ఆంధ్రప్రదేశ్‌తో జలవివాదాలకు సంబంధించిన అన్ని అంశాలపై అవసరమైన ఆధారాలు, పత్రాలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 18 తర్వాత సుప్రీంకోర్టులో కేసు విచారణ నేపథ్యంలో న్యాయ నిపుణులతో సమగ్రంగా చర్చించాలని సూచించారు. రాష్ట్ర ప్రయోజనాలకు భంగం కలగకుండా న్యాయపరమైన అంశాలన్నింటినీ ముందుగానే సిద్ధం చేసుకోవాలని స్పష్టం చేశారు.

డిండి, అచ్చంపేట పనులు వేగవంతం చేయాలి

డిండి, అచ్చంపేట సాగునీటి పథకాల పనులను వేగవంతం చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. ఏదుల రిజర్వాయర్ నుంచి ఈ రెండు పథకాలకు నీటిని అందించే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. దీనికి అనుగుణంగా అవసరమైన సాంకేతిక చర్యలు చేపట్టాలని తెలిపారు. నార్లాపూర్ నుంచి ఏదుల వరకు 0.6 టీఎంసీల నీటిని తరలించేలా సమగ్ర డీపీఆర్ సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రాజెక్టుల నిర్మాణం, నీటి తరలింపు సామర్థ్యం, అవసరమైన అనుమతులు, వ్యయ అంచనాలపై స్పష్టతతో నివేదిక రూపొందించాలని సూచించారు.

అన్ని అంశాల పరిశీలన తర్వాతే ముందడుగు

సాగునీటి ప్రాజెక్టుల విషయంలో రాజకీయ లేదా ఇతర ఒత్తిళ్లకు లోనుకాకుండా సాంకేతిక, న్యాయపరమైన అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం స్పష్టం చేసినట్లు సమావేశ వర్గాలు తెలిపాయి. రాష్ట్రానికి రావాల్సిన నీటి వాటాను సాధించడంతో పాటు ఇప్పటికే చేపట్టిన ప్రాజెక్టులను సమర్థంగా వినియోగించుకునేలా ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు సూచించారు.

బడి పిల్లలు భద్రం!

వచ్చే విద్యా సంవత్సరం నుంచి సమగ్ర పాఠశాల భద్రతా విధానం
ప్రతి విద్యార్థికి అత్యున్నత రక్షణ కల్పనే ధ్యేయంగా సర్కారు అడుగులు
అన్ని బడుల్లో ఏకరీతి ప్రమాణాలతో స్కూల్ సురక్ష క్లబ్‌ల ఏర్పాటు
రంగంలోకి పోలీస్ శాఖ 'టీజీ ఎస్4ఎస్'ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ యూనిట్
పోక్సో, సైబర్, డ్రగ్స్, ట్రాఫిక్, విపత్తు సమస్యలపై ప్రత్యేక దృష్టి
పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నాలుగు అంచెల నివేదికల వ్యవస్థ

హైదరాబాద్: రాష్ట్రంలోని పాఠశాలల్లో చదువుకునే ప్రతి విద్యార్థికి అత్యున్నత రక్షణ కల్పించడమే ధ్యేయంగా తెలంగాణ ప్రభుత్వం అడుగులు వేస్తోంది. పోలీస్ శాఖ, విద్యాశాఖల ఉమ్మడి ఆధ్వర్యంలో దేశంలోనే తొలిసారిగా అత్యంత పటిష్టమైన 'సమగ్ర పాఠశాల భద్రతా విధానం'త్వరలోనే అమల్లోకి రానుంది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని అన్ని రకాల ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల బడుల్లో ఈ నూతన ప్రణాళికను అమలు చేసేందుకు పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించారు. పిల్లలకు ఎలాంటి భయం లేని, రక్షణతో కూడిన వాతావరణాన్ని కల్పించడమే ఈ నూతన విధానం ముఖ్య ఉద్దేశం.



సురక్ష క్లబ్‌ల ఏర్పాటు

ఇప్పటివరకు పాఠశాలల్లో వేర్వేరుగా, సమన్వయం లేకుండా సాగుతున్న విభిన్న క్లబ్‌లను (బాలికా శిశు సాధికారత, కౌమార భద్రతా క్లబ్‌లు) రద్దు చేసి, వాటన్నింటినీ ఏకీకృతం చేస్తారు. అన్ని బడుల్లో ఏకరీతి ప్రమాణాలతో స్కూల్ సురక్ష క్లబ్‌లను ఏర్పాటు చేయనున్నారు. ఈ విధానాన్ని రాష్ట్రంలోని 33 జిల్లాల్లో సాంకేతికంగా పర్యవేక్షించడానికి పోలీస్ శాఖ 'టీజీ ఎస్4ఎస్'ప్రోగ్రామ్ మేనేజ్‌మెంట్ యూనిట్ రంగంలోకి దిగనుంది. ఇందులో ప్రోగ్రామ్ మేనేజర్, చైల్డ్ సేఫ్టీ స్పెషలిస్ట్ వంటి 6 రకాల నిపుణుల పోస్టులను కాంట్రాక్ట్ ప్రాతిపదికన భర్తీ చేయనున్నారు. ఈ ప్రాజెక్టు సజావుగా సాగడానికి 2026--2027 ఆర్థిక సంవత్సరానికి గానూ పీఎంశ్రీ కార్యక్రమం నుంచి సుమారు రూ.2 కోట్ల నిధులను వెచ్?చంచేందుకు ప్రతిపాదించారు.

జీరో డిలే ప్రోటోకాల్..

పిల్లలపై లైంగిక వేధింపులు, తీవ్రమైన భద్రతా లోపాలు లేదా మాదకద్రవ్యాల రవాణా వంటి అత్యవసర ఘటనలు చోటు చేసుకున్నప్పుడు సాధారణ నివేదికల కోసం ఆగకుండా... పోలీస్, సంక్షేమ శాఖ, శిశు సంక్షేమ కమిటీలకు తక్షణమే సమాచారం అందించేలా జీరో డిలే ప్రోటోకాల్‌ను అమల్లోకి తెస్తున్నారు. భద్రతా మార్గదర్శకాలను పాటించడంలో విఫలమయ్యే యాజమాన్యాలు, అధికారులపై కఠినమైన శాఖాపరమైన చర్యలు ఉంటాయి. ఒకవేళ లోపాలు పునరావృతమైతే సదరు పాఠశాల గుర్తింపు, ఎన్ఓసీ అనుమతులను పూర్తిగా రద్దు చేస్తారు. విద్యార్థుల భద్రతను ప్రతి రోజూ పర్యవేక్షించడానికి, ఎలాంటి లోపాలు తలెత్తకుండా చూసేందుకు పాఠశాల, మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిలో నాలుగంచెల నివేదికల వ్యవస్థ ఉంటుంది.

భద్రత ఇలా..

1. బాలల రక్షణ: పోక్సో చట్టం, గుడ్ అండ్ బ్యాడ్ టచ్‌లపై అవగాహన, లింగ సమానత్వం, రుతుస్రావ పరిశుభ్రత, మానసిక ఆరోగ్య మద్దతుపై దృష్టి పెడతారు.
2. సైబర్ భద్రత: ఆన్‌లైన్ వేధింపులు, మోసాలు, డిజిటల్ ప్రైవసీ ఉల్లంఘనలు, సైబర్ వేధింపులు, బెదిరింపుల వంటి వాటికి అడ్డుకట్ట వేయడం, సోషల్ మీడియా నియంత్రణ ఉంటుంది.
3. మాదకద్రవ్యాల నివారణ: క్యాంపస్‌లలో డ్రగ్స్, పొగాకు రహిత వాతావరణాన్ని సృష్టించడం.
4. విపత్తుల నిర్వహణ: పాఠశాల భవనాల భద్రత, హాస్టల్ సేఫ్టీ, అగ్నిమాపక ఆడిట్ నిర్వహించడం.
5. రవాణా భద్రత: స్కూల్ బస్సుల ఫిట్‌నెస్ పరిశీలనతో పాటు డ్రైవర్ల నేపథ్యం ఖచ్చితంగా తనిఖీ.
6. ప్రత్యేక పిల్లల రక్షణ: దివ్యాంగ పిల్లల కోసం సులభతర మౌలిక వసతుల కల్పన.

తమ్మిడికుంట చెరువు పునరుద్ధరణ ప్రారంభించనున్న రేవంత్ రెడ్డి



హైదరాబాద్ : హైదరాబాద్ మాదాపూర్‌లోని తమ్మిడికుంట చెరువు ఆక్రమణల చెర నుంచి బయటపడి కొత్త రూపు సంతరించుకుంది. ఒకప్పుడు మురుగునీరు, ప్లాస్టిక్, నిర్మాణ వ్యర్థాలతో నిండిపోయి దుర్గంధభరితంగా మారిన ఈ చెరువు.. ఇప్పుడు పచ్చదనం, వాకింగ్ ట్రాక్, యోగా వేదిక వంటి సౌకర్యాలతో ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేందుకు సిద్ధమైంది. హైడ్రా చేపట్టిన పునరుద్ధరణ పనులు పూర్తికావడంతో ఈ నెల 11వ తేదీన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెరువును ప్రారంభించి నగర ప్రజలకు అంకితం చేయనున్నారు. శేరిలింగంపల్లి మండలం మాదాపూర్‌లో శిల్పారామం ఎదురుగా ఉన్న తమ్మిడికుంటను హైడ్రా మొదటి విడతలో పునరుద్ధరించిన ఆరు చెరువుల్లో ఒకటిగా పేర్కొన్నారు.ఇప్పటికే పాతబస్తీలోని బమ్ రుక్న్ ఉద్ దౌలా చెరువు, అంబర్‌పేటలోని బతుకమ్మకుంట, కూకట్‌పల్లిలోని నల్లచెరువును సీఎం రేవంత్ రెడ్డి ప్రారంభించారు. ఇప్పుడు తమ్మిడికుంట ప్రారంభానికి సిద్ధమైంది. అనంతరం మాదాపూర్‌లోని సున్నం చెరువు, ఉప్పల్‌లోని నల్లచెరువును కూడా ప్రారంభించాల్సి ఉంది. ఈ నెల 11వ తేదీన సీఎం రేవంత్ తమ్మిడికుంటను ప్రారంభించనున్న నేపథ్యంలో హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ సోమవారం అక్కడ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రారంభోత్సవ వేదిక, ప్రముఖులు, ప్రజల కోసం ఏర్పాటు చేస్తున్న సీటింగ్, వాహనాల పార్కింగ్, ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను అధికారులతో కలిసి సమీక్షించారు. కార్యక్రమానికి వచ్చే ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.చెరువు అభివృద్ధి పనులను పర్యవేక్షించిన విమోస్ టెక్నోక్రాట్స్ అధినేత యూనస్ పర్వేజ్.. చేపట్టిన పనులు, కల్పించిన సౌకర్యాలను అధికారులకు వివరించారు. తమ్మిడికుంట అసలు విస్తీర్ణం దాదాపు 30 ఎకరాలు కాగా.. ఆక్రమణల కారణంగా అది కేవలం 14 ఎకరాలకు పరిమితమైంది. ఎన్ కన్వెన్షన్‌తో పాటు చెరువు పరిధిలోని ఇతర ఆక్రమణలను తొలగించి భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడంతో చెరువు విస్తీర్ణం మళ్లీ పెరిగింది. ప్రస్తుతం దాదాపు 30 ఎకరాల విస్తీర్ణంలో పునరుద్ధరణ పనులు చేపట్టారు. చెరువు పరిరక్షణలో కీలక పరిణామంగా నిలిచిన ఎన్ కన్వెన్షన్ కూల్చివేత 2024 ఆగస్ట్ 24వ తేదీన జరిగింది. అనంతరం చెరువు పరిధిలోని ఇతర ఆక్రమణలను గుర్తించి తొలగించే చర్యలు చేపట్టారు. దీంతో చెరువు తన పూర్వ విస్తీర్ణాన్ని తిరిగి పొందేందుకు మార్గం ఏర్పడిందిగతంలో చెరువు చుట్టూ ముళ్ల పొదలు, వ్యర్థాలు పేరుకుపోయి ఉండేవి. మురుగునీరు నేరుగా చెరువులోకి చేరడంతో పరిసర ప్రాంతాల్లో దుర్వాసన, దోమల సమస్యలు తలెత్తేవి. బయోమెడికల్ వ్యర్థాలు కూడా అక్కడ పడేయడంతో నీరు, పరిసర భూగర్భ జలాలు కలుషితమయ్యే పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్యలను పరిష్కరించేందుకు హైడ్రా పూడికతీత, వ్యర్థాల తొలగింపు పనులు చేపట్టింది. సుమారు 15 అడుగుల లోతు వరకు పేరుకుపోయిన పూడికను తొలగించింది. ప్లాస్టిక్, నిర్మాణ వ్యర్థాలు, బండరాళ్లను బయటకు తీసింది. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువులోకి చేరిన నీరు భూమిలోకి ఇంకేందుకు కూడా అవకాశం ఏర్పడింది.తమ్మిడికుంట పునరుద్ధరణలో భాగంగా చెరువులోకి మురుగునీరు చేరకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. పరిసర ప్రాంతాల్లోని హాస్టళ్ల నుంచి వచ్చే మురుగునీటిని చెరువులోకి మళ్లకుండా అడ్డుకున్నారు. చెరువు చుట్టూ మురుగునీటి ప్రవాహాన్ని మళ్లించే కాలువ వ్యవస్థను అభివృద్ధి చేశారు. ఇందుకోసం 1,200 మిల్లీమీటర్ల వ్యాసం కలిగిన పైపులైన్‌ను ఏర్పాటు చేశారు. వర్షపు నీరు సక్రమంగా చెరువులోకి చేరేందుకు ఇన్‌లెట్లు, ఔట్‌లెట్‌ను పునరుద్ధరించారు. క్యాచ్‌మెంట్ డ్రెయిన్ వ్యవస్థను మెరుగుపరిచి, గతంలో మట్టితో కప్పుకుపోయి నిరుపయోగంగా మారిన నీటి ప్రవాహ మార్గాలకు తిరిగి జీవం పోశారు.దిగువన ఉన్న ముండ్లకత్వ చెరువుతో సహజ నీటి అనుసంధానాన్ని పునరుద్ధరించేందుకు కూడా చర్యలు చేపట్టారు. గతంలో కొండాపూర్, మాదాపూర్ ప్రాంతాల నుంచి వచ్చే వర్షపు నీరు శిల్పారామం పరిసరాల్లో నిలిచిపోయి ముంపునకు కారణం అయ్యేది. ఇప్పుడు ఇన్‌లెట్ల అభివృద్ధితో వరద నీరు నేరుగా తమ్మిడికుంటలోకి చేరేలా ఏర్పాట్లు చేశారు. దీంతో వర్షాకాలంలో శిల్పారామం పరిసరాల్లో నీరు నిలిచే సమస్య తగ్గే అవకాశం ఉంది.తమ్మిడికుంటను కేవలం నీటి నిల్వ కేంద్రంగా కాకుండా ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే ప్రాంతంగా తీర్చిదిద్దారు. ఇందుకోసం మొత్తం రూ.20 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టారు. చెరువు చుట్టూ 1.25 కిలోమీటర్ల పొడవున వాకింగ్ ట్రాక్ నిర్మించారు. ట్రాక్ వెంట మొక్కలు నాటి పచ్చదనం పెంచడంతో పాటు ల్యాండ్‌స్కేపింగ్ పనులు చేపట్టారు. ప్రజలు విశ్రాంతి తీసుకునేందుకు బెంచీలు, సమూహ కార్యక్రమాల కోసం రెండు గెజిబోలు, యోగా వేదిక, రోజ్ గార్డెన్‌ను ఏర్పాటు చేశారు. చెరువు చుట్టూ ఫెన్సింగ్ నిర్మించడంతో పాటు ఎఫ్‌టీఎల్ పరిధిలో శాశ్వత ప్రహరీ ఏర్పాటు చేశారు. ప్రజల రాకపోకల కోసం రెండు ప్రవేశ ద్వారాలను నిర్మించారు. క్రీడా సదుపాయాలు, ఇతర ప్రజోపయోగ పనులు కూడా చేపట్టారు.తమ్మిడికుంటలోకి చేరే మురుగునీటిని శుద్ధి చేసేందుకు ఎస్‌టీపీ నిర్మాణాన్ని కూడా హైడ్రా ప్రతిపాదించింది. ఇది అమలైతే చెరువులోకి మురుగునీరు చేరకుండా నియంత్రించడంతో పాటు దిగువన ఉన్న మూసీ నదిలోకి వెళ్లే కాలుష్య భారాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది. చెరువు పునరుద్ధరణతో వర్షపు నీటి నిల్వ సామర్థ్యం పెరగడం, భూగర్భ జలాల పునర్భరణకు తోడ్పడటం, దిగువ చెరువులతో సహజ నీటి ప్రవాహ వ్యవస్థ మెరుగుపడటం వంటి ప్రయోజనాలు కలగనున్నాయి. నగరంలో చెరువుల విస్తీర్ణం క్రమంగా తగ్గుతున్న నేపథ్యంలో తమ్మిడికుంటను తిరిగి దాదాపు 30 ఎకరాలకు విస్తరించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రధాన ఐటీ కారిడార్‌లో ఉన్న ఈ చెరువు పునరుద్ధరణతో పర్యావరణ పరిరక్షణకు, వరద నీటి నిర్వహణకు, స్థానిక ప్రజలకు ఆహ్లాదకరమైన బహిరంగ ప్రదేశం అందుబాటులోకి రావడానికి అవకాశం ఏర్పడింది

ధరణి దర్యాప్తు వేగవంతం భారీగా మారిన డబ్బులు లెక్కలు తీస్తున్న సీఐడీ అధికారులు



హైదరాబాద్ : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో డిజిటల్ విప్లవంగా ప్రచారం చేసుకుని తీసుకొచ్చిన ధరణి భూముల పోర్టల్‌లో జరిగిన సంచలన అక్రమాలపై తెలంగాణ సీఐడీ ఉక్కుపాదం మోపడంతో రాష్ట్ర రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. సీఐడీ విభాగంతో పాటు ప్రత్యేక దర్యాప్తు బృందాలు రంగంలోకి దిగి హైదరాబాద్ పరిసర ప్రాంతాలైన రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డిలతో పాటు పలు జిల్లాల్లో ఏకకాలంలో రహస్య దాడులు, ఆపరేషన్లు నిర్వహించాయి. ఈ క్రమంలో పోర్టల్ డెవలపర్లు, రెవెన్యూ ఆపరేటర్లు, డాక్యుమెంట్ రైటర్లతో పాటు పలువురు నిందితులను అరెస్ట్ చేసి కస్టడీకి తీసుకోవడం సంచలనం సృష్టిస్తోంది.ఫోరెన్సిక్ ఆడిట్‌లో లభించిన ఆధారాల ప్రకారం.. నాటి ప్రభుత్వంలోని కీలక పెద్దలు, నిబంధనలకు విరుద్ధంగా సెక్షన్ 22-ఏ కింద ఉన్న నిషేధిత జాబితా భూములు , కోట్లాది రూపాయల విలువైన అసైన్డ్ , సీలింగ్ మిగులు భూములను అక్రమంగా ప్రైవేట్ వ్యక్తులు, రియల్ ఎస్టేట్ దిగ్గజాల పేరిట మార్చివేసినట్లు దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. వ్యవస్థీకృతంగా డిజిటల్ రికార్డులను ట్యాంపర్ చేస్తూ, అధికారులపై ఒత్తిడి తెచ్చి రాత్రికి రాత్రే నిషేధిత జాబితా నుంచి వేలాది ఎకరాలను తొలగించడం వెనుక కొందరు బీఆర్ఎస్ అగ్రనేతల ఆశీస్సులు ఉన్నాయని విచారణలో ప్రాథమికంగా వెల్లడవుతోంది.ఈ దర్యాప్తు పురోగతితో బీఆర్ఎస్ శ్రేణుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ధరణి అనేది కేసీఆర్ ప్రభుత్వానికి అత్యంత ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్ కావడంతో, ఇందులో జరిగిన అవకతవకలు నేరుగా నాటి మంత్రివర్గం , ఐఏఎస్ అధికారుల చుట్టూ తిరుగుతున్నాయి. సీఐడీ దర్యాప్తు కేవలం క్రింది స్థాయి ఆపరేటర్లకే పరిమితం కాకుండా, పొలిటికల్ మాస్టర్‌మైండ్స్ , బిజినెస్ నెట్‌వర్క్‌లను టార్గెట్ చేసుకుని సాగుతుండటంతో.. రాబోయే రోజుల్లో నాటి కీలక నేతలకు నోటీసులు జారీ అయ్యే సూచనలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఈ సీఐడీ విచారణ వేగం వెనుక స్పష్టమైన రాజకీయ అజెండా ఉందనే ఆరోపణలను బీఆర్ఎస్ నేతలు గుప్పిస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తమ పాలనా లోపాలు, గ్యారెంటీల అమలులో వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే కక్షసాధింపు రాజకీయాల్లో భాగంలో ధరణి దర్యాప్తును రాజకీయాస్త్రంగా ఉపయోగిస్తోందని విమర్శిస్తున్నారు. అయితే రేవంత్ రెడ్డి సర్కార్ మాత్రం? బాధితులైన వేలాది మంది రైతులకు న్యాయం చేయడానికే, దోచుకున్న ప్రజా భూములను తిరిగి స్వాధీనం చేసుకునేందుకే ఈ న్యాయపరమైన దర్యాప్తు జరుపుతున్నామని గట్టిగా సమర్థించుకుంటోంది.రికార్డుల డిజిటైజేషన్ పేరుతో భూ రికార్డుల అధికారాలను కేంద్రీకరించి, కొందరు వ్యక్తులకు ప్రయోజనం చేకూర్చేలా మార్పులు చేశారన్నది ప్రధాన నిరూపిత అంశంగా మారబోతోంది. డిజిటల్ ఫుట్‌ప్రింట్స్, లాగ్ ఫైల్స్, ఐపీ అడ్రస్‌లు ఆధారంగా దర్యాప్తు సాగుతుండటంతో ఆడిట్ ట్రయల్‌ను తప్పించుకోవడం నేతలకు దాదాపు అసాధ్యం. దర్యాప్తు సంస్థల వద్ద ఉన్న పక్కా సాంకేతిక ఆధారాలు బయటకు వస్తే, అక్రమ మార్గంలో సంపాదించిన ఆస్తుల జప్తుతో పాటు పెద్ద తలకాయల అరెస్టులు తప్పవని భావిస్తున్నారు. తెలంగాణలో ధరణి కుంభకోణం దర్యాప్తు కేవలం రెవెన్యూ వివాదం మాత్రమే కాదు, కాంగ్రెస్-బీఆర్ఎస్ మధ్య సుదీర్ఘకాలం సాగే ప్రధాన రాజకీయ పోరాటంగా రూపాంతరం చెందింది. ఈ అక్రమాల మనీ ట్రయల్స్, భూ బదిలీల వెనుక ఉన్న నిజాన్ని సీఐడీ పూర్తిస్థాయిలో వెలుగులోకి తెస్తే.. అది బీఆర్ఎస్ పార్టీకి రాజకీయంగా పెద్ద దెబ్బ కావడమే కాకుండా, రాబోయే రోజుల్లో రాష్ట్రంలో మరిన్ని కీలక రాజకీయ పరిణామాలకు బాటలు వేస్తుంది.

400 కోట్ల క్లబ్ లో రామాయణం

హైదరాబాద్ : మైథలాజికల్ ఎపిక్ 'రామాయణ' బాక్సాఫీస్ వద్ద పాజిటివ్ టాక్‌తో దూసుకెళ్తోంది. నవంబర్ 5న ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమా మూడు రోజుల్లోనే రికార్డు స్థాయిలో కలెక్షన్స్ సాధించింది. మరి ఆ వివరాలు ఓసారి చూస్తే...వరల్డ్ వైడ్‌గా తొలి మూడు రోజుల్లో రూ.375.50 కోట్లకు పైగా గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. ఇండియావ్యాప్తంగా రూ.218.25 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించగా... రూ.182.70 కోట్ల నెట్ కలెక్ట్ చేసినట్లు ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి. శనివారం ఒక్క రోజే ఇండియావ్యాప్తంగా రూ.69.80 కోట్ల నెట్ కలెక్షన్స్ సాధించింది. ఓవర్సీస్ చూస్తే దాదాపు రూ.157.25 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించినట్లు తెలుస్తోంది. దీపావళి ఫెస్టివల్ ఆదివారం కావడంతో వీకెండ్ నెంబర్స్ మరింత పెరగొచ్చని ట్రేడ్ వర్గాలు అంచనా వేస్తున్నాయి.
వరల్డ్ వైడ్ మూడు రోజుల కలెక్షన్స్ - రూ.375.50 కోట్ల గ్రాస్
ఇండియా గ్రాస్ కలెక్షన్స్ - రూ.218.25 కోట్లు
ఇండియా నెట్ కలెక్షన్స్ - రూ.182.70 కోట్లు
ఓవర్సీస్ గ్రాస్ కలెక్షన్స్ - రూ.157.25 కోట్లుఈ మూవీకి నితీశ్ తివారీ దర్శకత్వం వహించగా... శ్రీరాముడిగా రణబీర్, సీతగా సాయిపల్లవి, లక్ష్మణుడిగా రవి దూబే, రావణుడిగా యశ్, మండోదరిగా కాజల్ అగర్వాల్, భరతుడిగా ఆదినాథ్ కొఠారే, శతృఘ్నుడిగా నితీశ్ శర్మ, శూర్పణఖగా రకుల్ ప్రీత్ సింగ్ నటించారు. దాదాపు రూ. 4 వేల కోట్ల బడ్జెట్‌తో నమిత్ మల్హోత్రా, కన్నడ స్టార్ యశ్ సంయుక్తంగా నిర్మించారు. 2028లో రెండో పార్ట్ రిలీజ్ కానుంది.రామాయణం కథలో డైరెక్టర్ నితీశ్ తివారీ సరికొత్త కోణాన్ని చూపించారు. రావణుడి పరిచయంతో ప్రారంభమైన స్టోరీ... లంకలో అసుర సామ్రాజ్యాన్ని అంతం చేసేందుకు ఇంద్రుడు (కునాల్ కపూర్) తన దేవతల సమాహారంతో భీకర యుద్ధం చేసి నగరాన్ని సొంతం చేసుకుని ఆ బాధ్యతను కుబేరునికి అప్పగిస్తాడు. ఈ ఓటమి తర్వాత కైకసి (శోభన) అవమాన భారంతో పెద్ద కొడుకు దశానన (యష్) దగ్గరకు వెళ్తుంది. దీంతో ఘోర తపస్సు చేసిన బ్రహ్మ నుంచి వరాలు పొందిన దశానన... రావణుడిగా తిరిగి వచ్చి లంకా నగరాన్ని హస్తగతం చేసుకుంటాడు. ముల్లోకాలకు అధిపతిగా అవతరిస్తాడు. రావణుడి పాలనలో యజ్ఞ యాగాదులు ఆటంకం కలుగుతుంది. దీంతో దేవతలు నిస్తేజితులవుతారు. సృష్టి వినాశనం అవుతుందని బ్రహ్మ దగ్గరకు వెళ్తాడు దేవేంద్రుడు (కునాల్ కపూర్). అప్పుడు మానవుడిగా అవతారం దాలుస్తారు బ్రహ్మ. అయోధ్యలో దశరథుని ఇంట రాముడు (రణబీర్ కపూర్) జన్మిస్తారు. ఆయన బాల్యం నుంచి సీతాదేవి (సాయి పల్లవి)తో స్వయంవరం, వివాహం... కైకేయి (లారా దత్తా)కు తండ్రి దశరథ మహారాజు (అరుణ్ గోవిల్) ఇచ్చిన వాగ్దానాన్ని నెరవేర్చడం కోసం వనవాసానికి వెళ్లడం, అక్కడ శూర్పణఖ (రకుల్ ప్రీత్ సింగ్) ముక్కును లక్ష్మణుడు (రవి దూబే) కోయడం, సీతను రావణుడు అపహరించడం వరకు... ఇందులో చూపించారు.

ఢిల్లీతో పోటీపడుతున్న భాగ్యనగరం!

హైదరాబాద్ : ఒకప్పుడు ప్రశాంత వాతావరణానికి చిరునామాగా ఉన్న హైదరాబాద్ నగరం ఇప్పుడు వాయు కాలుష్యంతో ఉక్కిరిబిక్కిరి అవుతోంది. దేశ రాజధాని ఢిల్లీని తలపించేలా గాలి నాణ్యత అత్యంత ప్రమాదకర స్థాయికి పడిపోవడం ఆందోళన కలిగిస్తోంది. నగరం మొత్తం మీద ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ 410గా నమోదవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఈ స్థాయి కాలుష్యం ప్రజారోగ్యంపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు.తాజా గణాంకాల ప్రకారం.. గాలిలోని అతి సూక్ష్మ ధూళి కణాలైన పీఎం 2.5 స్థాయిలు సురక్షిత పరిమితి అయిన 60 మైక్రోగ్రాములకు బదులుగా 278 మైక్రోగ్రాములుగా నమోదయ్యాయి. అదేవిధంగా పీఎం 10 పరిమితి 100 మైక్రోగ్రాములు కాగా, ప్రస్తుతం 326 మైక్రోగ్రాములుగా ఉంది. ఇది సాధారణం కంటే దాదాపు మూడు నుంచి నాలుగు రెట్లు అధికం. ఈ స్థాయిలో కాలుష్యం కొనసాగితే ప్రజల ఆరోగ్యంపై, ముఖ్యంగా పిల్లలు, వృద్ధులపై తీవ్ర ప్రభావం పడుతుందని పర్యావరణ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.నగరంలోని అన్ని ప్రాంతాల్లో కాలుష్య తీవ్రత ఉన్నప్పటికీ, ముఖ్యంగా పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కారిడార్ పరిధిలో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. డిఫెన్స్ కాలనీలో ఎఖిఎ ఏకంగా 685గా రికార్డయింది. శేరిలింగంపల్లిలో 666, మణికొండలో 602, యాంబియన్స్ ఫోర్ట్‌లో 596, ఎన్‌బీటీ నగర్‌లో 582గా కాలుష్య సూచీ నమోదైంది. ఈ ప్రాంతాలు కాలుష్య హాట్‌స్పాట్‌లుగా మారుతుండటం స్థానికులను భయాందోళనలకు గురిచేస్తోంది.హైదరాబాద్‌లో గాలి నాణ్యత ఇంతలా క్షీణించడానికి ప్రధాన కారణాలు పెరిగిన వాహనాల రద్దీ, అదుపులేని నిర్మాణ కార్యకలాపాలు, రోడ్లపై పేరుకుపోయిన దుమ్ముధూళి, పారిశ్రామిక ఉద్గారాలేనని అధికారులు భావిస్తున్నారు. ముఖ్యంగా ఐటీ కారిడార్‌లో నిరంతరాయంగా సాగే నిర్మాణాలు, వాహనాల రాకపోకలు కాలుష్య తీవ్రతను మరింత పెంచుతున్నాయి.ఈ నేపథ్యంలో ప్రభుత్వం తక్షణమే కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని పౌరులు, పర్యావరణవేత్తలు కోరుతున్నారు. రోడ్లను నీటితో శుభ్రపరచడం, నిర్మాణ ప్రాంతాల్లో దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవడం, వాహన కాలుష్య తనిఖీలను కఠినతరం చేయడం వంటివి వెంటనే ప్రారంభించాలని సూచిస్తున్నారు. లేకపోతే హైదరాబాద్ కూడా ఢిల్లీ లాగా గ్యాస్ ఛాంబర్‌గా మారే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

బైకులకు నిప్పు అంటించిన ఆకతాయిలు

హైదరాబాద్ : ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సిరి నగర్ కాలనీలో అర్ధరాత్రి వేళ ఆకతాయిలు సృష్టించిన భయాందోళన స్థానికులను తీవ్రగ్రాంతికి గురిచేసింది. ఇళ్ల ముందు నిలిపి ఉంచిన రెండు ద్విచక్ర వాహనాలకు దుండగులు కావాలనే నిప్పు పెట్టి పరారయ్యారు.సిరి నగర్ కాలనీలో అర్ధరాత్రి దాటిన తర్వాత నివాసాల ముందు పార్క్ చేసి ఉన్న రెండు బైక్‌లపై దుండగులు నిప్పు రాజేశారు. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో గమనించిన స్థానికులు ఆర్పివేసే ప్రయత్నం చేసినప్పటికీ, ఒక బైక్ పూర్తిగా కాలి బూడిదవ్వగా, మరొక బైక్ పాక్షికంగా దగ్ధమైంది.ఈ ఘాతకానికి పాల్పడిన దుండగులు బైక్స్‌కు నిప్పు పెట్టి అక్కడ నుంచి పరారవుతున్న దృశ్యాలు సమీపంలోని సీసీ కెమెరాల్లో స్పష్టంగా రికార్డయ్యాయి. గతంలో కూడా ఇదే కాలనీలో సరిగ్గా ఇదే తరహాలో రెండు కార్లకు దుండగులు నిప్పు పెట్టిన ఘటనలు జరిగినట్లు కాలనీవాసులు వాపోతున్నారు. వరుసగా వాహనాలను లక్ష్యంగా చేసుకుని తగలబెడుతుండటంతో స్థానికులు తీవ్ర భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.బాధితుల ఫిర్యాదు మేరకు ఎల్బీనగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా నిందితులను గుర్తించే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు.

ప్రకాశం జిల్లాలో కాలి బూడిదైన ప్రైవేట్ బస్సు..

డ్రైవర్ అప్రమత్తతతో తప్పిన పెను ప్రమాదం
కడప నుంచి విజయవాడ వెళ్తుండగా ఘటన
ముందు టైరు పేలడంతో మంటలు చెలరేగినట్లు నిర్ధారణ
ఘటనాస్థలికి చేరుకుని దర్యాప్తు చేస్తున్న పోలీసులు

ప్రకాశం : జిల్లాలో పెను ప్రమాదం త్రుటిలో తప్పింది. 33 మంది ప్రయాణికులతో వెళ్తున్న ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు అగ్నికి ఆహుతైంది. డ్రైవర్ సమయస్ఫూర్తితో వ్యవహరించడంతో ప్రయాణికులంతా సురక్షితంగా ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ఘటన వలేటివారిపాలెం మండలం చుండి సమీపంలో అర్ధరాత్రి దాటిన తర్వాత చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే, ఓ ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు 33 మంది ప్రయాణికులతో కడప నుంచి విజయవాడకు బయలుదేరింది. మార్గమధ్యంలో చుండి వద్దకు రాగానే బస్సు ముందు టైరు ఒక్కసారిగా పెద్ద శబ్దంతో పేలిపోయింది. వెంటనే అప్రమత్తమైన డ్రైవర్, వాహనాన్ని రోడ్డు పక్కన నిలిపివేశారు. టైరు పేలిన వెంటనే మంటలు చెలరేగడాన్ని గమనించిన డ్రైవర్, ప్రయాణికులను అప్రమత్తం చేసి అందరినీ హుటాహుటిన బస్సు నుంచి కిందకు దించేశారు. ప్రయాణికులంతా కిందకు దిగిన కొద్దిసేపటికే మంటలు వ్యాపించి బస్సు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. డ్రైవర్ సమయస్ఫూర్తి వల్లే పెను విషాదం తప్పిందని ప్రయాణికులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

బిజినెస్

బిలియనీర్లకు భారీ ఊరట.. పన్ను వసూలు ప్లాన్‌కు బ్రేక్!



కోట్లాది రూపాయల సంపద ఉన్నవారికి అదనపు పన్ను వేయాలా? వద్దా? ఈ ప్రశ్నకు అమెరికాలోని కాలిఫోర్నియా ప్రజలు తమ ఓటుతో సమాధానమిచ్చారు. బిలియనీర్ల సంపదపై 5 శాతం పన్ను విధించాలన్న ప్రతిపాదనను తిరస్కరించారు. దీంతో అత్యంత ధనవంతులపై పన్ను వేసి ఆరోగ్య రంగానికి నిధులు సమకూర్చాలన్న ప్రయత్నానికి బ్రేక్ పడింది. కాలిఫోర్నియాలో మెటా అధినేత మార్క్ జుకర్‌బర్గ్, కిమ్ కర్దాషియాన్, ఓప్రా విన్‌ఫ్రే వంటి సుమారు 200 మంది బిలియనీర్లు ఉన్నారు. వీరిలో 110 కోట్ల డాలర్లకు (సుమారు రూ.9 వేల కోట్లకు పైగా) మించి సంపద ఉన్నవారిపై ఈ పన్ను విధించాలని 'ప్రపోజిషన్ 40' పేరుతో ప్రతిపాదన తీసుకొచ్చారు. దాంతోపాటుగా వీరి మొత్తం ఆస్తులు, షేర్ల విలువపై ఒకేసారి 5 శాతం పన్ను వసూలు చేయాలనుకున్నారు. ఈ పన్నుతో సుమారు 10,000 కోట్ల డాలర్లు సమకూరుతాయని అంచనా వేశారు. అయితే, ట్రంప్ ప్రభుత్వం తీసుకొచ్చిన పన్నులు, ఖర్చులకు సంబంధించిన కొత్త చట్టం కారణంగా కాలిఫోర్నియాలో ఆరోగ్య రంగానికి కేంద్ర నిధులు తగ్గనున్నాయి. ఈ లోటును పూడ్చడంతోపాటు వైద్య సేవలకు ఆ డబ్బును ఉపయోగించాలని ప్రతిపాదకులు భావించారు. కాని, ఈ ప్రతిపాదనకు డెమొక్రాట్లు, కార్మిక సంఘాల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మరోవైపు, గూగుల్ సహ వ్యవస్థాపకుడు సెర్గీ బ్రిన్, కాలిఫోర్నియా గవర్నర్ గావిన్ న్యూసమ్‌లు ఈ పన్నును వ్యతిరేకించారు. పన్ను విధిస్తే బిలియనీర్లు ఇతర ప్రాంతాలకు వెళ్లిపోతారని, దీంతో రాష్ట్రానికి వచ్చే ఆదాయపు పన్ను కూడా తగ్గుతుందని గవర్నర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ప్రతిపాదనను అడ్డుకునేందుకు సెర్గీ బ్రిన్ ఏకంగా 10 కోట్ల డాలర్లకు పైగా ఖర్చు చేసినట్లు వార్తలు వచ్చాయి. అయితే, ఈ పన్నుకు మద్దతు ఇచ్చిన కార్మిక సంఘాల నాయకుడు డేవ్ రీగన్ మరోసారి ప్రయత్నిస్తామని ప్రకటించారు. 2028లో బిలియనీర్లపై పన్ను విధించే ప్రతిపాదనను మళ్లీ తీసుకొస్తామని తెలిపారు. ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల్లో ఒకటిగా ఉన్న కాలిఫోర్నియాలో ధనవంతులు, పేదల మధ్య భారీ ఆర్థిక వ్యత్యాసం ఉంది. అయినప్పటికీ బిలియనీర్లపై అదనపు పన్ను విధించాలన్న ప్రతిపాదనకు ఓటర్లు మద్దతు ఇవ్వకపోవడమనేది చర్చనీయాంశంగా మారింది.

సీఈఓపై దర్యాప్తు ఎఫెక్ట్.. ఒక్కరోజులో ఎన్విడియా మార్కెట్ విలువ రూ.17 లక్షల కోట్లు ఆవిరి!

ప్రపంచంలోనే అత్యంత విలువైన టెక్ కంపెనీల్లో ఒకటైన ఎన్విడియాకు ఒక్కరోజులో భారీ నష్టం వాటిల్లింది. ఆ సంస్థ సీఈఓ జెన్సన్ హువాంగ్‌పై వచ్చిన వివాదాస్పద ఆరోపణలు, కంపెనీ బోర్డు ప్రారంభించిన అంతర్గత దర్యాప్తు ఇన్వెస్టర్లలో ఆందోళనకు కారణమయ్యాయి. దీంతో అమెరికా స్టాక్ మార్కెట్‌లో సోమవారం ఎన్విడియా షేర్లు 4.27 శాతం పడిపోయాయి. ఈ పతనంతో కంపెనీ మార్కెట్ విలువలో సుమారు 190 బిలియన్ డాలర్లు (రూ.17 లక్షల కోట్లకు పైగా) తగ్గిపోయింది. మార్కెట్ ముగిసే సమయానికి ఒక్కో షేరు ధర 7.97 డాలర్లు తగ్గి 178.67 డాలర్ల వద్ద స్థిరపడింది.



ఒక్కరోజులో 190 బిలియన్ డాలర్ల మార్కెట్ విలువ తగ్గుదల

శుక్రవారం ట్రేడింగ్ ముగిసే సమయానికి ఎన్విడియా మార్కెట్ విలువ సుమారు 4.5 ట్రిలియన్ డాలర్లుగా ఉంది. సోమవారం ట్రేడింగ్‌లో ఒక దశలో షేర్లు 7.5 శాతం వరకు పడిపోవడంతో కంపెనీ మార్కెట్ విలువ భారీగా తగ్గింది. రాయిటర్స్ నివేదిక ప్రకారం.. మార్కెట్ ముగిసే సమయానికి షేరు ధర 4.27 శాతం తగ్గి 178.67 డాలర్లకు చేరింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువలో సుమారు 190 బిలియన్ డాలర్లు ఆవిరయ్యాయి. భారత కరెన్సీలో ఈ మొత్తం రూ.17 లక్షల కోట్లకు పైమాటే.

ఫోర్బ్స్ కుబేరుల జాబితాలోనూ రెండు స్థానాలు పతనం

ఎన్విడియా షేర్ల పతనం జెన్సన్ హువాంగ్ వ్యక్తిగత సంపదపైనా ప్రభావం చూపింది. ఫోర్బ్స్ రియల్‌టైమ్ బిలియనీర్స్ జాబితా ప్రకారం.. నవంబర్ 9న ఆయన సంపద 6.8 బిలియన్ డాలర్లు తగ్గి 155.4 బిలియన్ డాలర్లకు చేరింది. దీంతో ప్రపంచ కుబేరుల జాబితాలో ఎనిమిదో స్థానం నుంచి పదో స్థానానికి దిగజారారు. వారెన్ బఫెట్, లారీ ఎలిసన్ ఆయనను అధిగమించారు. హువాంగ్ సంపదలో ఎక్కువ భాగం ఎన్విడియాలో ఆయనకున్న 3.5 శాతానికి పైగా వాటా నుంచే వస్తోంది. అందుకే షేర్ల ధరలో మార్పులు ఆయన సంపదపై నేరుగా ప్రభావం చూపుతున్నాయి.

ఏఐ పెట్టుబడులపై సందేహాలూ కారణమేనా?

ఎన్విడియా షేర్లపై ఒత్తిడికి హువాంగ్ వ్యవహారంతో పాటు ఏఐ రంగంపై ఇన్వెస్టర్లలో పెరుగుతున్న ఆందోళనలు కూడా కారణమవుతున్నాయి. డేటా సెంటర్ల నిర్మాణం, విద్యుత్ వినియోగం, ఏఐ మౌలిక సదుపాయాలపై భారీగా పెట్టుబడులు పెట్టడం వల్ల ఆశించిన స్థాయిలో లాభాలు వస్తాయా? అనే సందేహాలు మార్కెట్‌లో ఉన్నాయి. మరోవైపు అమెరికా-చైనా మధ్య చిప్ ఎగుమతులపై ఆంక్షలు, నియంత్రణలు మరింత కఠినమయ్యే అవకాశం కూడా ఎన్విడియాకు సవాలుగా మారవచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రస్తుతం కంపెనీకి సంబంధించిన దర్యాప్తు కొనసాగుతోంది. నవంబర్ 17న ఎన్విడియా త్రైమాసిక ఆర్థిక ఫలితాలు ప్రకటించనుంది. ఈ ఫలితాలతో పాటు దర్యాప్తులో వెలువడే అంశాలు కంపెనీ షేర్ల తదుపరి కదలికలను ప్రభావితం చేసే అవకాశం ఉంది.

వివాహేతర సంబంధం.. చైనా గూఢచర్యం ఆరోపణలు

చైనా గూఢచారిగా అనుమానిస్తున్న అలిస్ హువాంగ్‌తో తనకు వివాహేతర సంబంధం ఉందని ఎన్విడియా సీఈవో జెన్సెన్ హువాంగ్ అంగీకరించారు. అలిస్ జెన్సన్‌తో సన్నిహిత సంబంధం ఏర్పరచుకుని ఆ తర్వాత సున్నితమైన సమాచారాన్ని చైనాకు బదిలీ చేసినట్టు వార్తా కథనాలు చెప్తున్నాయి. ఈ వ్యవహారంపై హువాంగ్ తన ఉద్యోగులకు పంపిన సందేశంలో భార్య, పిల్లలను బాధపెట్టినందుకు విచారం వ్యక్తం చేసినట్లు సమాచారం. తాను చేసిన పనికి క్షమాపణలు చెబుతూ.. కంపెనీ దర్యాప్తుకు పూర్తిగా సహకరిస్తానని వెల్లడించినట్లు కథనాలు తెలిపాయి.

ఈ పరిణామాల నేపథ్యంలో ఎన్విడియా బోర్డు స్వతంత్ర డైరెక్టర్లు, బయటి న్యాయ నిపుణులతో కూడిన కమిటీ ద్వారా దర్యాప్తు చేపట్టింది. అయితే జాతీయ భద్రతకు లేదా ఎన్విడియా రహస్య సమాచారానికి ముప్పు వాటిల్లిందని భావించడానికి ఎలాంటి కారణాలు లేవని బోర్డు స్పష్టం చేసింది. హువాంగ్ నాయకత్వంపై తమకు విశ్వాసం ఉందని పేర్కొంది. చైనా విదేశాంగ శాఖ సైతం గూఢచర్య ఆరోపణలను ఖండించింది.

స్పోర్ట్స్

ఇండియా వర్సెస్ న్యూజిలాండ్: ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయిన మూడో వన్డే

భారత్-న్యూజిలాండ్ మధ్య మూడో వన్డేకు వర్షం అంతరాయం కలిగించింది. హామిల్టన్‌లోని సెడ్డన్ పార్క్‌లో మంగళవారం జరగాల్సిన ఈ మ్యాచ్ ఒక్క బంతి కూడా పడకుండానే రద్దయింది. దీంతో ఐదు వన్డేల సిరీస్‌లో భారత్ 2-0 ఆధిక్యం కొనసాగుతోంది. ఉదయం నుంచి వర్షం కురుస్తుండడంతో టాస్ ఆలస్యమైంది. పలుసార్లు టాస్‌ను వాయిదా వేశారు. మధ్యలో కాసేపు వరుణుడు విరామం ఇవ్వడంతో టాస్ వరకు మార్గం సుగమమైంది. టాస్ గెలిచిన భారత కెప్టెన్ శుభ్‌మన్ గిల్ తొలుత బౌలింగ్ ఎంచుకున్నాడు. వరుసగా మూడోసారి టాస్ గెలిచిన గిల్.. గత రెండు మ్యాచ్‌ల్లో ఆడిన జట్టుతోనే బరిలోకి దిగాలని నిర్ణయించాడు. మ్యాచ్‌ను 40 ఓవర్లకు కుదించి నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. అయితే మ్యాచ్ ప్రారంభానికి సిద్ధమవుతున్న



సమయంలో మళ్లీ వర్షం మొదలైంది. కాసేపటికే అది మరింత పెరగడంతో మైదానాన్ని తిరిగి కవర్లతో కప్పేశారు. ఆటగాళ్లు కూడా డ్రెస్సింగ్ రూములకు చేరుకున్నారు. న్యూజిలాండ్ కాలమానం ప్రకారం రాత్రి 7.50 గంటలకు 20 ఓవర్ల మ్యాచ్ నిర్వహించేందుకు తుది గడువు ఉంది. అప్పటికి ఇంకా 70 నిమిషాల సమయం ఉన్నప్పటికీ వర్షం తగ్గే సూచనలు కనిపించకపోవడంతో అంపైర్లు మ్యాచ్‌ను రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. మూడో వన్డే రద్దుతో భారత్‌కు సిరీస్‌లో 2-0 ఆధిక్యం కొనసాగుతోంది. మిగిలిన రెండు మ్యాచ్‌ల కోసం ఇరు జట్లు టౌరంగాకు వెళ్లనున్నాయి. నాలుగో వన్డే నవంబర్ 13న బే ఓవల్‌లో, ఐదో వన్డే నవంబర్ 15న జరగనున్నాయి.

తండ్రిని తలపించే బ్యాటింగ్.. సెహ్వాగ్ తనయుడి 160 పరుగుల విధ్వంసం



భారత క్రికెట్‌లో మరో యువ సంచలనం వెలుగులోకి వచ్చాడు. విధ్వంసకర బ్యాటింగ్‌తో ప్రత్యర్థి బౌలర్లను హడలెత్తించిన మాజీ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ వారసుడు ఆర్యవీర్ సెహ్వాగ్.. తండ్రి తరహాలోనే మైదానంలో దూకుడు చూపించాడు. అండర్-19 ఆసియా కప్ 2026లో భాగంగా మంగళవారం యూఏఈతో జరిగిన కీలక మ్యాచ్‌లో ఆర్యవీర్ 160 పరుగులతో చెలరేగాడు. 168 బంతులు ఎదుర్కొని భారీ ఇన్నింగ్స్ ఆడాడు. ఈ టోర్నీలో ఇప్పటివరకు ఒక ఇన్నింగ్స్‌లో నమోదైన అత్యధిక వ్యక్తిగత స్కోరు ఇదే. మ్యాచ్ ఆరంభంలో ఆర్యవీర్ ఆచితూచి ఆడాడు. తొలి పరుగులు చేసేందుకు 14 బంతులు తీసుకున్నాడు. క్రీజులో కుదురుకున్నాక మాత్రం ప్రత్యర్థి బౌలర్లపై విరుచుకుపడ్డాడు. కీలక మ్యాచ్‌లో అతడి శతకం భారత్‌ను పటిష్ఠ స్థితిలో నిలిపింది. చివరకు 168 బంతుల్లో 160 పరుగులు చేసి ఔటయ్యాడు. 153 పరుగుల వద్దే ఈ టోర్నీలో అత్యధిక వ్యక్తిగత స్కోరు రికార్డును అధిగమించాడు. తండ్రి వీరేంద్ర సెహ్వాగ్ తొలి బంతి నుంచే బౌలర్లపై దాడి చేసేవాడు. అయితే ఆర్యవీర్ తన ఆటతీరులో తండ్రి దూకుడుతో పాటు విరాట్ కోహ్లీ నుంచి స్ఫూర్తి పొందుతున్నట్లు గతంలో వెల్లడించాడు. దూకుడుగా ఆడటమంటే తనకు ఇష్టమని, సెహ్వాగ్ శైలితో పాటు కోహ్లీ తరహాలోనూ క్రికెట్ ఆడాలనుకుంటున్నానని చెప్పాడు. ప్రత్యర్థి జట్లపై ఆధిపత్యం చెలాయించి భారత్‌కు విజయాలు అందించడమే తన లక్ష్యమని పేర్కొన్నాడు. దాన్ని ఆచరణలో పెడుతున్నట్లు తాజా ఇన్నింగ్స్‌తో స్పష్టమవుతోంది.

ముంబై ఇండియన్స్‌కు అర్షదీప్ సింగ్.. ట్రేడ్ ఖరారు చేసిన తండ్రి!

ఐపీఎల్ 2027 సీజన్‌కు ముందు అతిపెద్ద సంచలనం నమోదైంది. యువ పేస్ బౌలర్ అర్షదీప్ సింగ్ పంజాబ్ కింగ్స్‌ను వీడి ముంబై ఇండియన్స్ జట్టులోకి మారాడు. ఈ భారీ ట్రేడ్‌కు సంబంధించి పంజాబ్ కింగ్స్, ముంబై ఇండియన్స్ ఫ్రాంచైజీలు ఇంకా అధికారిక ప్రకటన విడుదల చేయనప్పటికీ, ఈ విషయాన్ని అర్షదీప్ తండ్రి దర్శన్ సింగ్ స్వయంగా ధ్రువీకరించారు. ప్రస్తుతం న్యూజిలాండ్ పర్యటనలో తన కుమారుడితో పాటు ఉన్న ఆయన, ఈ ట్రేడ్‌కు సంబంధించిన అధికారిక సమాచారం తమకు అందిందని ఒక వీడియో ఇంటర్వ్యూలో వెల్లడించారు. దీంతో ఈ ట్రేడ్ దాదాపు ఖరారైనట్లేనని స్పష్టమైంది.

మాకు కూడా ఆశ్చర్యంగానే ఉంది: దర్శన్ సింగ్

ప్రముఖ క్రీడా జర్నలిస్ట్ విమల్ కుమార్‌తో న్యూజిలాండ్‌లో మాట్లాడిన దర్శన్ సింగ్, ఈ ట్రేడ్ గురించి తమకు ముందుగా ఎలాంటి సమాచారం లేదని తెలిపారు. "ఈ ట్రేడ్ జరిగిందని మాకు కూడా ఆశ్చర్యంగానే తెలిసింది. దీని గురించి మాతో ముందస్తు చర్చలు ఏమీ జరపలేదు. ఇప్పుడు ట్రేడ్ అయినట్లు అధికారిక సమాచారం అందిందని అనుకుంటున్నాను" అని ఆయన పేర్కొన్నారు. అయితే, ఈ ఒప్పందంలో భాగంగా ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా పంజాబ్ కింగ్స్‌కు వెళ్తున్నాడా? లేదా? అనే విషయంపై ఆయన ఎలాంటి వ్యాఖ్య చేయలేదు.

పంజాబ్‌ను వీడటం భావోద్వేగంగా ఉంది

పంజాబ్ కింగ్స్‌తో అర్షదీప్‌కు ఉన్న అనుబంధాన్ని దర్శన్ సింగ్ గుర్తుచేసుకున్నారు. "ఒక వ్యక్తి ఎక్కడ పుట్టినా, ఆ ప్రదేశంతో జీవితాంతం ఒక ప్రత్యేకమైన అనుబంధం ఉంటుంది. అర్షదీప్‌కు పంజాబ్ కింగ్స్ అలాంటిదే. ఆ జట్టుతో అతనికి బలమైన బంధం ఉంది. అందుకే ఆ జట్టును వీడాల్సి రావడం కొంచెం భావోద్వేగంగా అనిపిస్తోంది" అని ఆయన అన్నారు. అయితే, ప్రతీ ఫ్రాంచైజీ తమ జట్టు సమతూకం కోసం ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటుందని, వారు కూడా



అందుకు అనుగుణంగానే అర్షదీప్‌ను ట్రేడ్ చేసి ఉంటారని అభిప్రాయపడ్డారు.

ముంబై జట్టులోకి వెళ్లడం సంతోషమే

పంజాబ్‌ను వీడటం బాధగా ఉన్నప్పటికీ, ముంబై ఇండియన్స్ జట్టులోకి వెళ్లడంపై దర్శన్ సింగ్ సంతోషం వ్యక్తం చేశారు. "ముంబై ఇండియన్స్‌లో చేరడం మాకు చాలా ఆనందంగా ఉంది. అక్కడ అతని పాత కెప్టెన్ రోహిత్ శర్మతో పాటు జస్ప్రీత్ బుమ్రా, సూర్యకుమార్ యాదవ్ వంటి పాత సహచరులు ఉన్నారు. కాబట్టి మేం సంతోషంగా ఉన్నాం" అని వివరించారు. ఐపీఎల్ 2027లో బుమ్రా, అర్షదీప్ కలిసి బౌలింగ్ చేయడాన్ని చూడటానికి తాను కూడా ఆసక్తిగా ఎదురుచూస్తున్నట్లు తెలిపారు. "ఇక ముంబై బౌలింగ్ అటాక్ అద్భుతంగా ఉంటుంది. ఏ స్కోరునైనా వారు అడ్డుకోగలరు. ప్రత్యర్థి జట్లను 200 పరుగుల లోపే కట్టడి చేస్తారని అభిమానులు అంటున్నారు. ఇది గొప్ప భాగస్వామ్యం అవుతుంది" అని ఆయన అన్నారు. అయితే, ఐపీఎల్‌లో పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలంగా (ఫ్లాట్‌గా) ఉంటాయని, అక్కడ ఏమైనా జరగొచ్చని వాస్తవిక దృక్పథంతో వ్యాఖ్యానించారు. ఈ ట్రేడ్ జీతం, ఇతర వివరాలు ఇంకా వెల్లడి కావాల్సి ఉంది.



‘ఇట్లు అర్జున’ ఈవెంట్‌లో రామ్ చరణ్ టంగ్ స్లిప్.. ‘కాకా’ మూవీపై బిగ్ అప్‌డేట్!

మహేష్ రెడ్డి తనయుడు అనీష్ హీరోగా టాలీవుడ్‌కు పరిచయం అవుతున్న చిత్రం ‘ఇట్లు అర్జున’. మహేష్ ఉప్పల దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాకు వెంకీ కుడుముల నిర్మాతగా వ్యవహరిస్తుండగా.. కింగ్ నాగార్జున సమర్పిస్తున్నారు. అనస్వర రాజన్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ మూవీ ప్రమోషన్స్‌ను చిత్ర బృందం జోరుగా నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల హైదరాబాద్‌లో గ్రాండ్‌గా మ్యూజికల్ కాన్సర్ట్ నిర్వహించారు. ఈ వేడుకకు గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర బృందానికి శుభాకాంక్షలు తెలిపారు. అయితే ఈ కార్యక్రమంలో చరణ్ చేసిన కొన్ని వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ‘ఇట్లు అర్జున’ సినిమాలో హీరో అనీష్ మూగవాడి పాత్రలో కనిపించనున్నారు. ఈ విషయాన్ని ప్రస్తావించిన రామ్ చరణ్.. తన కెరీర్‌లో ఎంతో ప్రత్యేకంగా నిలిచిన ‘రంగస్థలం’ సినిమాను గుర్తుచేసుకున్నారు. “రంగస్థలం సినిమాలో నేను చేసిన మూగవాడి పాత్ర కంటే.. ఈ సినిమాలో అనీష్ చేస్తున్న మూగవాడి క్యారెక్టర్ ఇంకా పెద్ద హిట్ అవ్వాలి” అంటూ మనస్ఫూర్తిగా కోరుకున్నారు. అయితే ఇక్కడే చరణ్ నోటి నుంచి చిన్న పొరపాటు దొర్లింది. ‘రంగస్థలం’ సినిమాలో ఆయన పోషించిన చిట్టిబాబు పాత్రకు వినికిడి లోపం ఉంటుంది. అంటే ఆ పాత్ర చెవిటిది కానీ మూగది కాదు. అయితే ప్రసంగం మధ్యలో ఫ్లోలో చరణ్ మూగవాడి పాత్ర అంటూ పేర్కొనడంతో అభిమానులు ఈ వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు. సరదాగా మీమ్స్ కూడా చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ అనస్వర రాజన్ గురించి కూడా రామ్ చరణ్ ప్రత్యేకంగా మాట్లాడారు. ఆమె నటన అద్భుతంగా ఉందని ప్రశంసించారు. భవిష్యత్తులో టాలీవుడ్‌లో ఆమె మంచి స్థాయికి చేరుకుంటుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ‘ఇట్లు అర్జున’ సినిమాలో అనీష్, అనస్వర రాజన్ మధ్య వచ్చే సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకుంటాయని, ఇద్దరి మధ్య కెమిస్ట్రీ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని చరణ్ అభిప్రాయపడ్డారు.అనస్వర రాజన్ ప్రస్తుతం మెగాస్టార్ చిరంజీవి, దర్శకుడు బాబీ కొల్లి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ డ్రామా ‘కాకా’లోనూ నటిస్తున్నారు. ఈ విషయాన్ని ప్రస్తావించిన రామ్ చరణ్.. తన తండ్రి చిరంజీవిని గుర్తుచేసుకుంటూ సరదాగా వ్యాఖ్యానించారు. “అనస్వర మా నాన్నగారి ‘కాకా’ సినిమాలో కూడా అద్భుతమైన పాత్ర చేస్తోంది. అయితే మా నాన్నగారిలాగా ‘చిరు లీక్స్’ పేరుతో నేను ఆమె క్యారెక్టర్ ఏంటనేది ఇప్పుడే లీక్ చేయను” అంటూ నవ్వులు పూయించారు. ఇక ‘కాకా’ సినిమా విజయంపై రామ్ చరణ్ తన నమ్మకాన్ని వ్యక్తం చేశారు. “ఈ సంక్రాంతికి ‘కాకా’ సినిమాతో మేం పక్కాగా బ్లాక్‌బస్టర్ కొడుతున్నాం” అంటూ ఎంతో కాన్ఫిడెంట్‌గా చెప్పారు. దీంతో అక్కడున్న మెగా అభిమానులు కేరింతలు, అరుపులతో సందడి చేశారు.

వరుస సినిమాలతో విజయ్ సేతుపతి బాక్సాఫీస్ దండయాత్ర.. రెండు నెలల్లో రెండు చిత్రాలు..!



‘బత్తా’ సినిమా విజయంతో మంచి జోష్‌లో ఉన్న కోలీవుడ్ స్టార్ హీరో, మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి ఇప్పుడు వరుస చిత్రాలతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. విభిన్నమైన కథలను ఎంచుకుంటూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఆయన.. ఇకపై బ్యాక్ టు బ్యాక్ సినిమాలతో థియేటర్లలో సందడి చేయబోతున్నారు. ఇప్పటికే ఆయన నటిస్తున్న పలు క్రేజీ ప్రాజెక్టులు విడుదలకు సిద్ధమవుతుండగా, మరికొన్ని చిత్రాలు నిర్మాణ దశలో ఉన్నాయి. ముఖ్యంగా రాబోయే కొన్ని నెలల్లో విజయ్ సేతుపతి సినిమాలు వరుసగా ప్రేక్షకుల ముందుకు రానుండటంతో అభిమానుల్లో ఆసక్తి పెరుగుతోంది. విజయ్ సేతుపతి నటించిన క్రైమ్ థ్రిల్లర్ ‘ట్రైన్’ ముందుగా ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రముఖ దర్శకుడు మిస్కిన్ తెరకెక్కించిన ఈ చిత్రంపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. డిసెంబర్ 4న ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమాను గ్రాండ్‌గా విడుదల చేసేందుకు మేకర్స్ సిద్ధమవుతున్నారు. మిస్కిన్ తనదైన ప్రత్యేకమైన మేకింగ్ స్టైల్‌తో ఈ సినిమాను రూపొందించినట్లు తెలుస్తోంది. క్రైమ్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ చిత్రం విజయ్ సేతుపతి అభిమానులకు ఎలాంటి అనుభూతిని అందిస్తుందో చూడాలి. ‘ట్రైన్’ విడుదలైన కొద్ది వారాలకే విజయ్ సేతుపతి మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నారు. దర్శకుడు త్యాగరాజన్ కుమారరాజా తెరకెక్కిస్తున్న ‘పాకెట్ నావెల్’ (గ్రాశీఎనవీ వీశీజవశ్రీ) చిత్రాన్ని పొంగల్ కానుకగా జనవరి 14న విడుదల చేయాలని ప్లాన్ చేస్తున్నారు. విభిన్నమైన కథాంశాలతో సినిమాలు రూపొందించే త్యాగరాజన్ కుమారరాజా, విజయ్ సేతుపతి కాంబినేషన్‌పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఇలా డిసెంబర్, జనవరి నెలల్లో వరుసగా రెండు సినిమాలు విడుదల కానుండటం విశేషం. ఇక విజయ్ సేతుపతి కెరీర్‌లో మరో కీలకమైన ప్రాజెక్ట్ ‘స్లమ్‌డాగ్ 33 టెంపుల్ రోడ్’ (గ్రాశ్రీబఎఽశీస్త్ర 33 ఎవఎజూశ్రీవ =శ్రీఽ). డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ చిత్రంపై భారీ అంచనాలు ఉన్నాయి. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ సినిమాకు సంబంధించిన డిజిటల్ స్ట్రీమింగ్ హక్కుల విషయంలో ప్రముఖ ఓటీటీ సంస్థ అమెజాన్ ప్రైమ్ వీడియోతో చర్చలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ డీల్ త్వరలోనే కొలిక్కి వస్తే, సినిమాను 2027 ఫిబ్రవరిలో థియేటర్లలో విడుదల చేయాలని చిత్ర బృందం భావిస్తున్నట్లు తెలుస్తోంది. పూరి జగన్నాథ్ మార్క్ యాక్షన్, విజయ్ సేతుపతి నటన కలిస్తే సినిమా ఎలా ఉండబోతుందనే ఆసక్తి అభిమానుల్లో కనిపిస్తోంది. మరోవైపు విజయ్ సేతుపతి నటిస్తున్న ‘ఇంజి వెల్లం’ సినిమా విడుదల తేదీపై కూడా చర్చ జరుగుతోంది.

రాజమౌళి వారణాసి.. తెలుగు రాష్ట్రాల్లో భారీ డీల్..!



రాజమౌళి-మహేశ్ బాబు కాంబోలో వస్తోన్న మోస్ట్ అడ్వెంచరస్ అండ్ అవైటేడ్ మూవీ వారణాసి. ఈ మూవీలో బాలీవుడ్ భామ ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా కనిపించనుంది. ఇప్పటికే రిలీజైన పోస్టర్స్, గ్లింప్స్ వారణాసిపై అభిమానుల్లో భారీ ఆశలు పెంచేశాయి. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఈ ఏడాది చివరికీ షూట్ ముగించేలా ప్లాన్ చేస్తున్నారు దర్శకధీరుడు. ఈ నేపథ్యంలోనే వారణాసికి సంబంధించి ఓ క్రేజీ టాక్ నెట్టింట వైరల్‌గా మారింది. ఈ మూవీ థియేట్రికల్ రైట్స్ కోసం భారీ డీల్ కుదిరిందని తెలుస్తోంది. తెలుగు రాష్ట్రాలతో పాటు ఇతర భాషలకు సంబంధించిన థియేట్రికల్ రైట్స్ భారీ ధరకు అమ్ముడైనట్లు సమాచారం. ఈ మూవీ హక్కులను ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ దాదాపు రూ.290 కోట్ల రికార్డ్ ధరకు సొంతం చేసుకున్నారని టాలీవుడ్ లేటెస్ట్ టాక్. అయితే దీనిపై ఎలాంటి అఫీషియల్ ప్రకటనైతే రాలేదు.భాషలు నేర్చుకోండి కాగా.. ఈ చిత్రాన్ని 2027, ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నారు. ఈ చిత్రంలో మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. రాజమౌళి చెప్పిన ప్రకారం ‘వారణాసి’లో రాముడు జీవించిన త్రేతాయుగం సీన్స్ కూడా ఉండనున్నాయి. ఇందులో భాగంగా మహేశ్.. శ్రీరాముడిగానూ కనిపించనున్నాడు.

పింక్ శారీలో శ్రీనిధి శెట్టి పరువాల జాతర.. ఫొటోలు చూస్తే ఫిదా అవ్వాల్సిందే!



printed by SHIVA D , published by SHIVA D and owned by SHIVA PRASAD , printed at Rathna graphics offset printers, 2-3-703/7, Tirumala nagar colony ,Ambeerpet, police line hyd-500013 TS.
published at door no: 5-12, badyathand, Noothanakal mandal, thallasingaram, suryapet- 508221 TS, editor: SHIVA PRASAD. gmail : mivartanews@gmail.com, cell : 9515342857, TGBIL/25/A0512